ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 03.07.2026 | సంపుటి : 12 | సంచిక : 344 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# బస్తీమే సవాల్

## తేల్చుకుందాం రండి..

### సవాళ్లు, ప్రతిసవాళ్లతో హీటెక్కిన తెలంగాణ రాజకీయం

- కాంగ్రెస్ మంత్రులు,బీఆర్ఎస్ నేతల ఆరోపణలు,ప్రత్యారోపణలతో ఉద్రిక్తత
- గురుకులాల్లో బీఆర్ఎస్ అవినీతి ఆరోపణలు..
- చర్చకు సిద్ధమంటూ గన్‌పార్క్ వద్ద చర్చకు సిద్ధమంటూ మంత్రుల బైఠాయింపు
- అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించిన హరీశ్ తదితరుల అరెస్టు
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు
- పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం పారిపోతోందని విమర్శ

వార్త 2లో


గురుకులాల్లో బీఆర్ఎస్ చేస్తున్న అవినీతి ఆరోపణలపై చర్చకు సిద్ధమంటూ గన్‌పార్కు వద్ద వేచిచూస్తున్న మంత్రులు పొన్నం,అడ్లూరి, అజారుద్దీన్


తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్కుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న హరీశ్ తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు



## గిరిజనులకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లు

# కేటాయించాలి

### మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆదివాసి ,గిరిజన ఎమ్మెల్యేలు.. పలు అంశాలపైన ముఖ్యమంత్రికి వినతి

**హైదరాబాద్,జులై 2(జనంసాక్షి):** ఏజెన్సీ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆదివాసి ,గిరిజన ఎమ్మెల్యేలు కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడం తో పాటు ఇందిర గిరి జల వికాసం పథకం అమలు చేయాలి..గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్గ్రేడ్ చేయాలని, ఐటీడీఏ లను మరింత బలోపేతం చేయాలని వినతిపత్రాలు సమర్పించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,అడ్లూరి లక్ష్మణ్,అజారుద్దీన్, ఎమ్మెల్యేలు ఆదినారాయణ,పాయం వెంకటేశ్వర్లు కోరం కనకయ్య, తెల్లం వెంకట్ రావు,వెడ్మ బొజ్జు తదితరులు ఉన్నారు.


బీఆర్ఎస్ చేసిన అప్పులు, రెండున్నరేళ్ల ప్రభుత్వపాలనపై చర్చలకు సిద్ధమంటూ తెలంగాణ భవన్‌లో మంత్రి జూపల్లి కోసం కుర్చీవేసి వేచి చూస్తున్న కేటీఆర్

## సవాల్ విసిరి పారిపోతున్నారు

- చర్చకు సిద్ధమన్నా స్పందించరేం?
- సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లెందుకు?
- ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో తెలిసింది
- అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- మీడియా సమావేశంలో కేటీఆర్ విమర్శలు

2లో..

## నా వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా..

### అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధం



- బీఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్ధమే ..
- వారు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నాం
- ఇంత జరుగుతున్నా కేసీఆర్ ఎందుకు మాట్లడటంలేదు?
- గత ప్రభుత్వం రూ.7.3 లక్షల కోట్ల అప్పులు చేసింది
- ఈ విషయం కేసీఆర్‌రే స్వయంగా మీడియాకు చెప్పాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు

2లో..

## బీఆర్ఎస్ గూండాగిరికి ప్రభుత్వం

# భయపడదు



బీఆర్ఎస్ హయాంలో అవినీతిని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ బయటపెట్టారు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్,జూలై2(జనంసాక్షి):** బీఆర్ఎస్ గూండాగిరికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని అసెంబ్లీ సాక్షిగా సీఎం

మిగతా 2లో..

# స్పీడ్‌పోస్ట్‌లో గంజాయి

### పార్శిళ్లలో సరఫరా చేసేందుకు స్మగ్లర్ల కొత్తరకం ఎత్తులు

- హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు
- వివరాలు వెల్లడించిన నగర సీపీ సజ్జన్నార్



**హైదరాబాద్,జూలై2(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్శిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. దీంతో ఇక పోస్టల్ పార్శిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్శిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపా రు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా

మిగతా 2లో..

# తవ్వేకొద్దీ అక్రమాలు



### సొమ్ము తీసుకొని అయోధ రామమందిరంలో ఉద్యోగాలు..

### ఆలయ విరాళాల చోరీలో మరో కోణం

**లక్నో(జనంసాక్షి):** అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసును తవ్వేకొద్దీ అవకతవకలు బయటపడుతున్నాయి. తాజాగా కీలక నిందితుడు అవినాష్ శుక్లాను విచారిస్తున్న అధికారుల బృందం మరో కోణంలో అక్రమాలను గుర్తించింది. ఆలయంలో వివిధ పోస్టులకు డబ్బులు తీసుకొని నియామకాలు చేశారని నిందితుడు వెల్లడించినట్లు పోలీసు వర్గాల సమాచారం. దీంతో ఇప్పుడు ట్రస్ట్ సభ్యుల్లో కీలకమైన వారిని ప్రశ్నించే అవకాశం ఉంది. ఆలయంలో దాదాపు 125 మందిని వివిధ పోస్టుల్లో నియమించారు. వీరిలో కొందరి వద్ద నుంచి సొమ్ములు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఆలయంలో ఉద్యోగుల అపాయింట్‌మెంట్ లెటర్లు, ఫార్మల్ సర్వీస్ అగ్రిమెంట్లు సహా ఇతర పత్రాలు ఏవీ పోలీసుల చేతికి అందలేదు. దీంతో ఎవరి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయో గుర్తించే పనిలో దర్యాప్తు అధికారులు ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఉద్యోగుల బ్యాంకు ఖాతాలు, వారి లావాదేవీలపై అధికారులు దృష్టి పెట్టనున్నారు. నియామకాల తర్వాత ఏమైనా భారీ లావాదేవీలు జరిగాయా? అనేది గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన అనుకల్ప్ మిశ్రా, లవ్ కుశ్ మిశ్రాకు ఈ నియామకాల అవకతవకల్లో కీలక పాత్ర ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. రామ మందిర విరాళాల దొంగతనం కేసులో అరెస్టైన 8 మంది నిందితులు.. గతేడాది జనవరి, ఫిబ్రవరిలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా సమయంలోనే అత్యధిక మొత్తంలో విరాళాలు దోచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

మిగతా 2లో..



# టీచర్లకూ మధ్యాహ్న భోజనం

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**పభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అమలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ సిబ్బందికీ అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే విద్యార్థులకు ఈ పథకం అమల్లో ఉండగా.. తాజాగా ఉపాధ్యాయులకూ వర్తింపజేశారు.

## నాలుగు కమిషనరేట్ల పోలీస్‌స్టేషన్ల

# పునర్వ్యవస్థీకరణ

### డీజీపీ సి.వి. ఆనంద్ సమీక్ష

**హైదరాబాద్, జూలై 2(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ సి.వి. ఆనం ద్, ఐపీఎస్, గురువారం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా కమిషనరేట్ల పోలీస్ కమిషనర్లు పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ, పరిధుల విభజన, పరిపాలనా అవసరాలు తదితర అంశాలపై తమ ప్రతిపాదనలను డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ల పరిధుల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ సంస్థలు, రెవెన్యూ డివిజన్లు, న్యాయస్థానాల పరిధులను పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్ హద్దులను నిర్ణయించాలని సూచించారు.

మిగతా 2లో..

# న్యాయ ప్రక్రియలో 'ఏఐ' సరికాదు

- కృత్రిమ మేధ వినియోగంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- న్యాయ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తుందని వ్యాఖ్య

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** న్యాయ ప్రక్రియలో కృత్రిమ మేధ వినియోగంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ధ్రువీకరించని ఏఐ ఆధారిత సమాచారం న్యాయ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తుందని అభిప్రాయపడింది. దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించింది. న్యాయ ప్రక్రియలో ఏఐ వినియోగాన్ని పరిశీలించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ దివాలా కేసులో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆలోక్ అరాధేలతో కూడిన సుప్రీం ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నకిలీ, ఉనికిలో

మిగతా 2లో..





# బండకింద నలిగిన బతుకులు

### ప్రమాదవశాత్తు క్వారీలో కార్మికులపై దొర్లిపడ్డ బండరాయి

### ఘటనలో ఏడుగురి దుర్మరణం.. పలువురికి తీవ్రగాయాలు

### కర్ణాటక దక్షిణ తాలూకాలోని మడ పట్టణంలో ఘోరం

**బెంగళూరు,జూలై2(జనంసాక్షి):** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకాలోని మడ పట్టణంలో గురువారం భారీ బండరాయి కార్మికులపై పడటంతో ఏడుగురు కార్మికులు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఓ స్టోన్ క్రషర్ కంపెనీలో కూలీలు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను బిహార్‌కు చెందిన వలస కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో సుమారు


మిగతా 2లో..

# ఉక్రెయిన్ ఉక్కిరిబిక్కిరి

### అర్ధరాత్రి వేళ కీవ్‌పై విరుచుకుపడిన రష్యా బలగాలు

- కొన్నిగంటలపాటు క్షిపణులు, డ్రోన్ల వర్షం
- పేలుళ్ల శబ్దాలకు వణికిన నగర ప్రజలు





**కీవ్(జనంసాక్షి):** రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చుతోంది. చమురుశుద్ధి కార్మాగారాలు లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేయడంతో రష్యాలో ఇంధన కొరత నెలకొన్న సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిస్పందనగా అర్ధరాత్రి ఉక్రెయిన్‌పై మాస్కో దళాలు విరుచుకుపడ్డాయి. కొన్నిగంటలపాటు క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించాయి. రాజధాని నగరం కీవ్‌లో భారీ పేలుళ్లు వినిపించడంతో ప్రజలు వణికిపోయారు. ఈ దాడుల్లో నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడిలో రష్యా బాలిస్టిక్,

మిగతా 9లో..



నీట్, జేఈఈ ఆధారిత అడ్మిషన్లలో..

## 50% మార్కుల వెయిటేజీ?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రవేశ పరీక్షల పేపర్ లీకేజీ ఘటనలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతోన్న వేళ.. వైద్య విద్య, ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కీలక మార్పులు చేసేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ఈ ప్రవేశాలకు బోర్డు పరీక్షల మార్కులను కూడా పరిగణనలోకి తీసుకునే అంశాన్ని పరిశీలిస్తోంది. 50 శాతం మార్కుల వెయిటేజీని

మిగతా 2లో..

## స్పీడ్ పోస్ట్‌లో గంజాయి

చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని జఖఎ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 -100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరా దారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు.

## నాలుగు కమిషనరేట్ల పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ




భవిష్యత్ పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో పోలీస్ స్టేషన్ల పరిధులను పునర్వ్యవస్థీకరించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో సంబంధిత అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాల పోలీస్ స్టేషన్ పరిధుల నిర్ణయంపై ప్రత్యేక సూచనలు చేసిన డీజీపీ, పోలీస్ స్టేషన్ ల పరిధుల మార్పులు , చేర్పుల నిర్ణయం వల్ల ప్రజలకు, ప్రభుత్వ శాఖలకు, న్యాయవ్యవస్థకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఆయా ప్రాంతాల భౌగోళిక, పరిపాలనా ప్రత్యేకతలను ప్రతిబింబించే విధంగా పోలీస్ స్టేషన్లకు తగిన పేర్లు నిర్ణయించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ ద్వారా ప్రజాకేంద్రిత, సమర్థవంతమైన పోలీసింగ్ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలని డీజీపీ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, ఐపీఎస్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఐపీఎస్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి సుమతి, ఐపీఎస్‌తో పాటు జాయింట్ కమిషనర్లు మరియు ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## నీట్, జేఈఈ ఆధారిత అడ్మిషన్లలో.. 50శాతం మార్కుల వెయిటేజీ..?

తీసుకొచ్చేలా కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. "మెడికల్, ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం బోర్డు పరీక్షల్లో వచ్చిన మార్కుల నుంచి 50 శాతం వెయిటేజ్ తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నాం. సిలబస్‌కు మరింత అనుగుణంగా ప్రవేశ పరీక్షలను మార్చడం, కోచింగ్ సెంటర్లపై ఆధారపడటాన్ని తగ్గించడం, కంప్యూటర్ ఆధారిత పరీక్షల వైపు క్రమంగా మారడం కోసం ఈ ప్రతిపాదనలు తీసుకొస్తున్నాం" అని సదరు వర్గాలు వెల్లడించాయి. ప్రవేశ పరీక్షల్లో పారదర్శక విధానాల అమలు కోసం గతేడాది కేంద్ర విద్యాశాఖ 9 మంది సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ కమిటీ 'మార్కుల వెయిటేజీ' అంశంపై కసరత్తులు చేస్తోంది. దీనిపై రానున్న వారాల్లో కేంద్ర ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పించనుంది. అనంతరం విద్యావ్యవస్థలో ప్రవేశాలకు సంబంధించి కేంద్రం కీలక సంస్కరణలు తీసుకొచ్చే అవకాశం ఉంది.

ఇంటర్ తర్వాత.. మీ కోసం మేటి కొలువులెన్నో!

ప్రస్తుతం మెడికల్, ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నీట్, జేఈఈ వంటి ఎంట్రెన్స్ టెస్టులను నిర్వహిస్తున్నారు. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు ఈ ప్రవేశ పరీక్షలు రాసి.. ఆ స్కోరు ఆధారంగా అడ్మిషన్లు సాధిస్తున్నారు. అయితే, ఇటీవలి కాలంలో ఈ ప్రవేశ పరీక్షల్లో మూల్యాంకన లోపాలు బయటపడటం, పేపర్ లీకేజీ వంటి ఘటనలు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది. మరోవైపు, ఈ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకుల కోసం విద్యార్థులు కోచింగ్ సెంటర్లపై తీవ్రంగా ఆధారపడటం, మెరుగైన ర్యాంకులు సాధించలేక బలవన్మరణాలకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే కేంద్రం తాజా మార్పులు తీసుకొచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## న్యాయ ప్రక్రియలో 'ఏఐ' సరికాదు

లేని పూర్వ తీర్పులను అందులో ప్రస్తావించారని, ఏఐ టూల్స్ సాయంతో దానిని సృష్టించినట్లు ధర్మాసనం గుర్తించింది. కల్పిత సమాచారాన్ని ప్రస్తావించడం న్యాయ ప్రక్రియకు చాలా హానికరమని పేర్కొన్న సర్వోన్నత న్యాయస్థానం.. ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. సరైన ధ్రువీకరణ లేకుండా రూపొందించే ఈ ఏఐ తీర్పులపై కఠినంగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు సూచించింది.

## ముంబయి, ఢిల్లీలో భారీ వర్షాలు..!

న్యూఢిల్లీ,ముంబై(జనంసాక్షి):దేశ రాజధాని దిల్లీ తోపాటు.. ఆర్థిక రాజధాని ముంబయిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ముంబయిలో గత 24 గంటల్లో దాదాపు 200 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దాదర్, పార్లే, హింద్‌మాతా, చార్‌కోప్, వర్లీ, గోరేగావ్, అంధేరీల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోకల్ రైళ్లపై వరద నీటి ప్రభావం పడింది. చాలా చోట్ల పట్టాలు నీటమునిగాయి. పలు రైళ్లు షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడుస్తున్నాయి. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం ముంబయి, శివారు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని పేర్కొంది. గురువారం రాత్రి సముద్రంలో అత్యధికంగా అలలు 4.27 మీటర్ల ఎత్తుకు వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.



# బస్తీమే సవాల్..

హైదరాబాద్,జూలై2(జనంసాక్షి): రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో పాలిటిక్స్ హీటెక్కాయి. కాంగ్రెస్ పార్టీ రెండున్నరేండ్ల చెత్త పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో పక్కాగా వివరిస్తాననిస్పష్టం చేశారు. డేట్ అండ్ టైం ప్లేస్ ఏదైనా సరే.. 'వరంగల్ ప్రెస్‌క్లబ్‌లోనా? అశోకనగర్‌లోనా? అసెంబ్లీలోనా? వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనా వైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని చాలెంజ్ చేశారు. కాగా, కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు గురువారం 11 గంటలకు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరిచిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఇదిలావుంటే గురుకులాల్లో టెండర్లలో అవినీతి ఆరోపణలపై చర్చల్లో ట్విస్టు చోటు చేసుకుంది. కేటీఆర్, హరీశ్ రావు గన్‌పార్క్‌కు రావాలని మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో గురుకులాల్లో అవినీతిపై చర్చకు హరీశ్ రావు సిద్ధమయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్‌పార్క్ బయలు దేరారు. గురుకులాలపై చర్చకు మేము ప్రెస్‌క్లబ్ రమ్మంటే మంత్రులు గన్‌పార్క్ రమ్మన్నారు. మాకు ఎలాంటి భేషజాలు లేవు. మీరు రమ్మన్నారు మేము వస్తున్నామని తెలిపారు. చర్చకు ఎక్కడికైనా మేము సిద్ధమని పేర్కొన్నారు. ఎలాంటి గొడవలు వద్దు కూర్చొని మాట్లాడుకుందామన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. ఒకవేళ మంత్రి జూపల్లి తెలంగాణ భవన్‌కు వెళ్తే..కేటీఆర్ చర్చించేందుకు రెడీగా ఉన్నారని పేర్కొన్నారు.కాగా, గన్‌పార్క్‌కు బయలు దేరిన హరీశ్ రావును పోలీసులు అడ్డుకోవడంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముగ్గురు మంత్రులు రమ్మంటేనే మేము వెళ్తున్నాం. ఎందుకు ఆపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. కావాలంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చర్చలను అడ్డుకుంటుందని హరీశ్ రావు మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కారు దిగి పాదయాత్రగా వెళ్లేందుకు హరీశ్ రావు యత్నించారు. ఈ క్రమంలో అక్కడ జరిగిన తోపులాటలో ఆయన కిందపడిపోయారు. ఆ వెంటనే మాజీ మంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరీశ్‌తో పాటు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు. దీంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం పారిపోయిందంటూ దుయ్యబట్టారు. అవినీతి జరిగింది కాబట్టే భయపడుతున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గన్‌పార్క్‌కు ముగ్గురు మంత్రులూ చేరుకుని.. అమరవీరుల స్థూపం దగ్గర కూర్చున్నారు. మంత్రులకు మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గన్‌పార్క్‌కు వచ్చారు. తెలంగాణ మంత్రులు, మాజీ మంత్రుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో గన్‌పార్క్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. అటు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్ దగ్గర కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బీఆర్ఎస్ గూండిగిరికి ప్రభుత్వం భయపడదు

రేవంత్ బయటపెట్టారని చెప్పారు. అధికారంలోకి వస్తామనే భ్రమతో బీఆర్ఎస్ నేతలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారు. టెండర్ విలువ కంటే ఎక్కువ అవినీతి ఎలా జరుగుతుంది? ఇలాగే ప్రవర్తిస్తే బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఆ పార్టీ సవాల్‌ను స్వీకరించి మంత్రులు చర్చలకు వెళ్లారు. బీఆర్ఎస్ నేతలే రాకుండా పారిపోయారు. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చకు సిద్ధమే'అని పొంగులేటి అన్నారు.

## నా వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా..

హైదరాబాద్,జూలై2(జనంసాక్షి): బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వం రూ.7.3 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.74వేల కోట్ల అప్పు చేసిందన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారు. అది నిజమా కాదా చెప్పాలన్నారు. ఇలా అప్పులు చేసి, ఎలా తీరుస్తారో ఎందుకు చెప్పలేదన్నారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా?మేం చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. నా వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా.. చర్చకు రావాలి. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నామని జూపల్లి అన్నారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని అన్నారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.

## సవాల్ విసిరి పారిపోతున్నారు

హైదరాబాద్,జులై 2(జనంసాక్షి): అసత్యాలతో ప్రజలను మభ్యే పెట్టే కార్యక్రమం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు విమర్శించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలకు సమాధానం ఇచ్చే తెగువ కాంగ్రెస్ సర్కార్‌కి లేదని ఎద్దేవా చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సవాల్ చేశారని.. ప్రెస్‌క్లబ్‌కి వెళ్తే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుల విషయంలో దమ్ముంటే రావాలని సీఎం సవాల్ చేశారని తెలిపారు. పలు విషయాలపై చర్చించడానికి తాము సిద్ధమని రేవంత్‌రెడ్డికి చెప్పామని.. ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. సవాల్ విరిసిన ముఖ్యమంత్రి పారిపోయారని సెటైర్లు గుప్పించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో సవాల్ విసిరారని.. సీఎం పంపితే జూపల్లి వస్తున్నారని తాము అనుకున్నామని.. కానీ పనికి మాలిన డైలాగ్‌లను జూపల్లి కొడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. సవాల్ విసిరి మంత్రులు పారిపోతున్నారంటేనే.. ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో తెలిసిందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు బయల్దేరగానే ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయించిందని ప్రశ్నించారు. గన్‌పార్కు రమ్మన్నారని.. వెళ్తుంటే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. చేతకాని వాళ్లు ఎందుకు సవాల్ విసరాలని నిలదీశారు. అసెంబ్లీలో తనకు గంట సమయం ఇవ్వాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

### తొలి బృందానికి చందర్‌కోట్ వద్ద స్వాగతం

శ్రీనగర్,జూలై2(జనంసాక్షి):హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్ లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు, వివిధ సంస్థలు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యంతో స్వాగతం పలికాయి. అంతకుముందు, జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ వార్షిక యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. భక్తులను స్వాగతించిన వారిలో డీఐజీ సర్గూన్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ట్రాఫిక్ ఎస్ఎస్పీ రాజా ఆదిల్ హమీద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. తర్వాత, భక్తులు బస చేసే మొదటి ప్రధాన కేంద్రం చందర్‌కోట్. ఈ పవిత్ర యాత్ర సాఫీగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు. పోలీస్, ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ , ట్రాఫిక్ పోలీస్, ఆరోగ్య శాఖ, ఆర్&బీ, ఎమర్జెన్సీ సర్వీసెస్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

## తవ్వేకొద్దీ అక్రమాలు

ఈ క్రమంలోనే నిందితుల ఇళ్లపై బుధవారం మరోసారి అయోధ్య పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ యోగా కేంద్రం నుంచి 'రామరాజ్య కోశ్' అనే పేరుతో ఉన్న విరాళాల హుండీని స్వాధీనం చేసుకున్నారు. దానిపై పేటీఎం క్యూఆర్ కోడ్ ఉంది. నిందితుల్లో ఒకరైన అవినాశ్ శుక్లా.. ఈ యోగా కేంద్రంలోని ఓ గదిలో గత పదేళ్లుగా నివాసం ఉంటున్నారని పోలీసులు తెలిపారు. ఈ కుంభకోణంలో ఎస్‌బీఐ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిపై దర్యాప్తు చేయాలంటూ ఈడీకి పోలీసులు లేఖ రాసినట్లు సమాచారం.

## బండకింద నలిగిన బతుకులు

15 నుంచి 20 మంది కార్మికులు ఉన్నారని వారు తెలిపారు. కొత్త క్రషర్ యూనిట్ ఏర్పాటు కోసం దాదాపు 100 అడుగుల ఎత్తులో ఒక హిటాచీ యంత్రం పని చేస్తోందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఒక పెద్ద బండరాయి జారి కింద ఉన్న కార్మికులపై పడిందని పోలీసులు వివరించారు. దీంతో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శిథిలాలను తొలగించి చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. క్వారీలో నిర్లక్ష్యం లేదా భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదంపై కర్ణాటక సీఎం శివకుమార్ స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి లభించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రత, రక్షణ అనేది క్వారీ యజమానుల బాధ్యత అని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలిన క్వారీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని సీఎం శివకుమార్ హెచ్చరించారు.





## నష్టాలు పూడ్చాకే..

### ఇప్పట్లో పెట్రో ధరలను తగ్గించలేం • ఇంకా నష్టాల్లోనే చమురు కంపెనీలు
### స్పష్టతనిచ్చిన కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ

న్యూఢిల్లీ,జూలై2(జనంసాక్షి): పెంచినే పెట్రో ధరలను ఇప్పట్లో తగ్గించే ఉద్దేశ్యం లేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇప్పటికీ పెద్ద మొత్తంలో నష్టాలు చవిచూస్తున్నా యని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ అన్నారు. జూన్ 30 వరకు పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ విక్రయాలపై రూ.74,781 కోట్ల మేర నష్టం చవిచూసినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ.. పాత క్రూడాయిల్‌నే ఇప్పటికీ ప్రాసెస్ చేస్తుండడం ఇందుకు కారణమన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పెట్రో ఉత్పత్తులను ప్రాసెస్ చేయడానికి రెండు నెలల ముందే ముడి చమురును ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. రెండు నెలల ముందు నుంచి ఈ పక్రియ మొదలవుతుంది. అంటే ఇప్పుడు ప్రాసెస్ చేస్తున్న ముడి చమురు ఏప్రిల్ లేదా మే నెలలో కొన్నది. అప్పట్లో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు చాలా అధికంగా ఉన్నాయి. అమెరికా– ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరాక ముడిచమురు ధరలు దిగొచ్చాయని హర్దీప్ సింగ్ పురి వివరించారు. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తారు? అని విలేకరులు ప్రశ్నించగా.. రాబోయే కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు అది సమంజసమైన ప్రశ్న అవుతుందంటూ పురీ పేర్కొన్నారు.



## రష్యాకు భారత రక్షణ ఎగుమతులు


### నాలుగు కంపెనీలోపై యూఎస్ నిషేధం ఎత్తివేత

వాషింగ్టన్,జూలై2(జనంసాక్షి):
రష్యాకు రక్షణ సాంకేతికతను, యంత్ర పరికరాలను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలతో గతంలో నాలుగు భారత కంపెనీలపై విధించిన ఆంక్షలను అమెరికా తాజాగా తొలగించింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్, లోకేశ్ మెషీన్స్ సంస్థలు కూడా ఉన్నాయి. వీటితో పాటు అహ్మదాబాద్‌కు చెందిన గేలక్సీ బేరింగ్స్, ఢిల్లీకి చెందిన శౌర్య ఏరోనాటిక్స్ కంపెనీలపై ఆంక్షలను అమెరికా తొలగించింది. యుద్ధ పరికరాల తయారీకి వాడే మైక్రోఎలక్ట్రానిక్స్ పరికరాలను రష్యాకు చెందిన ఆర్టెంక్స్ కంపెనీకి సరఫరా చేసిందని ఆర్ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ సంస్థపై, రక్షణ పరికరాల తయారీకి అవసరమైన యంత్రాలను సరఫరా చేసిందని లోకేశ్ మెషీన్స్ సంస్థపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇక, ఆయుధాల తయారీలో ఉపయోగించే రోలర్ బేరింగ్‌లను రష్యాకు సరఫరా చేస్తున్నారని గేలక్సీ బేరింగ్స్ సంస్థపై, రాడార్, నావిగేషన్ పరికరాలను విక్రయిస్తున్నారని శౌర్య ఏరోనాటిక్స్‌పై ఆంక్షలు విధించారు.

## ఉగ్రవాద వ్యతిరేకపోరులో రాజీలేదు

### ఐరాస వేదికగా గళమెత్తిన భారత్

న్యూయార్క్(జనంసాక్షి):ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఎలాంటి రాజీ లేదని ఐరాస వేదికగా భారత్ పునరుద్ఘాటించింది ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని వెల్లడించింది. ప్రపంచ ఉగ్రవాద నిరోధక వ్యూహంపై ఐక్యరాజ్యసమితి తాజాగా జరిపిన సమీక్షలో భాగంగా భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. "ఉగ్రవాది ఉగ్రవాదే! ఉగ్రవాదాన్ని సమర్థించడానికి ఎలాంటి కారణాలు వెతకకుండా.. ఈ హంతక భావజాలాన్ని సమూలంగా నిర్మూలించడానికి మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి" అని మనదేశం తరఫున హరీశ్ పిలుపునిచ్చారు. సీమాంతర ఉగ్రవాదం వల్ల భారత్ భారీగా నష్టపోతోందని, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు."సొంత ప్రజలకు కలిగిన ఈ వేదన భారతదేశ వైఖరిలో మార్పు తీసుకువచ్చింది. రాజకీయ కారణాలు, వ్యూహాత్మక లెక్కలతో సంబంధం లేకుండా ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో నిస్సందేహంగా ఖండించాలి. అంతర్జాతీయ సమాజం అంగీకరించిన ఫ్రేమ్‌వర్క్ లేకపోవడం వల్ల.. టెర్రరిజానికి వ్యతిరేకంగా కలిసికట్టుగా చర్యలు తీసుకోవడం వీలుకావడం లేదు. నియమనిబంధనల్లో ఈ లోపాలను సరిచేసేలా, ఉగ్రమూకలకు నిధులు, ఆయుధాలు అందకుండా నిరోధించేలా చట్టాలు ఆవశ్యకం" అని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు.



**పాక్ ఐసిస్ స్థావరాలపై అఫ్గాన్ డ్రోన్ దాడులు**

ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడి.. ఒక్కతాటిపైకి రావడానికి అవసరమైన రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించాలని సభ్యదేశాలను కోరారు. డ్రోన్లు, ఏఐ డీప్‌ఫేక్, వర్చువల్ కరెన్సీలు, డార్క్‌వెబ్ వంటి సాంకేతికతలను ఉగ్రవాద సంస్థలు విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఉగ్రదాడులతో నేరుగా ప్రభావితమయ్యే బాధితులకు పునరావాసం కల్పించే ప్రయత్నాలపైనా అంతర్జాతీయ సమాజం దృష్టిసారించాలని కోరారు.

## అరేబియా సముద్రంలో అమెరికా హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

### ఒకరు గల్లంతు

న్యూఢిల్లీ(జనంసాక్షి):అరేబియా సముద్రంలో గస్తీ కాస్తున్న అమెరికా ఎంహెచ్–60ఎస్ సీహాక్ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. ఈ ఘటనలో అందులోని సిబ్బంది ఒకరు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ కూడా ధ్రువీకరించింది. "సముద్రంలో గల్లంతైన అమెరికా ఎయిర్ క్రూమెన్ కోసం మా దళాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై దర్యాప్తు చేపట్టాము" అని ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ పై మోహరించిన హెలికాప్టర్ ఇది. సముద్ర జలాలపై హెలికాప్టర్ ల్యాండింగ్ అత్యంత ప్రమాదకరం. అత్యంత నిపుణులైన పైలట్లకు కూడా ఇది కత్తి మీద సామే. సాధారణంగా హెలికాప్టర్ పైభాగం బరువుగా ఉండటం వల్ల అవి నీటిలో తల్లకిందులయ్యే ముప్పు చాలా ఎక్కువ. జూన్‌లో హర్మూజ్ వద్ద అమెరికాకు చెందిన అపాచీ హెలి కాప్టర్ కుప్పకూలింది. దీనిలో ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. అదే సమయంలో తాము అమెరికా డ్రోన్‌ను కూల్చినట్లు ఇరాన్ ప్రకటించడం ఈ ఘటనపై అనుమానాలను రేపింది.



## ఎన్టీపీసి సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ పూర్తి

కరీంనగర్,జులై 2 (జనంసాక్షి) : రామగుండం ఎన్టీపీసీలోని బ్యాలెన్స్ రిజర్వాయర్‌లో 176మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టు పూర్తిస్థాయి వాణిజ్య ఉత్పత్తి దశలోకి చేరుకుంది. తాజాగా మంగళవారం చివరి 41.6మెగావాట్ల యూనిట్ కమర్షియల్ ఆపరేషన్‌లోకి వచ్చింది. ఈ ప్రాజెక్టులో 56మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్, 120మెగావాట్ల సర్ఫేస్‌సోలార్ ప్రాజెక్టును నిర్మించారు. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో ఇంతకుముందు 100మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును నిర్మించారు. మూడేళ్లుగా ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యంతో పనిచేస్తుంది. ఈక్రమంలో ఈప్రాజెక్టు విస్తరణను ఎన్టీపీసీ యాజ మాన్యం చేపట్టింది. 176మెగావాట్ల కంబైన్డ్ సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి తొలిదశ వంద మెగావాట్లు గత మే 2న, రెండో దశ 34.4 మెగావాట్లు మే29న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి.

## రష్యాకు భారత రక్షణ ఎగుమతులు

**నాలుగు కంపెనీలోపై యూఎస్ నిషేధం ఎత్తివేత**

వాషింగ్టన్,జూలై2 (జనంసాక్షి) : రష్యాకు రక్షణ సాంకేతికతను, యంత్ర పరికరాలను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలతో గతంలో నాలుగు భారత కంపెనీలపై విధించిన ఆంక్షలను అమెరికా తాజాగా తొలగించింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్, లోకేశ్ మెషీన్స్ సంస్థలు కూడా ఉన్నాయి. వీటితో పాటు అహ్మదాబాద్‌కు చెందిన గేలక్సీ బేరింగ్స్, ఢిల్లీకి చెందిన శౌర్య ఏరోనాటిక్స్ కంపెనీలపై ఆంక్షలను అమెరికా తొలగించింది. యుద్ధ పరికరాల తయారీకి వాడే మైక్రోఎలక్ట్రానిక్స్ పరికరాలను రష్యాకు చెందిన ఆర్టెంక్స్ కంపెనీకి సరఫరా చేసిందని ఆర్‌ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ సంస్థపై, రక్షణ పరికరాల తయారీకి అవసరమైన యంత్రాలను సరఫరా చేసిందని లోకేశ్ మెషీన్స్ సంస్థపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇక, ఆయుధాల తయారీలో ఉపయోగించే రోలర్ బేరింగ్‌లను రష్యాకు సరఫరా చేస్తున్నారని గేలక్సీ బేరింగ్స్ సంస్థపై, రాడార్, నావిగేషన్ పరికరాలను విక్రయిస్తున్నారని శౌర్య ఏరోనాటిక్స్‌పై ఆంక్షలు విధించారు.

## అగ్రరాజ్యంలో చీకటి కోణం

**రహస్యంగా 16మంది చిన్నారుల నిర్బంధం**

**ఓ కేసు కోసం వెళ్లిన పోలీసులకు కనపడ్డ దృశ్యం**



న్యూయార్క్,జూలై2 (జనంసాక్షి) : అగ్రరాజ్యం అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. 16 మంది చిన్నారులను ఏళ్ల తరబడి ఓ పాడుబడిన ఇంట్లో బంధించి ఉంచిన విషయం తాజాగా బయటపడింది. మరో కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసులు ఆ ఇంటికి వెళ్లగా అక్కడ కనిపించిన దృశ్యాలు వారిని దిగ్భ్రాంతికి గురి చేశాయి. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను వెంటనే రక్షించిన పోలీసులు, వారిని బంధించిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒహాయో రాష్ట్రంలోని హామ్డెన్‌లో రైల్వే ట్రాక్ పక్కన దట్టమైన చెట్లు, పొదల మధ్య ఉన్న ఓ ఇంటికి పోలీసులు సెర్చ్ వారెంట్‌తో వెళ్లారు. అక్కడ 16 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు బంధించి ఉంచినట్లు గుర్తించారు. గత నాలుగేళ్లుగా వారు అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులను 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒకే గదిలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిన్నారుల వయస్సు 18 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండగా, వారిలో బాలురు, బాలికలు ఉన్నారు. అంతేకాక, ఆ ఇంట్లో ఇంతమంది చిన్నారులు ఉన్న విషయం చుట్టుపక్కల వారికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చిన్నారులకు బయటి ప్రపంచంతో దాదాపు ఎలాంటి సంబంధం లేకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వారిలో ఎవరినీ ఇప్పటివరకు తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చాలా కాలం పాటు బంధించబడటంతో వారు సాధారణంగా మాట్లాడటానికే ఇబ్బంది పడుతున్నట్లు ఒహాయో అటార్నీ జనరల్ తెలిపారు. దాదాపు అందరూ అడవి మనుషుల్లా కనిపించారని ఆయన పేర్కొన్నారు. ఈ 16 మంది చిన్నారులూ ఒకే కుటుంబానికి చెందినవారని అధికారులు వెల్లడించారు. రక్షించిన వెంటనే ఏడుగురు చిన్నారులను చికిత్స కోసం కొలంబస్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో అత్యవసర చికిత్స కోసం తరలించాల్సి వచ్చింది. ఘటనలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలైన గ్యారీ సైడర్స్ జూనియర్, గ్యారీ సైడర్స్ సీనియర్, క్రిస్టినా సైడర్స్, ఎలిజబెత్ సైడర్స్‌లపై సెకండ్-డిగ్రీ ఫెలనీ 'చైల్డ్ ఎండేంజర్‌మెంట్' అభియోగాలు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ప్రతి నిందితుడికి 3 లక్షల డాలర్ల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయాలని కోర్టు నిర్ణయించింది.

## తెలంగాణ వ్యవసాయంపై ఇండోనేషియా ఆసక్తి

**వ్యవసాయ సంచాలకునితో బృందం భేటీ**

**పలు పంటల విధానంపై వివరించిన డా. గోపి**



హైదరాబాద్,జూలై2 (జనంసాక్షి) : ఇండోనేషియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం తెలంగాణ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించింది ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు భారత పర్యటనలో భాగంగా ఇండోనేషియా దేశానికి చెందిన నలుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపీని మర్యాదపూర్వకంగా కలిసింది. సమావేశంలో తెలంగాణ వ్యవసాయరంగం పురోగతి, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయంలో అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, పంపిణీపై వివరించగా, తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ అధికారులు విత్తన ధృవీకరణ, నాణ్యత నియంత్రణ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు భరోసా, రైతు బీమా, ప్రకృతి వ్యవసాయం, నేల ఆరోగ్య నిర్వహణ, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ డ్రోన్ల వినియోగం, జాతీయ ఆహార భద్రతా మిషన్, పప్పుధాన్యాల అభివృద్ధి కార్యక్రమం, నూనెగింజల ఉత్పత్తి ప్రోత్సాహక పథకం, డిజిటల్ క్రాప్ సర్వే, అగ్రి స్టాక్ (ఫార్మర్ రిజిస్ట్రీ), యూరియా బుకింగ్ యాప్, ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్మెంట్ సిస్టమ్, రైతు వేదికలు, రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ వంటి వినూత్న కార్యక్రమాల అమలు, వాటి ప్రయోజనాలను అధికారులు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న రైతు కేంద్రిత, పారదర్శక, సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను ఇండోనేషియా ప్రతినిధి బృందం అభినందించింది. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్నటువంటి రైతు భరోసా రైతు బీమా యూరియా యాప్ సహజ వ్యవసాయం వంటి పథకాలపై ప్రశంసించారు ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఆహార భద్రత, రైతుల సామర్థ్యాభివృద్ధి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి అంశాలపై ఇరు పక్షాలు విస్తృతంగా చర్చించాయి. ఈ సమావేశంలో ఇండోనేషియా ప్రతినిధి బృందం తరఫున ప్రతినిధి బృందం సమన్వయకర్త, ఇండోనేషియా ఉన్నత విద్య, శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిశోధన / అభివృద్ధి డైరెక్టరేట్ జనరల్ కార్యదర్శి ప్రొఫెసర్ జునైది ఖోటిబ్, ఇండోనేషియా డిఫెన్స్ యూనివర్సిటీకి చెందిన డా. పుంగ్కి ధర్మ సపుత్ర, ఇండోనేషియా స్టేట్ సెక్రటేరియట్కు చెందిన మస్జితా, అలాగే న్యూఢిల్లీలోని ఇండోనేషియా రాయబార కార్యాలయం ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అటాషే ప్రొఫెసర్ ఫువాద్ పాల్గొన్నారు. శాఖ ఉన్నతాధికారులు, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ అధికారులు, తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## మంత్రులకు చర్చించే దమ్ము ఉంది : దానం

హైదరాబాద్,జూలై2 (జనంసాక్షి) : కాంగ్రెస్ మంత్రులకు దమ్ము, ధైర్యం ఉందని, అందుకే వారు బహిరంగ చర్చకు ముందుకు వచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. మంత్రులు పూర్తిగా, పారదర్శకంగా పనిచేస్తున్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద ఆయన మాట్లాడారు. తప్పు చేయలేదనే నమ్మకంతోనే ప్రజల ముందుకు వచ్చి మంత్రులు చర్చకు సిద్ధమయ్యారని చెప్పారు. అలాగే హరీశ్‌రావు అండ్ కో చర్చకు రావాలని కోరితే వారు తప్పించుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి విమర్శలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గురుకులాలపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు మంత్రులు ముందుకొచ్చారని దానం నాగేందర్ పేర్కొన్నారు.

కాగా, గురుకులాల నిర్వహణ, అవినీతి ఆరోపణల అంశంపై రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహ్మద్ అజారుద్దీన్ బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పలు అంశాలపై చర్చించడానికి రెడీ అని చెప్పారు. అయితే, ఈరోజు కాంగ్రెస్ మంత్రులు మొదటగా అసెంబ్లీకి బయలుదేరారు. అనంతరం గన్‌పార్క్‌కు చేరుకుని తమ సన్నద్ధతను ప్రకటించారు. గురుకులాల వ్యవహారంలో తమ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, అవినీతి ఆరోపణలపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని మంత్రులు స్పష్టం చేశారు.

## బార్బిక్యూనేషన్ రెస్టారెంట్‌లో కంపు

హైదరాబాద్,జూలై2 (జనంసాక్షి) : హైదరాబాద్ ఉప్పరపల్లిలోని బార్బిక్యూనేషన్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలతోపాటు, పాడైపోయిన చికెన్, మటన్, ఫిష్, ఐస్‌క్రీమ్స్, పండ్లు వంటి పదార్థాలను ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసినట్లు గుర్తించారు. పాడైన మాంసంపై స్టిక్కర్లను మార్చి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు. గతంలో ఇలానే తనిఖీలు చేసినప్పుడు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలగా.. తీరు మార్చుకోవాలని సూచించినట్లు చెప్పారు. అయినా రెస్టరంట్ యాజమాన్యం తీరు మారలేదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా విధించినట్లు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనిఖీల్లో కుళ్లిపోయిన, గడువు ముగిసిన చికెన్, మటన్, చేపలు, ప్రాన్స్, కేక్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏ ఐటమ్ చెక్ చేసినా పరిస్థితి అలాగే ఉండటంతో అధికారులు షాకయ్యారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలపై ఉన్న ఎక్స్‌పైరీ తేదీలను మార్చి, కొత్త తేదీలు ముద్రించి వినియోగిస్తున్నట్లు గుర్తించారు.

## సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ

**కొత్తగా పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల నియామకం**

హైదరాబాద్,జూలై2(జనంసాక్షి) : కరీంనగర్, వరంగల్, వికారాబాద్ జిల్లాల పరిధిలోని 14 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా సంఘాల పాత పాలక వర్గాల స్థానంలో కొత్త పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన కమిటీల పదవీకాలం ఆరు నెలలు లేదా సహకార సంఘాల తదుపరి ఎన్నికలు జరిగే వరకూ కొనసాగుతుందని స్పష్టం చేసింది. సంఘాల పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా, వారి సేవలకు ఎక్కడా అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేసింది. పీఏసీఎస్‌ల పూర్తి స్థాయి పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నూతన పర్సన్-ఇన్-చార్జ్ కమిటీలు బాధ్యతల్లో ఉంటాయి. ఈ సంఘాలలో గత కొంతకాలంగా చోటుచేసుకుంటున్న తీవ్ర పరిపాలనా లోపాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ రుణాల వసూళ్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగడం, గడువు ముగిసినా బకాయిలు చెల్లించని డిఫాల్టర్లపై పాత కమిటీలు ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోకపోవడం వంటి అంశాలపై సహకార శాఖకు నివేదికలు అందాయి. పాత పాలక వర్గాల నిర్లక్ష్యం కారణంగా సంఘాల ఆర్థిక పరిస్థితి దెబ్బతినడంతో పాటు సంస్థాగతంగా తీవ్ర లోపాలు తలెత్తాయని నివేదికలో తేలింది. ఈ నేపథ్యంలోనే సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి, పారదర్శకతను పెంచడానికి వీలుగా పాత కమిటీలను రద్దు చేస్తూ కొత్త కమిటీలను నియమించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఈ 14 సంఘాల నూతన పర్సన్-ఇన్-చార్జ్ కమిటీలు బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి.

## బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తామని మోసం

**అమాయకులకు డబ్బు ఆశ చూపి దోపిడీ**

**పోలీసుల వేషంలో బెదరించి లూటీలు**

**సత్తుపల్లి గంగారాం డెకాయిటీ కేసును ఛేదించిన పోలీసులు**

**12 మంది నిందితుల అరెస్ట్.. మరో ఇద్దరి కోసం గాలింపు**

ఖమ్మం,జూలై2(జనంసాక్షి): బ్లాక్‌మనీని వైట్‌గా మారుస్తామని అమాయకులకు ఆశ చూపించి.. అనంతరం పోలీసుల వేషంలో బెదిరించి నగదు దోచుకున్న ముఠాను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారంలో జరిగిన సంచలన డెకాయిటీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలోని సత్తుపల్లి పోలీస్ ప్రత్యేక బృందాలు ఈ కేసులో ముమ్మర దర్యాప్తు జరిపి మొత్తం 12 మంది నిందితులను అరెస్ట్ చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఈ దోపిడీ ముఠాలో భాగస్వాములు కావడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. అరెస్టైన వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ కేసులో 14 మంది నిందితుల్లో 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఓ కానిస్టేబుల్, ఆర్ఎస్సై కూడా ఉన్నట్లు తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. గత నెల 25న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పట్టణ సీఐ టి. శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గంగారం శివారులో నిర్వహిస్తున్న తనిఖీల్లో 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం తెలిసింది. దర్యాప్తులో ఏలూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ఈద చంటిబాబు ఈ ముఠా సూత్రధారిగా గుర్తించారు. అతడు మరో 13 మందితో కలిసి వివిధ సిమ్‌కార్డుల ద్వారా అమాయకులకు ఫోన్ చేసి, తాము రియల్ ఎస్టేట్ వ్యాపారులమని.. తమ వద్ద ఉన్న బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చుకోవాల్సి ఉందని నమ్మించేవారు. రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షలు ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించి బాధితులను నిర్ణయించిన ప్రాంతానికి రప్పించేవారు. బాధితులు నగదు తీసుకొచ్చిన తర్వాత డమ్మీ కరెన్సీ నింపిన బ్యాగును ఇచ్చేవారు. అదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ముఠాలోని కొందరు నిజమైన పోలీసులు.. నకిలీ పోలీసులతో అక్కడికి చేరుకుని దాడి చేసేవారు. నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి బాధితుల వద్ద ఉన్న నగదును లాక్కొని పరారయ్యేవారు.

## బాసర దొంగల పట్టివేత

నిర్మల్,జూలై2 : బాసర అమ్మవారి ఆలయంలో చోరీ అయిన అమ్మవారి వెండి కిరీటం, వెండి పట్టీ దొరికినట్లు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ప్రకటించారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఎస్పీ జానకీ షర్మిల.. దొంగతనం జరిగిన తీరు.. దోపిడీదారులను పట్టుకున్న వివరాలను వెల్లడించారు. ఎంతో పవిత్రమైన బాసర ఆలయంలో పెద్ద వెండి కిరీటం దొంగతనం జరిగినట్లు కంప్లయింట్ వచ్చిందన్నారు. విచారణ చేపట్టగా.. ఇది అంతర్ రాష్ట్ర దొంగల పనిగా గుర్తించినట్లు వెల్లడించారు.

## యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు విషయంలో కినుక

**కేబినెట్ భేటీకి కొండా సురేఖ గైర్హాజర్**

హైదరాబాద్,జులై 2 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి ఆమె రాకపోవడంపై సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సురేఖ తన విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ, గురువారం జరిగిన కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉండి ఉంటాయని అంతా భావిస్తున్నారు. ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి కొండా సురేఖ అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటు విషయంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తీవ్ర అలక పూనిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే ఇవాల్టి కేబినెట్ సమావేశానికి దూరంగా ఉన్నారని సచివాలయ వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది.

## గౌడులు సమాజ బాంధవులు

**ఎస్‌పీటీయూ వి.సి వెల్దండ నిత్యానందరావు**



హైదరాబాద్,జూలై2 (జనంసాక్షి) : గౌడులపై వచ్చిన కథలను ఇరవై మంది రచయితలు, రచయిత్రిలు రాసిన ఇరవై కథలను సంకలనం గ్రంథం "మోకు - గౌడు బతుకు కథలు" ఈరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీ వి.సి. నిత్యానందరావు గారు ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సభ ఓయూ ప్రొఫెసర్ రఘు ఈ సభకు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ గౌడ వృత్తి సమాజంలో అందరికీ కల్లు అందించి ఆస్తులుగా మారారు. ఇతర వృత్తులతో పోలిస్తే గౌడులు అన్ని వృత్తులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటారు. గౌడుల సాహిత్యం మొదటి సంకలనంగా మోకు విడుదల చేశారు. ఇంకా ఇతర వృత్తులపై కూడా సంకలనం తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్న దత్తయ్య కృషికి అభినందనీయం తెలియచేశారు. విశిష్ట అతిథి జాజుల శ్రీనివాస్ గౌడు మాట్లాడుతూ సాహిత్య కారులు చరిత్రను రికార్డు చేస్తారు. వారు సమాజంలో సబ్బండ వర్గాల చరిత్రను అనేక కోణాల్లో రాయాలి. సమాజాన్ని అభివృద్ధికి ఎంతో తోడ్పడిన బహుజన కులాల పుస్తకాలు తీసుకురావాలి. గొప్పగా, వీరుల చరిత్రను సాహిత్యంలో చేర్చాలి. సాహిత్యంలో బీసీల సగం పాత్ర ఉండాలి. పుస్తకాల షాపులో కూడా బీసీల సాహిత్యం సగం ఉండాలి. రాజకీయాల దారి చూపాలని ఆయన అన్నారు. అలాగే ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ చదువుకు లేట్ ఎంట్రీ అయ్యి తప్పులు రాసే విద్యార్థి అనేక గ్రంథాలు రాయడం చాలా సంతోషం. సంగిశెట్టి శ్రీనివాస్ ఉపన్యాసం చేసి అనేక సూచనలు చేశారు. బండారు రాజ్ కుమార్ పుస్తకాన్ని సమీక్షించారు. మొదటి ప్రతినీ ఆవునూరి శ్రీనివాస్ గౌడ్ మానసకి అందించారు. అలాగే పుస్తకాన్ని అచ్చేసిన ధ్రువ ఫౌండేషన్ దుండే మల్లేశం, ప్రతినిధి గీత పనివారల సంఘం బొమ్మగాని నాగభూషణంలు అతిథులుగా మాట్లాడారు. ఆహ్వానం విప్లవ కుమార్ చేయగా, బోల్ల ప్రవీణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే రచయితలు, పరిశోధకులు విజయ్ కుమార్, మునిందర్, గోపి, కార్తీక్, స్వాతి, నవీన్,ప్రవీణ్ పాల్గొన్నారు.

## పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంపు

**కేబినేట్ నిర్ణయానికి అనుగుణంగా జివో జారీ**

అమరావతి,జూలై2 (జనంసాక్షి) : పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయసును 60 ఏళ్ల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా సర్కార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచి రిట్రోస్పెక్టివ్‌గా అమలు కానుంది. అలాగే, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ జాబ్‌లో చేరే వరకు ఉన్న గ్యాప్ పీరియడ్‌కు జీతం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్యాప్ పీరియడ్‌ను సీనియారిటీ, ప్రమోషన్ల కోసం పరిగణనలోకి తీసుకోరని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు 62 ఏళ్ల వరకు పనిచేసిన ఉద్యోగులకు పూర్తి స్థాయి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 60 ఏళ్లకు పదవీ విరమణ పొంది తిరిగి విధుల్లో చేరేందుకు ఆసక్తి లేని ఉద్యోగులకు పాత నిబంధనల ప్రకారమే రిటైర్మెంట్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాలని సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## బీఆర్ఎస్ నేతల అరెస్టు అప్రజాస్వామికం

**వెంటనే విడుదల చేయాలి**

**మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర**



హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్ తదితరులను పోలీసులు అరెస్టు చేయడాన్ని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ అప్పుల అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్ నేపథ్యంలో చర్చకు సిద్ధమైన బీఆర్ఎస్ నేతలను తెలంగాణ భవన్ వద్దనే అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వాస్తవాలపై చర్చించకుండా ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు అప్పుల అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పరిపాలన గాడితప్పిందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం ప్రతిపక్షాలపై కేసులు, అరెస్టులు, ప్రచార రాజకీయాలకు పరిమితమైందని అన్నారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు ప్రభుత్వ విధానాలను గమనిస్తున్నారని, ఇందుకు తగిన రాజకీయ మూల్యం చెల్లించక తప్పదని ఉపేంద్ర పేర్కొన్నారు.

సంపాదకీయం

# పిల్లల పళ్లెం నుంచి గుడ్డు లాగేశారు..!

**పసిపిల్లల పౌష్టికాహారం రాజకీయాలకు బలి కావడం కంటే దురదృష్టకరమైన పరిణామం మరొకటి ఉండదు. పశ్చిమ బెంగాల్‌లో మధ్యాహ్న భోజన పథకం మెనూ నుంచి గుడ్డును తొలగించాలన్న నిర్ణయం సరిగ్గా అలాంటి పరిణామమే. "సాత్విక ఆహారం" అనే ముసుగులో లక్షలాది పేద పిల్లలకు అందుబాటులో ఉన్న ఏకైక సంపూర్ణ ప్రోటీన్ వనరును దూరం చేయడం విధాన వైఫల్యం మాత్రమే కాదు.. భావి తరాలపై చేస్తున్న దాడి.**


**గుడ్డు అనేది కేవలం ఒక ఆహార పదార్థం కాదు. పోషకాహార శాస్త్రవేత్తలు దాన్ని "సంపూర్ణ ఆహారం" అంటారు. శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు, విటమిన్ బీ12, విటమిన్ డి, కోలిన్, ఐరన్.. ఇవన్నీ ఒకే ఒక్క గుడ్డులో లభిస్తాయి. పెరుగుతున్న పిల్లల మెదడు అభివృద్ధికి, ఎముకల బలానికి, రోగనిరోధక శక్తికి గుడ్డు ఎంత కీలకమో ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా అంతర్జాతీయ పోషకాహార సంస్థలన్నీ పదేపదే నొక్కి చెబుతున్నాయి. పిల్లల రోజువారీ ఆహారంలో గుడ్డు వంటి జంతు ఆధారిత ప్రోటీన్ ఉండాలని అవి బలంగా సిఫారసు చేస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు దేశంలో పిల్లల్లో రక్తహీనత, ఎదుగుదల లోపం (స్టంటింగ్), బరువు తక్కువ సమస్యలు ఇప్పటికీ ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని హెచ్చరిస్తున్న సమయంలో, ఉన్న గుడ్డును కూడా తీసేయడం ఏ శాస్త్రీయ ప్రాతిపదికన జరిగిందో పాలకులు సమాధానం చెప్పాలి.**

**మధ్యాహ్న భోజన పథకం వెనుక ఉన్న మౌలిక ఉద్దేశ్యాన్ని గుర్తుచేసుకోవాలి. ఇది కేవలం ఆకలి తీర్చే పథకం కాదు, పేద కుటుంబాల పిల్లలను బడికి రప్పించే, వారి పోషకాహార లోటును పూడ్చే, సామాజిక సమానత్వాన్ని పెంపొందించే పథకం. ఎన్నో పేద కుటుంబాల్లో పిల్లలకు రోజూ లభించే ఏకైక పౌష్టిక భోజనం ఇదే. ఇంట్లో గుడ్డు కొనే స్తోమత లేని పిల్లవాడికి బడిలో దొరికే ఆ ఒక్క గుడ్డే జీవనాధారం. దాన్ని లాగేసుకోవడం అంటే అత్యంత బలహీన వర్గాల పిల్లల నోటికాడ కూడు లాక్కోవడమే. ఇక్కడ మరో వైరుధ్యం కూడా గమనించాలి. బెంగాలీ ఆహార సంస్కృతిలో చేపలు, గుడ్డు, మాంసం విడదీయరాని భాగం. రాష్ట్ర జనాభాలో అత్యధికులు మాంసాహారులు. ఎన్నికల ముందు చేపలను "జల పుష్పాలు" అని అభివర్ణిస్తూ, మీడియా కెమెరాల ముందు చేపల విందులు చేసి, "బెంగాలీ ఆహార సంస్కృతిని గౌరవిస్తాం" అని హామీలిచ్చిన నాయకులే.. అధికారంలోకి రాగానే "సాత్విక ఆహారం" పేరుతో పిల్లల పళ్లెం నుంచి గుడ్డును తొలగించడం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ఠ. ఎన్నికల ముందు ఒక ముఖం, ఎన్నికల తర్వాత మరో ముఖం. ఇది ప్రజల ఆహారపు అలవాట్లను, సంస్కృతిని ఓట్ల కోసం వాడుకుని, ఆ తర్వాత వారి పిల్లలపైనే భావజాల ప్రయోగాలు చేయడం.**

**ఆహారం వ్యక్తిగత, సాంస్కృతిక ఎంపిక. "సాత్వికం" అనేది ఒక వర్గపు విశ్వాసం కావచ్చు. కానీ దాన్ని ప్రభుత్వ విధానంగా మార్చి, అన్ని వర్గాల పిల్లలపై రుద్దడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. శాకాహారం తినాలనుకునే పిల్లలకు ఆ ఎంపిక ఎప్పుడూ ఉంటుంది; కానీ గుడ్డు తినే పిల్లల నుంచి ఆ హక్కును లాగేసుకునే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు. పోషకాహార విధానాలు శాస్త్రం ఆధారంగా రూపొందాలి తప్ప, భావజాలం ఆధారంగా కాదు. దీని పరిణామాలు తక్షణం కనిపించకపోవచ్చు. కానీ అవి తరాలను వెంటాడతాయి. బాల్యంలో ప్రోటీన్ లోపం మెదడు అభివృద్ధిని, అభ్యసన సామర్థ్యాన్ని శాశ్వతంగా దెబ్బతీస్తుంది. ఎదుగుదల లోపంతో పెరిగిన పిల్లలు రేపటి బలహీన పౌరులవుతారు. ఒకవైపు "వికసిత భారత్" గురించి, జనాభా డివిడెండ్ గురించి మాట్లాడుతూ, మరోవైపు ఆ డివిడెండ్‌కు పునాది అయిన పిల్లల పోషణను భావజాలానికి బలివ్వడం ఆత్మవంచన తప్ప మరొకటి కాదు. బలహీనమైన పిల్లలతో బలమైన భారత్ నిర్మాణం సాధ్యం కాదు.**

**ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలి. మధ్యాహ్న భోజనంలో గుడ్డును పునరుద్ధరించడమే కాదు, పోషకాహార నిపుణుల సిఫారసుల మేరకు వారానికి కనీసం అయిదు రోజులు గుడ్డు అందించే దిశగా అడుగులు వేయాలి. పిల్లల పళ్లెం ప్రయోగశాల కాదు; వారి ఆరోగ్యం రాజకీయ క్రీడాంగణం కాదు. ఏ ప్రభుత్వమైనా చరిత్రలో నిలిచిపోయేది భావజాల విజయాలతో కాదు.. తన పిల్లలను ఎంత ఆరోగ్యంగా, బలంగా పోషించారన్న చర్యలతోనే..!**

# రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి



దేశంలో ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా ఉన్నప్పుడు ప్రజాస్వామిక ఉద్యమాలు బలంగా కొనసాగాయి. అందులో భాగంగానే ఆదివాసీల హక్కుల కోసం దళితుల హక్కుల కోసం బలమైన చట్టాలను తీసుకురాగలిగింది. కానీ నేడు గత దశాబ్ద కాలంగా ఉద్యమాలపై తీవ్రమైన అణచివేత కొనసాగుతుంది. ఈ అణచివేత 1985 టాడా నుంటి మొదలై ఉపా వరకు బలంగా కొనసాగుతూ వస్తుంది. దేశంలో ప్రజాస్వామిక బహిరంగ ఉద్యమాలు కనుచూపు మేరకు అందకుండా అణచివేతకు గురయ్యాయి. ఎంతో కొంత నక్సల్బరీ శ్రీకాకుళ ప్రేరణతో ప్రారంభమైన రైతాంగ సాయుధ ఉద్యమాలు అటవీ ప్రాంతంలో విస్తరిస్తున్నప్పటికి 2024 కగార్ లక్షలాది సైనిక బలగాలతో నిర్బంధం కొనసాగి వేలాదిగా హత్యలు చేసి ఉద్యమ ప్రాంతాలన్నింటిని నిశ్శబ్దం చేసిన స్థితిని మోడి అమిత్‌షాలు ఇప్పటికే పార్లమెంటులో ప్రకటించి ఉన్నారు. కగార్ నేపథ్యంలో ఎన్ని వేల హత్యలు జరిగాయో అంతకు రెండుమూడింతలు బలవంతపు లొంగుబాట్లు కొనసాగాయి. ఆ లొంగుబాట్లలో కూడా ఎక్కడ కూడా ప్రజాస్వామ్యం ఉన్నట్లు స్పష్టత లేనప్పటికి ఇప్పటికి మాత్రం ఉద్యమకారుల పట్ల ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నట్లుగా ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. మరొకవైపు వారందరిపై నిర్బంధపు కత్తి వేలాడుతూ ఉందని, వారి మాటల్లోనే మిగతా వామపక్ష పార్టీల మాటల్లో గాని, స్పష్టమవుతున్నది. ఒకవైపు లొంగిపోయిన ఉద్యమకారులందరికి రెడ్ కార్పెట్ పరుస్తామన్న ప్రభుత్వాలే వారిపై షరతులతో కూడిన నిర్బంధాన్ని విధించి కనీసం వారి తలలకు ప్రకటించిన వెలలను కూడా వెంటనే ఇవ్వకుండా షరతులు విధించినట్లుగా తెలుస్తుంది. పౌర హక్కుల సంఘం ప్రభుత్వాలు ఏ ఉద్యమానికైనా ఆ ఉద్యమ పునాదులను శాస్త్రీయ దృష్టితో పరిశీలించాలని ప్రభుత్వాలను పదే పదే కోరుతూ వస్తున్నది. కానీ ఆదిలాబాదులో ఆదివాసీల పోరాటం ప్రధానంగా కొమురం భీం పోరాటం నేపథ్యంలో అప్పుడున్న నిజాం నవాబు కూడా హెమన్‌డార్ఫ్ అనే మానసిక శాస్త్రవేత్తను పిలిపించి ఆదివాసీల స్థితిగతులను అంచనా వేయడానికి ప్రయత్నం చేశారు. కానీ నేడు దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ఫాసిజం పాలన చేస్తున్న విషయాన్ని మనందరం అంగీకరిస్తున్నాం. రాజ్యాంగం ప్రాథమిక హక్కులు ప్రజలకు కరువైపోయి దశాబ్దాలు గడుస్తున్నాయి. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రత్యామ్నాయంగా పోరాటాలను ఎన్నుకుంటున్నారు. ప్రభుత్వాలు ఎక్కడా కూడా ఆ పోరాటాలను ప్రజాస్వామ్య దృష్టితో చూడడం లేదు. అందుకే ఆ పోరాటాలు అనేక రూపాల్లోకి మారిపోయాయి. ఈ నేపథ్యం నుంచే ఏ పార్టీకి చెందిన పాలకులైనా రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని అనచివేసి ప్రజల మౌళిక హక్కులను కూడా నిర్ధాక్షిన్యంగా అణచివేసి పాలన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజలందరు ఏదో ఒక రాజకీయ పోరాటంలో సమీకృతమయ్యారు. ఇలా పోరాడే ప్రజలందరిని నిషేదించి పార్టీలతో జమకట్టి అక్రమ చేసులు, అక్రమ నిర్బంధాలతో జైళ్ళు పరిమితికి మించి నింపబడ్డాయి. ఈ నేపథ్యంలోనే పౌరహక్కుల సంఘం ఒకవైపు దేశంలో ఉద్యమపార్టీలు లేని స్థితిని కల్పించిన ప్రభుత్వం ఆ కారణంతో అరెస్టు అయి జైళ్ళలో ఉన్నటు వంటి ఆదివాసీలను దళితులను రాజకీయ ఖైదీలను విడుదల చేయడం వల్ల ప్రజాస్వామ్యాన్ని కనీసం గుర్తించిన వాళ్ళవుతారు. దేశ వ్యాప్తంగానూ, తెలంగాణ రాష్ట్రంలోనూ ఎంతో మంది మావోయిస్టులనే ఆరోపణలతో జైళ్ళలో మగ్గుతున్నారు. కొందారు ఏళ్ళకు తరబడి విచారణ ఖైదీలుగానే ఉంటున్నారు. బెయిలు పై విడుదల చాలా కష్టంగా మారింది.

ఒక వైపు కేంద్రా రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్రాల డిజి పి లు తెలంగాణ, ఆంధ్రాప్రదేశ్, ఛత్తీస్ గఢ్, ఒడిషా, మహారాష్ట్రాలలో మావోయిస్టు ఉద్యామం ఇక ఏమీ మిగలలేదాని, ముగిసిపోయిందాని ప్రకటించి ఉన్నారు. 2024 జనవరి నుండి 27 నెలలుగా ఆపరేషన్ కగార్ పేరుతో 9 లక్షల అర్ధ సైనిక బలగాలతో బస్తర్‌పై అణచివేతను కొనసాగించి 900ల మందికి పైగా ఆదివాసీలను మావోయిస్టులను అత్యంత అమానవీయంగా హత్య చేసింది. ఆ స్థితిలో గత ఏడాది కాలంగా కొద్ది మంది ఉద్యమంతో విభజించి లొంగిపోవడం, మరికొంత మంది కేంద్రకమిటీ సభ్యులతో సహా వందాలాది మంది మావోయిస్టు కార్యకర్తలు ఉద్యమం వీడి బయటకు వచ్చారు ప్రభుత్వం వారిని ఎటువంటి కేసులు లేకుండా ఇళ్లకు పంపించివేసింది. అటువంటప్పుడు ఆ మావోయిస్టు ఉద్యమానికి సహకరించారనే కారణంతో, లేదా ఆ ఉద్యమంలో పని చేశారనే కారణంతో వందలాది సాధారణ కార్యకర్తలను కేసులు పెట్టి జైలుపాలు చేసింది. వాళ్ళందరు ఇప్పటికీ ప్రభుత్వం జైళ్లలోనే ఉంచటం ఎలా న్యాయం అవుతుంది. మావోయిస్టు ఉద్యమం ముగిసిందని పార్లమెంటులో హోంమంత్రి ప్రకటన చేసిన నేపథ్యంలో ఇప్పుడు జైలు శిక్ష అనుభవిస్తున్న వారిని ఆ కేసులన్నింటిని రద్దు చేసి వెంటనే విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

ఈ రాజకీయ ఖైదీలలో చాలామంది తీవ్రమైన అనారోగ్య సమస్యలతో, వయోభారంతో బాధా పడుతున్నారు. మన రాష్ట్రానికి చెందిన వాళ్ళు ఇతర రాష్ట్రాలలో కూడా అక్రమ కేసులలో మగ్గుతున్నారు. మావోయిస్టులనే ఆరోపణలతో తెలంగాణ లో సుమారు 50 మంది జైళ్ళలో ఉన్నారు. వీరిలో 35 మంది ఆదివాసీలు. హైదారాబాద్ జైళ్ళలో 30 మంది, ఖమ్మం జైల్లో 15 మంది ఉన్నారు. వీరిలో ఐదాగురు తప్ప మిగిలిన అందారూ ఆదివాసీలు. గత సంవత్సరం కర్రెగుట్టల ప్రాంతంలో కనీసం 15 మంది ఆదివాసీ మహిళలు సరెండర్ అయ్యారని ప్రకటించి వాళ్ళతో పోలీసు అధికారులు ఫొటోలు కూడా దిగి ఆ తరువాత వాళ్లపై అక్రమ కేసు పెట్టి జైల్లో పెట్టారు. ఇందులో ఐదుగురు బాలికలు, ఒక బాలుడు మైనర్లు. ఎన్ఐఏ కోర్టు ఈ మైనర్లకు కూడా బెయిల్ నిరాకరించింది. ఆదివాసీలు కావడం వల్ల వీరిలో చాలా మందికి మూలాకాత్ పెట్టడానికి కూడా కుటుంబ సభ్యులు ఛత్తీస్ గఢ్ నుండి రాలేక పోతున్నారు. వీళ్లలో చాలా మందికి తెలుగు రాకపోవడం వల్ల అదానపు సమస్యలను ఎదుర్కొంటున్నారు. జైలు అధికారుల చిన్న చూపుకు, దాష్టికానికి గురవుతున్నారు.

ఈ రాజకీయ ఖైదీలలో కొందారు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధా పడుతున్నారు. ఉదాహరణకు మూల దేవేందార్ రెడ్డి (60 ఏళ్ళకు పైబడిన వాడు) కి దాదాపుగా రెండు కళ్ళు కనిపించడం లేదు. ప్రస్తుతం ఈయనను జగ్దల్ పూర్ జైల్లో ఉన్నాడు. చంచల్‌గూడా జైల్లో ఉన్న కర్తమ్ జోగా పక్షవాతంతో బాధా పడుతూ కదాలలేని స్థితిలో జైలు ఆసుపత్రిలోనే విచారణ ఖైదీగా ఉన్నాడు. గంగాధర్ రావు 75 ఏళ్ళకు పైబడినవాడు. నాలుగేళ్లకు పైగా ఎటువంటి విచారణ లేకుండా జైలులో ఉన్నాడు. శివారెడ్డి 12 ఏళ్లుగా విచారణ ఖైదీగా ఎటువంటి విచారణ లేకుండా ఉన్నాడు. పూవర్తి గ్రామానికి చెందిన అద్మాల్ కు సంబంధించిన ఫైళ్ళు జిల్లాల పునర్విభజన సమయంలో మిస్ ప్లేస్ చేసినందుకు దొరకక 12 ఏళ్లుగా జైలులో ఉన్నాడు. కమల మూడేళ్లుగా, రజిత నాలుగేళ్లుగా చంచల్‌గూడ మహిళా జైల్లో ఉన్నారు. మిగిలిన వారందారూ ఏడాదిగా జైల్లో ఉన్నారు. ఈ కాలంలోనే మావోయిస్టు కేంద్ర కమిటి నాయకుడు రామచంద్రా రెడ్డి అంత్యక్రియల సందార్భంలో అమిత్ షా ను విమర్శించిన నేరానికి భారత్ బచావో నాయకుడు ఇన్నయ్యను ఊపా కింద అక్రమ కేసు బనాయించి జైలు పాలు చేసింది. ఆయన జైలులో ఉన్న కాలంలోనే ఆయన తల్లి, తండ్రి ఇరువురూ మరణించారు. ఆయన కూడా ఎన్నో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా బెయిలు ఇవ్వడం లేదు. మరో మావోయిస్టు నాయకుడు, మహారాష్ట్రకు చెందిన సంజయ్ దీపక్ రావు కూడా గత మూడేళ్లకు పైగా విచారణ ఖైదీగానే చంచల్ గూడ జైల్లో ఉన్నాడు. విశాఖ పట్టణం జైల్లో 10 మంది ఉన్నారు. రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు తదితర ఆంధ్రా జైళ్ళలో 40-50 మంది దాకా ఉన్నారు. ఆంధ్రాప్రదేశ్ జైళ్ళలో ఉన్న వాళ్ళు కూడా అత్యధికులు ఆదివాసీలే. ఇందాులో సాకే కళావతి విశాఖ పట్టణం జైల్లో ఏడు ఏళ్లుగా ఉంది. ఈమె పై 55 అక్రమ కేసులు మోపారు. కొర్రా నాగేశ్వర రావు పై 40 కేసులు, వంతల రామకఅష్ణ పై 45 కేసులు, మర్రి వలస పై 25 కేసులు, కొర్ర సింగ్రు పై 20 కేసులు మోపారు. దేవేంద్రా, శిల్ప మూడేళ్లకు పైబ డి జైల్లో ఉన్నారు.

తెలుగు రాష్ట్రాలకు చెందిన మరెంతో మంది ఇతర రాష్ట్రాల జైళ్ళలో ఉన్నారు. ముఖ్యంగా మధ్యాప్రదేశ్ లోని జబల్ పూర్, భోపాల్, సాగర్ జైళ్ళలో శిక్షపడిన ఖైదీలుగా ఐదాగురు 17 ఏళ్లుగా జైల్లో ఉన్నారు. వీరందారూ కూడా దాదాపు ఇన్ని ఏళ్లుగా ఎటువంటి మూలాఖత్ లు కూడా లేకుండా ఉన్నారు. జీవిత కాలపు శిక్ష పడిన అనేక మంది ఇతర ఖైదీలు అవే జైళ్లనుండి 14 ఏళ్ల ప్రభుత్వం ముందాస్తు విడుదాలకు నోచుకోని విడుదాల అయ్యారు. కానీ వీరిని మాత్రం విడుదాల చేయలేదా. జబల్ పూర్ జైల్లోనే అశోక్ రెడ్డి, ఆయన భార్య కుమారి పొట్టాయి నాలుగేళ్లుగా విచారణ ఖైదీలుగా ఉన్నారు.

జగ్దల్ పూర్ మహిళా జైల్లో 108 ఖైదీలు ఉండగా పద్మా, శిరీష తప్ప మిగిలిన వారందారూ ఆదివాసీలే. 2007 నుండి 2017 వరకు జైల్లో గడిపి తీవ్ర అనారోగ్యం పాలైన బెల్లాల పద్మా మళ్ళీ గత మూడేళ్ళుగా మళ్ళీ అక్రమ కేసులో జగ్దల్ పూర్ జైల్లో ఉంది. ఆమెతో పాటే శిరీష, దాుడ్డు ప్రభాకర్ లు కూడా అదే అక్రమ కేసులో అక్కడి జైల్లోనే ఉన్నారు. కరీంనగర్ జిల్లా జగిత్యాలకు చెందిన పౌరహక్కుల సంఘం నాయకుడు పోగుల రాజేశం ను కూడా మూడేళ్ళుగా జగదల్పూర్ జైల్లో నిర్బందించి ఉంచారు. కనీసం అతని కూతురు చనిపోయినప్పుడు కూడా బెయిల్ ఇవ్వలేదు. వీరికి బెయిలు రావడం లేదు విచారణ జరగడం లేదు. భువనేశ్వర్ జైల్లో ఉన్న దున్నా కేశవ రావు వాస్తవానికి 2011 లో ఆంధ్రాప్రదేశ్ పోలీసుల ముందు లొంగిపోయాడు. అయినా ఆయనను ఒడిశా తీసుకెళ్లి 50 కేసులు పెట్టారు. గత 15 ఏళ్లుగా ఆయన విచారణ ఖైదీగానే జైల్లో ఉన్నాడు. దాుబాసీ శంకర్ అయిదేళ్లుగా అదే జైల్లో ఉన్నాడు. ఇతని ఆరోగ్యం సరిగ్గా లేదు, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు.

ఒక వైపు మావోయిస్టు ఉద్యమం ఇక ముగిసిందంటూనే ఎంతో మంది నాయకులపై ఏ కేసులు లేకుండా వదిలేసి, మరొకవైపు అవే కేసులలో ఉన్న సాధారణ కార్యకర్తలను, సానుభూతిపరులను ఇంకా కేసులతో సతాయిస్తూ, కొత్త కేసులు మోపుతూ జైళ్లలోనే నిర్బంధించడం ఎలా ప్రజాస్వామ్యం అవుతుంది. మావోయిస్టు పార్టీ ఉనికిలో లేనప్పటికి ఉపా కేసులను నమోదు చేయడం, జైలులో నిర్బంధించడం అన్యాయమవుతుంది కావున ఈ అక్రమ అన్యాయ ఉపా కేసు నిర్బంధాలకు వ్యతిరేకంగా మనందరం గొంతెత్తి వారి విడుదలకై ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రస్తుతం మనం తెలంగాణ ప్రభుత్వాన్ని ఈ విషయంలో బలంగా డిమాండ్ చేయడం అవసరం.

జైలు నిర్బంధంలో ఉన్న రాజకీయ ఖైదీలు తమ విడుదల కోసం తాముగా ప్రయత్నం చేయనేని నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న వామపక్ష పార్టీలు వారి యొక్క స్థితిగతులను గమనించి వారి విడుదల కోసం ప్రజలు ప్రజాస్వామిక వాదులు వామపక్షాలు బుద్ధిజీవులు ప్రయత్నించాలి.

**ఎన్. నారాయణ రావు**
ప్రధాన కార్యదర్శి

## ఆధిపత్య కులాల నుంచి బహుజనుల
# "ఇడుపు కాయితం" ఎప్పుడు?

ఇటీవల"ఇడుపు కాయితం" సినిమా శీర్షిక చుట్టూ సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తెలంగాణ భాష, యాస, సంస్కృతిని అవమానించే ప్రయత్నమని కొందరు విమర్శిస్తుంటే, మరికొందరు ఇది సృజనాత్మక స్వేచ్ఛలో భాగమని వాదిస్తున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తూ "సాంస్కృతిక ఆధిపత్యం ఇంకా కొనసాగుతోంది" అనే అభిప్రాయాన్ని తెలంగాణ బహుజన మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య తెలంగాణలో ప్రతిష్టించిన బాలసుబ్రమణ్యం, ఎన్టీఆర్ విగ్రహాలపై కూడా చర్చ జరిగింది. ఇలాంటి భాష, సాంస్కృతిక ప్రతీకలపై విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఒక కీలక ప్రశ్న వినిపిస్తుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ భాష, యాస, సంస్కృతి కోసం జరిగిన పోరాటం వల్ల బహుజన సమాజానికి-ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు-ఏ మేరకు సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత లభించింది? మరి ఇప్పుడు కూడా ఆనాటి భావోద్వేగాలతో వెళ్ళడం సరైనదేనా?. సమాజంలో ఏ అంశంలోనైనా "ఆర్డర్ ఆఫ్ ప్రియారిటీ" చాలా ముఖ్యం. ఇప్పుడు జనాభా దామాషా ప్రకారం భూమి, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, వనరులపై సమాన హక్కులు, నిర్ణయాధికారం వంటి అంశాలు అత్యవసరమైనవి. భాష, సంస్కృతి, యాసలపై చర్చలతో బహుజనుల జీవన ప్రమాణాలు మారతయా? అనేది ప్రశ్న. ఇప్పటివరకైతే మారలేదు.



**భాషా, సంస్కృతి ఉపరితల సమస్యలే.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం "నీళ్లు-నిధులు-నియామకాలు"తో పాటు సాంస్కృతిక ఆత్మగౌరవాన్ని కూడా ప్రధాన అంశంగా ముందుకు తెచ్చింది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూమి, సంపద, రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాల్లో అణగారిన వర్గాల ప్రాతినిధ్యం ఏ మేరకు ఉందనే ప్రశ్న ఇప్పటికీ పలువురుని వేధిస్తుంది. అణచివేత ఆగడం లేదు. ఒక ప్రాంతంలో సామాజిక న్యాయం దృష్టితో చూస్తే కేవలం భాషా గుర్తింపే సరిపోదని సామాజికవేత్తల భావన. ఇది అసలు సమస్య కూడా కాదు. అధికారంలో, వనరుల్లో, అవకాశాల్లో సమాన భాగస్వామ్యం ప్రధానాంశం. "ఇడుపు కాయితం" సినిమా టైటిల్ పై జరుగుతున్న చర్చలో ప్రజలకు నాదొక ప్రశ్న?. అసలు తెలుగు సినిమా పరిశ్రమలో అణగారిన వర్గాలకు వాటా ఉందా ? సినిమా రంగాన్ని తరిచి చూసినప్పుడు అందులోని కళరూపాలన్నీ కూడా సబ్బండ కులాల సాంస్కృతికతతో ముడిపడి ఉన్నాయి. కానీ చిత్రసీమలో వారికి స్థానం లేదు. కులవివక్షత స్పష్టంగా కనబడుతుంది. అత్యధికంగా ఉన్నతకులాల నుంచి హీరోలు, దర్శకులు, నిర్మాతలవుతున్నారు. అణగారిన కులాల్లో నుంచి అక్కడక్కడ కమెడియన్లు, రౌడీలు వంటి చిన్న చిన్న జూనియర్ ఆర్టిస్టులుగానే తీసుకొంటారు. దాదాపుగా టాలీవుడ్ లో ఇప్పటివరకు రెండు, మూడు కులాలే రాణిస్తున్నాయి. ఎందుకగా ఏ కులాలు పాలిస్తారో వారే అన్ని రంగాల్లో ముందుంటారు. అలాంటప్పుడు బహుజనులకు సినిమా భాష, సాంస్కృతిక పోకడలపై చర్చ అవసరమా?. తమ కులాల వాటా కోసం చర్చ జరగాలి కదా! కానీ సంస్కృతి, భాష వంటి అనవసర చర్చలతో నికార్సైన సామాజిక ఉద్యమాలను పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పటివరకు అగ్రకులాల నాయకత్వంలో నడిచిన తెలంగాణ ఉద్యమం, వామపక్ష ఉద్యమం, మావోయిస్టు ఉద్యమాలు ఉపరితలం సమస్యలనే ప్రధాన అంశాలుగా చిత్రీకరించారు. కానీ కులాలకు సంబంధించిన అసలైన సమస్యలు ప్రస్తావించలేదు. అయినా ఆ ఉద్యమాల్లో బహుజనులంతా భాగమై విముక్తికి దూరమయ్యారు.

**కులాల వాటాతోనే వివక్షతలకు విరుగుడు**

సమాజంలో కొనసాగుతున్న అసమానతలను ప్రశ్నించే దృక్పథమే ప్రజాస్వామ్యానికి బలం. ఈ సందర్భంగా తెలుగు భాష మాట్లాడే అట్టడుగు వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, నిర్ణయాధికారం ఎంతవరకు లభిస్తున్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ సమాజంలోని అంతర్గత అసమానతలు, కుల ఆధిపత్యం, వనరుల పంపిణీ, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలు ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీలో ముందు ఉండాలి. భాషా, ప్రాంతం వంటివి బూటకం. అగ్రకులాలు రాజ్యానికి రావడానికి తెరపై తెచ్చిన భావోద్వేగపూరితమైన అంశాలు మాత్రమే. ఆ ఉచ్చులో పడి బహుజన మేధావులు అసలైన సమస్యలను విస్మరిస్తున్నారు. కావున ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో మరోసారి వినిపిస్తున్న భాషా, ప్రాంతం, సంస్కృతి, మార్వాడి ఆధిపత్యం వంటి సమస్యలకు అతీతంగా సామాజిక న్యాయం కోసం పోరాడాలి."ఇడుపు కాయితం" సినిమా టైటిల్ చుట్టూ తిరుగుతున్న భాషా వివాదం వృధా. ఇప్పటికే కొందరు బహుజన మేధావులు, నాయకులు అగ్రకుల పార్టీలకు వత్తాసు పలుకుతూ, ఓటు దళారులుగా మారి జాతి విముక్తిని మరచిపోతున్నాయి. అందుకే జనాభాలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నప్పటికీ తమ రాజ్యాన్ని సాధించుకోలేకపోతున్నాను. కావున ఇప్పుడు శత్రువును పసిగట్టడం, ఏది ప్రధాన అంశమో గుర్తుపట్టడం ముఖ్యం. తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్ విశారదన్ మహరాజ్ చైర్మన్ గా ఏర్పడిన బీసీ ఎస్సీ ఎస్టీల జేఏసీ సామాజిక న్యాయం కోసం ఆధిపత్య కులాలకు అభిముఖంగా గీత గీసి పోరాడుతుంది. సంవత్సర కాలం పూర్తి చేసుకున్న ఈ జేఏసీ బహుముఖ పోరాటాలతో తెలంగాణలో అసలైన ప్రతిపక్షంగా నిలిచింది. కావున అగ్రవర్ణాల నీడలో నడుస్తున్న పార్టీలతో, అగ్రకుల నాయకులతో "ఇడుపు కాయితం"(విడాకులు) చేసుకొని స్వశక్తిగా పోరాడినప్పుడే అట్టడుగు వర్గాలకు విముక్తి లభిస్తుంది. భూమి, సంపద ,రాజ్యం సంస్కృతిలో వాటా లభిస్తుంది. ఇదే అసలైన సామాజిక న్యాయం. త్రినేత్రుడైన శివుడు సమానత్వం ఇదే బోధిస్తుంది. ఇదే అన్ని వివక్షతలకు విరుగుడు. ఈ విషయాన్ని తెలంగాణ బహుజన మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.



**సంపతి రమేష్ మహారాజ్**
సామాజిక విశ్లేషకులు
7988579428

# లక్షల జీడీపీ... లక్షణమైన ఉద్యోగమేదీ?



ఇటీవల కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ విడుదల చేసిన గులాబీ రంగు నివేదిక చూస్తే, అబ్బా మన దేశం ఎంత అద్భుతంగా వెలిగిపోతోందో కదా అనిపించక మానదు! దేశంలో 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగిత రేటు కేవలం 5.2 శాతానికి పరిమితమైందట. ఇక పల్లెటూళ్లలో అయితే అది కేవలం 4.8 శాతం మాత్రమేనని ఆ రికార్డులు డంబాచారాలు పలుకుతున్నా యి. కానీ, కాస్త గ్రౌండ్ రియాలిటీ లోకి వద్దాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా చేతిలో డిగ్రీలు, పీజీల పట్టాలు పట్టుకుని, దిక్కుతోచక పొలం పనులకో లేదా పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకో వలస వెళ్తున్న నవతరం కన్నీటి దృశ్యాలు నిత్యకృత్యంగా కనిపిస్తూనే ఉన్నాయి. ఒకవైపు గ్లోబల్ వేదికలపై మన దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకెళ్తున్న ఆర్థిక వ్యవస్థగా, నాలుగో అతిపెద్ద గ్లోబల్ పవర్‌హౌస్‌గా కీర్తించబడుతోంది. కానీ, నాణేనికి మరోవైపు ఇదే దేశంలో దాదాపు 80 కోట్ల మందికి పైగా ప్రజలు ఇప్పటికీ ఉచిత రేషన్ బియ్యం పైనే ఆధారపడి బతుకుబండిని లాగుతున్నారు! డిజిటల్ తెరపై ఒక నెంబరు ఒక అందమైన కథ చెబితే, వీధిలో నడుస్తున్న సామాన్యుడి జీవితం మరో కఠోర వాస్తవాన్ని కళ్లకు కడుతోంది. ఈ రెండు భిన్నమైన కథల మధ్య ఉన్న అగాధమే నేటి మన హాట్ టాపిక్!

**డిజిటల్ అంకెలు... అట్టడుగు బతుకులు!**

గణాంకాలు ఎప్పుడూ అబద్ధం చెప్పవు అంటారు, కానీ ఆ అంకెలను ఎలా మేనేజ్ చేస్తున్నారన్నదే ఇక్కడ అసలైన కిటుకు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే అనుసరించే కరెంట్ వీక్లీ స్టేటస్ పద్ధతినే తీసుకుందాం. ఈ సిస్టమ్ ప్రకారం, సర్వే చేసే వారంలో ఒక వ్యక్తి కేవలం ఒక్క గంట పాటు ఏదో ఒక చిన్న పని చేసినా, లేదా పని కోసం అందుబాటులో ఉన్నా అతనికి ఉపాధి లభించినట్టే లెక్క! అంటే, ఏడాదిలో కేవలం ముప్పై గంటలు పనిచేసినా వాడు అఫీషియల్‌గా ఉద్యోగస్తుడే అన్నమాట. మరి, ఇలాంటి డెఫినేషన్లతో తయారయ్యే నివేదికలు వాస్తవ జీవితంలో యువత ఎదుర్కొంటున్న కడుపుకోతను, గౌరవప్రదమైన ఉపాధి లేమిని ఎంతవరకు ప్రతిబింబిస్తాయి?

**సత్యం చెప్పే సాక్ష్యం:**

శ్రామిక శక్తిలో దాదాపు 82 శాతం మంది ఇప్పటికీ అసంఘటిత రంగంలోనే మగ్గుతున్నారు. 90 శాతానికి పైగా కార్మికులకు ఎలాంటి ఉద్యోగ భద్రతగానీ, సామాజిక భద్రతగానీ లేవని అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదికలు ఘోషిస్తున్నాయి.ఇక జాతీయ ఆదాయం వృద్ధి రేటు అనేది ఆర్థిక వ్యవస్థ మొత్తం ఉత్పత్తి విలువను కొలుస్తుంది తప్ప, ఆ సంపద ఎంతమంది చేతుల్లోకి న్యాయంగా చేరుతుందో చెప్పదు. ఐటీ, సర్వీస్ సెక్టార్, డిజిటల్ ఎకానమీ సూపర్ స్పీడ్‌తో దూసుకుపోతూ జిడిపి ని పెంచుతున్న మాట నిజమే. కానీ ఈ వెలుగులన్నీ కేవలం కార్పొరేట్ శైలి శ్రేణులకే పరిమితమవుతున్నాయి తప్ప, తక్కువ నైపుణ్యం ఉన్న కోట్లాది మంది సామాన్య కార్మికులకు స్థిరమైన ఉపాధిని ఇవ్వలేకపోతున్నాయి. అంటే, గవర్నమెంట్ రికార్డుల్లో ఉపాధి గ్రాఫ్ పైకి లేస్తున్నట్లు కనిపిస్తున్నా, ఆ జాబ్ నాణ్యత, జీతం, స్థిరత్వం గురించి అడిగితే లెక్కలన్నీ మౌన ముద్ర దాలుస్తాయి.

**లెక్కల వెనుక దాగిన లొసుగులు!**

పాలకులు అనుసరిస్తున్న గ్రోత్-సెంట్రిక్ విధానాలు కేవలం పెట్టుబడులు, భారీ పరిశ్రమలు, ఎగుమతుల చుట్టూనే తిరుగుతున్నాయి. ఫలితంగా కర్మాగారాలన్నీ ఆటోమేషన్, రోబోటిక్స్ వైపు మళ్లుతున్నాయి. కార్పొరేట్ కంపెనీలు తక్కువ మంది సిబ్బందితో ఎక్కువ ప్రొడక్షన్ సాధిస్తూ లాభాల పంట పండించుకుంటున్నాయి. ఇది దేశ జీడీపీని ఆకాశానికి ఎత్తవచ్చు, కానీ చదువు పూర్తి చేసుకుని ఆశలతో మార్కెట్లోకి వస్తున్న కోట్లాది మంది యువతకు మాత్రం మొండిచేయే మిగులుస్తోంది. విద్యావంతుల్లోనే నిరుద్యోగిత శాతం గత రెండు దశాబ్దాల్లో విపరీతంగా పెరిగిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ వైరుధ్యానికి అద్దం పట్టే మరో విచిత్రమైన ఉదాహరణ ఉంది. కోవిడ్-19 సంక్షోభ సమయంలో దేశ జీడీపీ దాదాపు 7 శాతం పాతాళానికి పడిపోయినా, అదే కాలంలో అధికారిక నిరుద్యోగిత రేటు మాత్రం తగ్గినట్టు రికార్డుల్లో నమోదై ఆర్థికవేత్తలనే విస్మయానికి గురిచేసింది! ఎకానమీ కుదేలైనప్పుడు ఉద్యోగాలు పెరగడం ఏంటనే ఈ మ్యాజిక్, మన అధికారిక సర్వేల విశ్వసనీయతపైనే నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది.ప్రభుత్వ అధికారిక సంస్థ అయిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ఒక వారంలో కేవలం ఒక్క గంట పని దొరికినా సరే ఆ వ్యక్తిని ఉద్యోగి గా పరిగణిస్తుంది. ఈ సరళమైన నిర్వచనం వల్ల కాగితాలపై నిరుద్యోగిత రేటు తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, అది క్షేత్రస్థాయిలోని కఠోర వాస్తవాలను, యువత పడుతున్న కడుపుకోతను పూర్తిగా ప్రతిబింబించలేకపోతోంది. దీనికి భిన్నంగా, స్వతంత్ర పరిశోధనా సంస్థ అయిన "సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ" రోజువారీ ప్రాతిపదికన, మరింత స్పష్టమైన ఉపాధి ప్రమాణాల ఆధారంగా నిరుద్యోగాన్ని లెక్కిస్తుంది. అందుకే ప్రభుత్వ అంకెలతో పోలిస్తే "సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ" నివేదికలు సామాన్యుడి నిజజీవిత పరిస్థితులకు, సమాజంలోని అసలైన నిరుద్యోగ చిత్రణకు చాలా దగ్గరగా ఉంటాయని ఆర్థిక నిపుణులు భావిస్తారు.మరో షాకింగ్ విషయం ఏంటంటే, దేశంలో 2011 తర్వాత జనాభా గణన జరగనే లేదు. దశాబ్దం క్రితం నాటి పాత డేటా ఆధారంగానే నేటికీ పేదరిక, ఉపాధి అంచనాలు రూపొందిస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సైతం భారత జాతీయ ఆదాయ గణాంకాలు ఇక్కడి అసంఘటిత రంగాన్ని, ప్రజల రియల్ ఖర్చులను సరిగ్గా చూపించడం లేదని పెదవి విరిచింది. పార్లమెంటులో అడిగిన పలు ప్రశ్నలకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలు గమనిస్తే, దేశ సంపద అంతా కొద్దిమంది హస్తగతమవుతోందన్న ధోరణి స్పష్టంగా వెల్లడవుతోంది.

**సంఖ్యలకు... సంక్షేమ జీవితాలకు వారధి ఏది?**

కేవలం సగటు లెక్కలపైనే ఆధారపడి ఏసీ గదుల్లో కూర్చుని పాలసీలు రాస్తే, అవి గ్రౌండ్ లెవల్‌లో ఇలాంటి ఫెయిల్యూర్లనే చూస్తాయి. ఈ అగాధాన్ని పూడ్చాలంటే తక్షణమే మూడు కీలక అడుగులు పడాలి.మొదటిది దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న జనాభా గణనను వెంటనే పూర్తి చేసి, తాజా వాస్తవాల ఆధారంగా సరికొత్త డేటాను సిద్ధం చేసుకోవాలి.రెండోది కేవలం పని దొరికిందా లేదా అనే కాకుండా, ఆ ఉద్యోగానికి తగిన జీతం, సామాజిక భద్రత, లైఫ్ స్టెబిలిటీ ఉన్నాయా లేదా అని కొలిచే సరికొత్త క్వాలిటీ ఇండెక్స్‌ను ప్రవేశపెట్టాలి.మూడోది కేవలం జీడీపీ వృద్ధి మాత్రమే కాకుండా, ఉపాధి కల్పన ధ్యేయంగా పాలసీలు మారాలి. శ్రమతో కూడిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పెద్దపీట వేయాలి.గణాంకాలు అనేవి దేశ ప్రగతికి దిక్సూచిలా పనిచేయాలి తప్ప, వాస్తవాలను కప్పిపుచ్చే రంగుల తెరలుగా మారకూడదు. ఏ ప్రభుత్వ విధానమైనా సరే అది సక్సెస్ అయిందో లేదో డిసైడ్ చేసేది జీడీపీ నెంబర్లు కాదు, సమాజంలో చిట్టచివరి వరుసలో ఉన్న సామాన్యుడి బతుకులో వచ్చిన మార్పు మాత్రమే! ఆ జీవన సూత్రాన్ని విస్మరిస్తే అంకెలు అద్భుతంగా వెలిగిపోతుంటాయి, కానీ సామాన్యుడి జీవితాలు మాత్రం ఎప్పటికీ చీకట్లోనే మగ్గిపోతుంటాయి.

**డా .సూర్యదేవర రామకృష్ణ ,**
**9490754169**

# మహిళల సాధికారతకు ఎంఎంసీ పెద్దపీట

**ఉప్పల్, జూలై 2 (జనం సాక్షి) :** మహిళల సాధికారత, నగర సుందరీకరణ, పచ్చదనం పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యాలను సమన్వయం చేస్తూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో పార్కుల నిర్వహణ చేపట్టడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నగర ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉప్పల్‌లోని చిల్కానగర్ బ్యాంక్ కాలనీ పార్కును ఎంఎంసీ కమిషనర్ సందర్శించి అక్కడి నిర్వహణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పార్కులోని పచ్చిక బయళ్లు, అలంకార మొక్కలు, పూల మొక్కలు, వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆట స్థలాలు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, సందర్శకులకు కల్పించిన సౌకర్యాలను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కు నిర్వహణ బాధ్యతలు చేపట్టిన స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా మొక్కలకు నీరు అందించడం, కలుపు మొక్కలను తొలగించడం, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం, పచ్చికను సంరక్షించడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, సందర్శకులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో చూపుతున్న అంకితభావాన్ని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా ప్రజా ఆస్తుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నగర అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. మహిళలకు బాధ్యతలు అప్పగిస్తే వాటిని ఎంత సమర్థవంతంగా నిర్వహించగలరో చిల్కానగర్ బ్యాంక్ కాలనీ



పార్కు నిర్వహణే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న పార్కుల్లో పరిశుభ్రత, పచ్చదనం, నిర్వహణ ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని తెలిపారు. మహిళల అంకితభావం, బాధ్యతాయుతమైన పని తీరు వల్ల ప్రజలు కూడా పార్కులను ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే వారికి ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తోందని చెప్పారు. పార్కుల నిర్వహణను కేవలం శుభ్రతకే పరిమితం చేయకుండా, వాటిని పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కమిషనర్ సూచించారు. ప్రతి మొక్కను సంరక్షించడం, కొత్త మొక్కలు నాటడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం, చిన్నారులు, వృద్ధులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, స్వయం సహాయక సంఘ సభ్యులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలు ఇదే స్థాయి నాణ్యత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే నగరంలోని మరిన్ని పార్కుల నిర్వహణ బాధ్యతలను కూడా వారికి అప్పగించేందుకు ఎంఎంసీ సిద్ధంగా ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. ఇది మహిళలకు ఉపాధి అవకాశాలను విస్తరించడమే కాకుండా వారి ఆర్థిక స్వావలంబనకు కూడా దోహదపడుతుందని అన్నారు. మహిళల సాధికారత అనేది కేవలం ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా నిర్ణయాలు తీసుకునే స్థాయికి తీసుకెళ్లడమని కమిషనర్ పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు మరిన్ని బాధ్యతలు అప్పగించడం ద్వారా వారి నాయకత్వ లక్షణాలు వెలుగులోకి వస్తాయని, సమాజ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా పార్కులను సందర్శించే ప్రజలు కూడా వాటిని తమ సొంత ఆస్తిగా భావించి పరిశుభ్రతను కాపాడాలని, మొక్కలను ధ్వంసం చేయకుండా సంరక్షించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే నగరంలో పచ్చదనం పెరుగుతుందని, పరిశుభ్రమైన వాతావరణాన్ని భావితరాలకు అందించగలమని ఆయన అన్నారు. ఎంఎంసీ పరిధిలోని ప్రతి పార్కును ప్రజలకు ఉపయోగపడేలా, పచ్చదనంతో నిండిన ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. స్వయం సహాయక సంఘాల సేవలను మరింత విస్తరించి మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ అధికారులు, ఉద్యానవన శాఖ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు. మహిళల సేవలను గుర్తిస్తూ కమిషనర్ వారిని ప్రత్యేకంగా అభినందించగా, భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో పనిచేసి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏలు సమర్థవంతంగా పనిచేయాలి



**హయత్‌నగర్, జూలై 2 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు సమర్థవంతంగా పనిచేసేలా డివిజన్ అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్, కల్లుగీత పారిశ్రామిక సహకార సంస్థ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వనస్థలిపురం లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇప్పటికే వారం రోజులు గడిచినందున బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని అర్హులందరి ఓటరు నమోదు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కొన్ని బూత్‌లలో ఇప్పటికీ బీఎల్ఓలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డివిజన్ అధ్యక్షులు సమావేశంలో ప్రస్తావించారు. ఫారం-6, ఫారం-7 తదితర దరఖాస్తు ఫారాలను కూడా బీఎల్ఓలు అందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ అంశాలను ఈఆర్ఓ, ఏఈఆర్ఓల దృష్టికి తీసుకెళ్లాలని నాగరాజు గౌడ్ సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహా యాదవ్, లింగాల కిషోర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, శశిధర్ రెడ్డి, మంజుల రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, చెన్నగోని రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్‌గా జడ్చర్ల, మండలంగా కొల్లూరు

- సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి



**జడ్చర్ల, జూలై 2 (జనంసాక్షి) :** జడ్చర్ల నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, అలాగే జడ్చర్లను అర్బన్, రూరల్ మండలాలుగా విభజించి, కొల్లూరును కొత్త మండలంగా ప్రకటించాలని కోరుతూ జడ్చర్ల రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నెల 4న మిడ్జిల్ మండలంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఈ అంశంపై సానుకూల ప్రకటన చేసేలా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చొరవ తీసుకోవాలని సాధన సమితి కో-ఆర్డినేటర్లు డాక్టర్ వడ్త్యావత్ రమేష్ నాయక్, బూరుగుపల్లి కృష్ణ యాదవ్ విజ్ఞప్తి చేశారు. పట్టణ విస్తరణ, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం అత్యంత ఆవశ్యకమని వారు పేర్కొన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ మధుసుధన్ నాయక్, ఆర్డీవో నవీన్, జడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, మిడ్జిల్ తహసిల్దార్‌కు వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో గొడుగు నర్సీములు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి

- ఎస్పి డివి శ్రీనివాస్ రావు



**నార్సింగి, జూలై 2 (జనం సాక్షి) :** ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అధికారులను ఆదేశించారు. గురువారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసులు, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, వాటి పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ, ఎస్ఐ సృజన మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమకారుల ఉద్యమాలు ఆపలేరు




**మొయినాబాద్, జూలై 2 (జనంసాక్షి) :** గురువారం నాడు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన హలో ఉద్యమకారుడా చలో ఉప్పల్ మన హక్కులను అడుక్కుంటే రావు పోరాడితే తప్ప ఈ రాష్ట్రంలో ఉద్యమకారులకు కనీస గుర్తింపు లేదని కార్యక్రమాన్ని తలపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం ఏమైనా చర్య అని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం వస్తే నిధులు నియామకాలు వస్తాయని ఎంతోమంది విద్యార్థుల బలిదానాల వల్ల ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం పదేళ్ల బిఆర్ఎస్ పాలల్లో కనీసమైన ఉద్యమకారులను పట్టించుకోలేదు పాపాన పోలేరు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యమకారుల గుర్తించి వారికి గుర్తింపు కార్డులు 100 గజాల స్థలం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఓడ దాటకముందు ఓడ మల్లన్న ఓడ దాటినంక బోడ మల్లన్న అన్న చదరముగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహారం ఉందని వారి ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల జేఏసీ నాయకులు ఆకుల నవీన్ కుమార్, న్యాలాటి మహిపాల్, మొండ నరసింహులు, నవీన్ గౌడ్,జోన్నాడ బాలరాజ్,పూడూర్ వెంకట రత్నం,కుమ్మరి రాములు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**మోమిన్‌పేట, జూలై 2 (జనం సాక్షి)) :** ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. గురువారము మోమిన్ పేట మండలం 75 వార్డులో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఎన్ని ఫారాలు ఇచ్చారు, కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, కుటుంబ సభ్యులు ఒకే పిఎస్‌లో ఉన్నారా, కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ ప్రతి ఇంటికి తిరిగి అందించాలని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఉర్దూ మాట్లాడే ప్రజలు ఉన్న చోట ఉర్దూ ఫారాలు వారికీ అందజేయాలని ,ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు.



ఎన్యూమరేషన్ ఫారంలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓ లదేనని కలెక్టర్ తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు, అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గర్ల్స్, బాయ్స్, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సంబంధించిన వంటకాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, ఆహార పదార్థాలను పరిశీలించి , విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా తరగతిలో బోధన విధానాన్ని, హాజరు శాతాన్ని పరిశీలించారు. మోమిన్ పేట మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.,ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయలన్నారు. ఆసుపత్రిలో కావలసిన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆసుపత్రికి వచ్చిన రోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఇన్ పేషెంట్ వార్డు, వార్డు గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మున్నిరుద్దిన్, సివిల్ సర్జన్ బుచ్చి బాబు ,ఎం పి డి ఓ రాజ మల్లయ్య, మండల విద్యాధికారి నర్సింలు, స్థానిక సర్పంచు సంధ్యా సుభాష్ గౌడ్ , బి ఎల్ ఓ లు , స్కూల్ ప్రదానోపద్యాయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వికారాబాద్ పట్టణంలో గంజాయి స్వాధీనం

- గుర్తింపు పత్రాలు లేని వాహనాలు సీజ్
- వికారాబాద్ డి.ఎస్.పి అంజయ్య



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** వికారాబాద్ పట్టణంలో పోలీసులు విస్తృత ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, వాహనాల స్వాధీనం చేసుకున్నారు ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డిఎస్పి అంజయ్య తెలిపారు.వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు, డీఎస్పీ పర్యవేక్షణలో బుధవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, నిర్మానుష్య ప్రాంతాలు, రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినాయి. ఈ తనిఖీలలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ , ఐదుగురు సబ్-ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు పాల్గొని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.తనిఖీల సందర్భంగా బస్ స్టాండ్ సమీపంలో సుమారు 15 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. అలాగే వాహనాలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను చూపించలేకపోయిన ఎనిమిది ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, మాదకద్రవ్యాల రవాణా వినియోగాన్ని నియంత్రించడం, దొంగతనాలు, ఇతర నేరాలను నివారించడం, ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా చర్యలు చేపట్టడం జరిగింది అని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య తెలిపినారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు వికారాబాద్ సబ్ డివిజన్ పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని తెలిపినారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని డీఎస్పీ అంజయ్య తెలిపారు.

## విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ పోరాటం




**ఉప్పునుంతల, జూలై 2 (జనం సాక్షి) :** కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వే అధ్యయనం నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చింతల నాగరాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభమై చాలా రోజులు గడిచినా విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు అందజేయలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించేందుకు పీటీ టీచర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే ఆ పోస్టును భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, పాఠ్యపుస్తకాలు విద్యార్థుల అవసరాలకు సరిపడా అందలేదని, మరుగుదొడ్లు తగిన సంఖ్యలో లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల వెనుక భాగంలో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నందున వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే, పాఠశాల స్వీపర్‌కు కేవలం రూ.3,000 మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని, దీనిని పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సర్వే కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ స్కూల్ అధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి ఆకాష్, ఉపాధ్యక్షుడు సిద్దు, సహాయ కార్యదర్శి శివకుమార్, భరత్, కమిటీ సభ్యులు జాహ్నవి, నందిని భాయ్, కృష్ణవేణి, రమ్యశ్రీ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి శాఖల సమన్వయం అవసరం

- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనంసాక్షి) :** ఆపరేషన్ ముస్కాన్ 2026 అమలుపై గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయితో కలిసి పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ అదృశ్యమైన పిల్లలను గుర్తించి రక్షించడం, బాల కార్మికులు, బాండెడ్ లేబర్‌గా పనిచేస్తున్న చిన్నారులను రెస్క్యూ చేసి పునరావాసం కల్పించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో బాల కార్మికులు, బాండెడ్ లేబర్ కేసులు లేదా పిల్లలకు సంబంధించిన సమస్యలు గుర్తించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణమే రెస్క్యూ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రక్షించిన పిల్లలను సంబంధిత శాఖల సమన్వయంతో సురక్షితంగా సంరక్షించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి మాట్లాడుతూ, రెస్క్యూ చేసిన ప్రతి చిన్నారి వివరాలను వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి తెలియజేసి, కమిటీ ఆదేశాల మేరకు పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే పిల్లలను తాత్కాలిక సంరక్షణ గృహాల్లో ఉంచాలని, ఇతర రాష్ట్రాలకు చెందిన చిన్నారులను ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసి స్వగ్రామాలకు తరలించాలని తెలిపారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ మస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల కింద రెస్క్యూ చేసిన పిల్లల పునరావాసంపై కూడా సమీక్ష నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి శ్రీలత మాట్లాడుతూ, డీసీపీయూ ఆధ్వర్యంలో అన్ని డివిజన్లలో చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను నియమించినట్లు తెలిపారు. పిల్లల రక్షణ, పునరావాసం, చట్టపరమైన ప్రక్రియల అమలులో వారు కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు.మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, పిల్లల రక్షణలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, 24 గంటలూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని




సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆపరేషన్ మస్కాన్2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ నరేందర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారి, కార్మిక శాఖ అధికారులు, వీఆర్‌బీ కోఆర్డినేటర్ రోజా, డీసీపీయూ అధికారి ప్రవీణ్‌కుమార్, ఏవీఓ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
03 జూలై 2026

# సమాజ స్థైర్య నిర్మాణానికి కృషి చేయాలి

**• కలెక్టర్ సీహెచ్. ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో స్థిరమైన జీవనోపాధులు, సురక్షిత వలసలు, సమాజ స్థైర్య నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంకసూచించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎఫ్ఏవో, ఐఓఎం, నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, వాసన్ సంయుక్తంగా అమలు చేస్తున్న మైగ్రేషన్ మల్టీ-పార్ట్నర్ ట్రస్ట్ ఫండ్ సంయుక్త కార్యక్రమ మూడవ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ,నిర్వహించారు.ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు,అభివృద్ధి భాగస్వాములు, కార్యక్రమ అమలును సంస్థల ప్రతినిధులు పాల్గొని, కోస్గి, గుండుమల్ మండలాల్లోని వలస కుటుంబాల సామాజిక-ఆర్థిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలు, సురక్షిత వలస సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అనుసంధానంపై కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. సమావేశంలో మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్ ,మొబైల్ మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్, ప్రవాసి హెల్ప్‌లైన్ పనితీరును సమీక్షించారు. వలస కార్మికులు వారి కుటుంబాలకు సమాచారం, మార్గదర్శకత్వం,కౌన్సెలింగ్, సహాయ సేవలు అందిస్తున్న ఈ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.ముఖ్యంగా కార్మిక కార్డులు, ఇతర సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ సేవలకు ఒకే వేదికగా మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని ఆమె స్పష్టం చేశారు.కార్యక్రమం కింద సాధించిన విజయాలు వలస కుటుంబాలకు చెందిన 40 మంది మహిళలకు సమూహాల వారీగా మేకల పెంపకానికి అవసరమైన షెడ్లు, ప్రతి బృందానికి 30 మేకలు, 2 మగ మేకలను అందజేసి జీవనోపాధి అవకాశాలను కల్పించినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు.అలాగే కోస్గి, గుండుమల్ మండలాల్లో మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా పేపర్ ప్లేట్ తయారీ యూనిట్లు సహా మొత్తం ఏడు మహిళా ఆధ్వర్యంలోని సూక్ష్మ వ్యాపారాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించడం వలస, బలహీన వర్గాల కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కోసం ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు.మొబైల్ మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్, ప్రవాసి హెల్ప్‌లైన్ ద్వారా సురక్షిత, క్రమబద్ధమైన చట్టబద్ధమైన వలసలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నారాయణపేటలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ ఏర్పాటు చేయడం, యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడం, మహిళల జీవనోపాధి అవకాశాలను విస్తరించడం, కిచెన్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించడం, కోస్గి చంద్రవంచ, అప్పాయిపల్లిలో ఆర్.ఓ. తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేయడం, అలాగే గ్రామీణ సమగ్రాభివృద్ధి కోసం వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు.ఎం ఎం పీ టీ ఎఫ్ సంయుక్త కార్యక్రమం కింద సాధించిన పురోగతిని అభినందించిన జిల్లా కలెక్టర్ ,ఎఫ్ ఏ వో, ఐ వో ఎం, ఎన్ డబ్ల్యు డబ్ల్యు టి,వాసన్ భాగస్వాములు,జిల్లా శాఖల సమిష్టి కృషిని ఎంతో ప్రశంసించారు.ఈ కార్యక్రమం మరింత విస్తరించి, ఎక్కువ మంది వలస కుటుంబాలు స్థిరమైన జీవనోపాధి,నైపుణ్యాభివృద్ధి, సురక్షిత వలస సేవలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా అన్ని శాఖలు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నారాయణపేట స్థానిక ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండ్‌ను అభివృద్ధి చేయడం, భారీ స్థాయిలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ లను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించి, జిల్లా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.సమావేశం చివరగా మహిళ లు, యువత సాధికారత, స్థిరమైన జీవనోపాధి, సురక్షిత, క్రమబద్ధమైన గౌరవప్రదమైన వలసలను ప్రోత్సహిస్తూ నారాయణపేట జిల్లాలో మరింత స్థైర్యవం తమైన సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని సంకల్పించారు. అనంతరం భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి సక్రియా నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, ఎఫ్ ఏ వో నుంచి జగన్, ఐ వో ఎం రాష్ట్ర సమన్వయకర్త జలజ, సహాయ సమన్వయకర్త మార్ట్ ఆశీర్, కోస్గి, గుండుమల్ ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

**• జిల్లా సంక్షేమ అధికారి డి. సునంద**



**మల్దకల్, జూలై 2 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాషా ముక్త్ భారత్ అభియాన్ వికసిత్ భారత్ కి పెహచాన్‌అనే కార్యక్రమం సందర్భంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా నిరోధంపై అవగాహన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి డి.సునంద మాట్లాడుతూ,మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి ఒక పెద్ద శాపమని,పిల్లలు యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.మత్తు పదార్థాల వ్యసనం వల్ల కుటుంబాలు ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని, సమాజంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ ప్రతిజ్ఞలు, ఈ-ప్రతిజ్ఞ లింక్ క్యూ ఆర్ కోడ్ ప్రచారం,కళాశాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మాదక ద్రవ్యాలపై అవగాహన పెంపొందించి,వాటికి దూరంగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం లేదా వాడంకం జరిగినట్లు తెలిస్తే 1908 అనే టోల్ ఫ్రీ నెంబర్ సమాచారం అందించాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు ప్రాజెక్టర్ ద్వారా వీడియోస్ చూపించడం జరిగింది,మత్తు పదార్థాల వినియోగానమాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీఓ నరసింహ,కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణ,ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి,అధ్యాపకులు రామాంజనేయులుగౌడు విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకోసం జిల్లా మహాసభ

**• ఈ నెల 9న సంగారెడ్డి జిల్లా మహాసభ**
**• టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే పైసల్**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** జర్నలిస్టుల హక్కుల సాధనకోసం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే పైసల్, జిల్లా అధ్యక్షుడు బందారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను ఈనెల 9న సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించనున్న సందర్భంగా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించి మహాసభ ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా పైసల్ మాట్లాడుతూ... జర్నలిస్టుల ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పాత్రికేయులకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు బందారు యాదగిరి మాట్లాడుతూ... ప్రింట్, ఎలక్ట్రానిక్, ఉర్దూ పత్రికలు, కేబుల్ టీవీ, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తోందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డులు సాధించేందుకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మహాసభ నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా మహాసభకు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నందున అన్ని మండలాల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభకు సంబంధించిన ఫ్లెక్సీ ని ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, ఉపాధ్యక్షుడు సిద్ధిక్, కోశాధికారి మసూద్ , టియూ డబ్ల్యూజే ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలపై బీజేపీ నిరసన

**• ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేసిన నాయకులు**



**జహీరాబాద్, జూలై 2 (జనం సాక్షి) :** జహీరాబాద్ ప్రభుత్వ వైద్యశాలలో నెలకొన్న సమస్యలపై భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఆసుపత్రిని సందర్శించిన బీజేపీ నాయకులు స్థానిక ఇన్‌చార్జ్ డాక్టర్ కిరణ్ గారిని కలిసేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులో లేకపోవడంతో నిరసనగా ఖాళీ కుర్చీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు పూల సంతోష్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని విమర్శించారు. వైద్యులు, సిబ్బంది కొరత, మందుల కొరత, పారిశుద్ధ్య లోపాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, ఆసుపత్రిలో నెలకొన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించి మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధీర్ బండారి, కృష్ణారెడ్డి, బీజేపీ కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, అరుణ్ కుమార్, విశ్వనాథ్ యాదవ్, సోమ అనిల్, పాలింకర్ సంతోష్, నరేష్ పాటిల్, బండి వెంకట్, రాయిపల్లి సునీల్, సురేష్, పూరి శివ, పూజ, శ్రీకాంత్, మహేష్ ముదిరాజ్, మంజునాథ్, చందు, అబ్జర్, దిల్దర్, రాజ్‌కుమార్, చరణ్, డీకే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం సూచించిన సన్న రకాలనే సాగు చేయాలి

**• వెంకటాపురం గ్రామ సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్**



**సదాశివపేట, జూలై 2 (జనంసాక్షి) :** వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం సూచిస్తున్న ఏడు రకాల సన్నలనే రైతులు పండించి ప్రభుత్వానికి సహకరించాలని వెంకటాపురం గ్రామ సర్పంచ్ రైతులను కోరారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్, వ్యవసాయ శాఖ అధికారి ఏఈఓ చరణ్ లు ప్రభుత్వం సూచించిన సన్న రకపు వరి సాగు రకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన సన్నారకప్పు వరి సాగు చేసి ప్రభుత్వం అందిస్తున్న బోనస్సు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు జనార్దన్, నర్సింలు, రైతులు శ్రీనివాస్ రెడ్డి, కాజా, మల్లేశం, నరేందర్, నర్సింలు, రాజు, అంబదాస్, ఉమర్ హాలీ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్‌కార్డుల గైడ్ లైన్స్‌లను వెంటనే విడుదల చేయాలి



**గద్వాల నడిగడ్డ, జూలై 2 (జనం సాక్షి) :** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉద్యోగుల హెల్త్ కార్డుల గైడ్ లైన్స్ ను వెంటనే విడుదల చేయాలని జోగులాంబ తెలంగాణ పెన్షనర్స్ గద్వాల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు డిమాండ్ చేశారు. గద్వాల జిల్లా కేంద్రంలో గురువారము పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలను తీరుస్తానని పిఆర్సి ఇస్తానని ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెన్ఫిట్స్ సకాలంలో రాకపోవడం, ఐదు డిఏలు పెండింగ్ లో ఉన్నాయనీ ,పిఆర్సిని అమలు చేయలేదనీ ,రిటైర్డ్ ఉద్యోగుల ఉద్యోగుల జీతాల నుండి 1.5 ప్రకారం జీతం కట్ చేసుకుని నేటికీ కూడా హెల్త్ కార్డులకు సంబంధించిన ఎలాంటి గైడ్ లైన్స్ ఇవ్వకుండ తమన్న ఇబ్బంది పెడుతున్నాడని వెంటనే ప్రభుత్వ ఉద్యోగుల, ఫెన్షనర్స్ ల హెల్త్ కార్డుల గైడ్ లైన్స్ ను ప్రకటించాలని వారి సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ తెలంగాణ అసోసియేషన్ గద్వాల జిల్లా అధ్యక్షులు అబ్దుల్ బాబు తో పాటు,ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్, సుభాన్, భీమన్నలు పాల్గొన్నారు.

## గద్వాల జిల్లా విద్యారంగాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలి



**గద్వాల నడిగడ్డ, జూలై 2 (జనం సాక్షి) :** గద్వాల జిల్లా నూతన పూర్తి స్థాయి జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి విద్యార్థి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి మాట్లాడుతూ చాలా కాలం పాటు గద్వాల జిల్లాలో ఇన్‌చార్జ్ అధికారుల ఆధ్వర్యంలో విద్యాశాఖ పరిపాలన కొనసాగిందని, ప్రస్తుతం పూర్తి స్థాయి డీఈఓ నియామకం జరగడం జిల్లా విద్యారంగానికి ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జిల్లాలో విద్యా వ్యవస్థ సమగ్ర అభివృద్ధికి ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని వారు డీఈఓను కోరారు. గద్వాల జిల్లా విద్యారంగం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా సమర్థవంతమైన పరిపాలన అందించాలని ఆకాంక్షిస్తూ, జిల్లాలో విద్యాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాలు ఎల్లప్పుడూ తమ వంతు నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తాయని నాయకులు స్పష్టం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో వామన్‌పల్లి రంగస్వామితో పాటు గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ సెక్రెటరీ భారత్, పాలమూరు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ ప్రెసిడెంట్ బత్తిని రాము, ఎండీ ఘఫూర్, కిరణ్, యువరాజు, సాంబ ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## రేషన్, ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన తాసిల్దార్ కరుణాకర్



**కేటీదొడ్డి, జూలై 2 (జనం సాక్షి) :** కేటిదొడ్డి మండలం కుచినెర్ల గ్రామంలో తాసిల్దార్ కరుణాకర్ గురువారం రేషన్ దుకాణాలు, ఎరువుల (ఫర్టిలైజర్) దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ రేషన్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను, బయోమెట్రిక్ విధానాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులందరికీ తూకంలో ఎలాంటి మోసాలు లేకుండా రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. అనంతరం ఫర్టిలైజర్ షాపులలో విక్రయిస్తున్న ఎరువులు, విత్తనాల నిల్వలను, ధరల పట్టికలను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు లేదా నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, స్టాక్ బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని యజమానులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడినా, నిత్యావసరాలు మరియు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ కరుణాకర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## యూరియా యాప్ ద్వారానే కొనుగోలు చేయాలి

**మల్దకల్, జూలై 2 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలంలోని రైతులకు ఎటువంటి ఎరువులు కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు వ్యవసాయ శాఖ చేసిందని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ తెలిపారు. గురువారంమండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మండల తహసిల్దార్ ఝాన్సీరాణి,మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తహసిల్దార్ ఝాన్సీరాణి మాట్లాడుతూ కావలసినంత యూరియా అందుబాటులో ఉందని,రైతులు అందరూ కావలసిన యూరియాను యాప్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది.



# పోక్సో, అత్యాచార బాధితులకు సమగ్ర సేవలు అందించాలి

**• జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** మహిళలు, చిన్నారులపై జరిగే పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు వేగవంతమైన న్యాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం డీజీపీ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా స్థాయి భాగస్వామ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... బాధితులు మానసికంగా మరింత ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధితులకు అవసరమైన మానసిక ధైర్యం, వైద్య సేవలు, న్యాయ సహాయం సమర్థవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో భరోసా కేంద్రంలో వైద్య అధికారిని నియమించడం, వైద్య పరీక్షల నివేదికల నాణ్యత మెరుగుపరచడం, పెండింగ్ పరిహార కేసుల పురోగతి, చదువు మానేసిన బాలికలకు తిరిగి విద్యా అవకాశాలు కల్పించడం, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై చర్చించారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ... అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే బాధితులకు త్వరితగతిన నాణ్యమైన సేవలు అందించవచ్చన్నారు. ఈ సమావేశంలో డి.ఎల్.ఎస్.ఏ సౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. లలిత కుమారి, వైద్య అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్మన్ రాజా రెడ్డి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సూర్ రెడ్డి, సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జ్యోతి, డీఎస్పీలు వెంకట్ రెడ్డి, ప్రభాకర్, భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్ పి. దేవలక్ష్మి, భరోసా సెంటర్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## లక్ష్యానికి మించి ఆయిల్‌పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, జూలై 2 (జనంసాక్షి) :** జిల్లాలో లక్ష్యానికి మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.
గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ పంటల విస్తీర్ణం పెంపుదలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నిర్దేశించిన 1600 ఎకరాలకు మించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేలా చొరవ చూపాలన్నారు. ఆ విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు మిగతా పంటలకు, ఆయిల్ పామ్ పంటలు పండిస్తే కలిగే ప్రయోజనాల మధ్య వ్యత్యాసాలను వివరించాలన్నారు. పెట్టుబడి, శ్రమ, సాగునీరు, రాబడి వంటి లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. హార్టికల్చర్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని వివరించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహిస్తుందని అన్నారు. మండలాల వారిగా వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు అంజిప్రసాద్, రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్పి 3 బొగ్గు గని ప్రమాదంలో కార్మికులకు తీవ్రగాయాలు



**శ్రీరాంపూర్, జూలై 2 (జనంసాక్షి) :** శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఎస్ఆర్పి 3 భూగర్భ బొగ్గు గనిలో గురువారం మొదటి షిఫ్ట్ లో ప్రమాదం సంభవించగా ముగ్గురి కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది.గనిలో మొదటి షిఫ్టో రూఫ్ బోల్టింగ్ చేస్తుండగా సైడ్ ఫాల్ కూలి అక్కడ పని చేస్తున్న సపోర్ట్ మెన్లు కలవేని మహేందర్,రవి కుమార్,కోల్ కట్టర్ సంపత్ కుమార్ లకు తీవ్ర గాయాలు కాగా,మహేందర్ అనే కార్మికుడి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ లోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు.అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్న ఏరియా గనులలో తరుచుగా ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసున్న గుర్తింపు సంఘం నాయకులు గాయపడిన కార్మికులను పరామర్శించారు.

## స్త్రీ నిధి రుణాల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి జూలై 2 (జనం సాక్షి) :** స్త్రీ నిధి రుణాల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎంలు, సీసీలు, స్త్రీ నిధి సిబ్బందిని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్త్రీ నిధి రుణాల మంజూరు, రుణ వసూళ్లు, బ్యాంక్ అనుసంధానంపై డీఆర్డీవో మేన శ్రీను, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, రీజినల్ మేనేజర్, డీపీఎంలు, ఏపీఎంలతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాల వసూలు మన స్త్రీ నిధి యాప్ ద్వారా మాత్రమే చెల్లించాలని ఆదేశించారు. అర్హులైన వారికి రుణాల మంజూరులో ప్రగతి సాధించాలని అన్నారు. స్త్రీ నిధులను దుర్వినియోగం చేసిన వీవోఏలపైన రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా రికవరీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎంలు అనిత, రాజేంద్ర ప్రసాద్, ఆర్ఎం రమేష్, ఏపీఎంలు, స్త్రీ నిధి సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా పనిచేయాలి

● వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత




**వరంగల్ బ్యూరో, జూలై 02 (జనం సాక్షి) :** లైంగిక దాడులకు గురైన మహిళలు, చిన్నారులకు చట్టబద్ధమైన రక్షణతో పాటు వైద్య, న్యాయ, మానసిక పరామర్శ, పునరావాస సేవలను సకాలంలో అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు, సంబంధిత ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడానికి గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, బాధితుల గౌరవం, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కేసును సున్నితంగా విచారించాలని సూచించారు. కేసు నమోదు నుంచి దర్యాప్తు, వైద్య పరీక్షలు, ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పునరావాసం వరకు ప్రతి దశలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో నిర్దేశిత గడువులో దర్యాప్తు పూర్తి చేసి, కోర్టులో బలమైన సాక్ష్యాధారాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు అవసరమైన వైద్య సేవలు, మానసిక పరామర్శ, న్యాయ సహాయం ఒకే వేదికపై అందేలా భరోసా కేంద్రం ద్వారా సమర్థవంతమైన సేవలు కొనసాగించాలని సీపీ తెలిపారు.

# ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**హనుమకొండ ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. దామెర మండలం దుర్గంపేట, ఊరుగొండ, పసరగోండ, దమ్మన్నపేట, ఒగ్లాపూర్, ల్యాదేళ్ల, దామెర, కొగిల్వాయి గ్రామాలలో దాదాపు 1కోటి 26 లక్షల 50వేల రూపాయల విపుల గల సిసి రోడ్, సైడ్ డ్రైనేజ్ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. దామెర మండలం రాష్ట్రస్థాయిలో గుర్తింపు వస్తుందని అన్నారు. పరకాల మహిళా డైరీ, వి హబ్ రెండు ప్రధాన కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు అని అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం అని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూనే, మరోవైపు ఆర్టీసీ సంస్థకు సైతం మంచి ఆర్థిక బలాన్ని చేకూరుస్తోంది అని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకుల చేతుల్లో గ్రామాల్లో అభివృద్ధి నిరాదరణకు,నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడంతోపాటు,గ్రామాలలో మౌలిక వసతులను అభివృద్ధి పరచడం కోసం,అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు సమన్వయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



## సొంత మంత్రులే సహకరించడం లేదు

● అందుకే కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారు
● మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**డోర్నకల్, జూలై 2 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలో శ్రీ గంగమ్మ తల్లి విగ్రహం ఊరేగింపు మహోత్సవాల సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సొంత మంత్రుల నుంచే ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వంలో సమన్వయం లోపించడం వల్ల ఏర్పడుతున్న పరిస్థితులను కప్పిపుచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, రాష్ట్ర అభివృద్ధి, రైతుల సమస్యలు, నిరుద్యోగం, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందని ఆమె ఆరోపించారు. ప్రజలు విమర్శలు కాదు, పాలనలో ఫలితాలు కోరుకుంటున్నారని పేర్కొంటూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపైనే దృష్టి సారించాలని సత్యవతి రాథోడ్ కోరారు. ఈ కార్యక్రమంలో మన్యు. పాండు నాయక్. రాయల వెంకటేశ్వర్లు. కడెం బాబు. తుమ్మ వెంకటరెడ్డి. రామనాథం. శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు



## భూ సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, జూలై 2 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలం మద్దికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల తహసిల్దార్ సదానందం తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలల్లోని తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలలకు పంపించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, విద్యార్థులు గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**హనుమకొండ ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** భూములను రీ సర్వే చేయడం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అమ్మవారిపేటలో భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు భూముల రీ సర్వే పై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల వద్దకు ప్రత్యక్షంగా వెల్లి రీ సర్వే జరిగినప్పుడు చాలావరకు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. దశబ్దాల తరువాత భూముల రీ సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో భూముల హద్దులకు సంబంధించిన రాళ్లు దొరకడం లేదన్నారు. సరిహద్దులను నిర్ణయించడం, సర్వే నెంబర్‌ను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. సర్వే చేపట్టడంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. భూముల కొలతల కోసం కొత్తగా రోవర్స్, డీజీపీఎస్ ఉన్నాయన్నారు. ఈ అవగాహన సదస్సులో కాజీపేట తహసీల్దార్ రాజు, సర్వే విభాగం డిప్యూటీ ఇన్స్పెక్టర్ సారంగపాణి భూముల రీ సర్వే గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామానికి చెందిన పలువురు భూ సమస్యలను గురించి కలెక్టర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో భూములు కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన బల్దియా కమిషనర్

**వరంగల్ ఎంజీఎం, జూలై 2 (జనంసాక్షి) :** గ్రేటర్ వరంగల్ నగరానికి తాగునీటిని అందిస్తున్న ప్రధాన జలవనరైన ధర్మసాగర్ రిజర్వాయర్ను జీడబ్ల్యుఎంసీ కమిషనర్ టి. వెంకన్న గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రిజర్వాయర్‌లో ఉన్న ప్రస్తుత నీటి నిల్వలు, నగరానికి జరుగుతున్న తాగునీటి సరఫరా విధానం, నీటి శుద్ధి ప్రక్రియ, నీటి నాణ్యత, పంపింగ్ వ్యవస్థ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.నగర ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన తాగునీటిని నిరంతరం సరఫరా చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, అవసరమైన శుద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు.రిజర్వాయర్‌లో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టాలని తెలిపారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పంపింగ్ స్టేషన్లు, పైప్‌లైన్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు న రా చిం చా రు . క్షే త్ర స్థా యి లో పరిస్థితులను పరిశీలించిన అనంతరం, తాగునీటి నిర్వహణలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు.అంతకు ముందు కొనసాగుతున్న చెత్త సేకరణ తీరును సిబ్బంది తో మాట్లాడి తెలుసుకున్నారు.అనంతరం నగర పరిధి లోని వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, కే యు సి ఫిల్టర్ బెడ్, దేశాయి పేట లోని ప్రతాప రుద్ర ఫిల్టర్ బెడ్ లలో సందర్శించి నీటి సరఫరా తీరు తో పాటు కొనసాగుతున్న నీటి నాణ్యత పరీక్షలను కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పరిశీలనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు రవికుమార్,మాధవి లత సంజయ్ కుమార్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు రంగారావు రాజ్‌కుమార్ సారంగం,సంతోష్ కుమార్ అసిస్టెంట్ ఇంజనీర్ హరికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఇండస్ట్రియల్ పార్కును అడ్డుకునేందుకు రాజకీయ కుట్ర

● అబద్ధాల పత్రిక పై పరువు నష్టం దావా వేస్తా
● ఎమ్మెల్యే పాయల్ శంకర్

**మావల, జూలై 2 (జనంసాక్షి) :** నమస్తే తెలంగాణ పత్రికలో ఈరోజు ప్రచురితమైన కథనం పూర్తిగా అసత్యమని, రాజకీయ దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆదిలాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక కొందరు బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ,వాళ్ళ పార్టీ కరపత్రంగా వున్నా నమస్తే తెలంగాణ పత్రిక ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన జోగు రామన్న ఆదిలాబాద్ అభివృద్ధికి ఏనాడు కృషి చేయలేదని అన్నారు.ఆదిలాబాద్‌లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటును జోగు రామన్న వ్యతిరేకిస్తున్నారని, అందుకే కల్పిత కథనాలు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ వల్ల తనకు వ్యక్తిగత లాభం ఉంటే, ఆ ప్రాంతంలో ఉన్న తన భూమిని ఎందుకు విక్రయిస్తానని ప్రశ్నించారు. అలాంటి ఉద్దేశం ఉంటే భూములు అమ్మకుండా మరింత కొనుగోలు చేసేవాడినని స్పష్టం చేశారు.జోగు రామన్న మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వే ఓవర్‌బ్రిడ్జి వంటి కీలక అభివృద్ధి పనుల కోసం ఎప్పుడైనా ఆ దిశ గా ప్రయత్నం చేశారా అని ప్రశ్నించారు. వెనుకబడిన ఆదిలాబాద్ అభివృద్ధి కోసం తాను అసెంబ్లీలో నిరంతరం గొంతు వినిపిస్తున్నానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులు, ముఖ్యమంత్రితో చర్చించి నిధులు, అభివృద్ధి పనులు తీసుకొస్తుంటే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలోనే ఆదిలాబాద్ అభివృద్ధిని అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశానని, అయినప్పటికీ జోగు రామన్న అడుగడుగునా అభివృద్ధికి ఆటంకం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తనపై అసత్య కథనాలు ప్రచురించిన నమస్తే తెలంగాణ పత్రికపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆదిలాబాద్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తానని అన్నారు. వీరితో పాటు నాయకులు జోగు రవి, రాందాస్, రఘుపతి, దయాకర్ దినేష్ మాటోలియా గంగాధర్, శ్రీకాంత్ గంటా జీవన్, దత్తు ,సూర్య, సాయి తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
03 జూలై 2026

# పామాయిల్ తోటలతో సిరుల పంట

- వరిని వీడి ఫామాయిల్ వైపు మళ్లాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 2 (జనంసాక్షి) :** రైతులు వరి సాగుకు స్వస్తి పలికి, రాబోయే రోజుల్లో లాభసాటిగా ఉండే పామాయిల్ తోటల వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట మండలంలోని కాసరాబాద్ లోని ఆయిల్ పామ్ పంటలను కలెక్టర్ పరిశీలించి పామాయిల్ సాగు చేస్తున్న మల్లేష్ అనే రైతుతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ తోటలు రైతులకు సిరుల పంటగా మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతులకు మేలు చేసే పంటల్లో పామాయిల్ అత్యుత్తమమైనదని పేర్కొన్నారు.వరి సాగుతో పోలిస్తే ఇందులో పెట్టుబడి భారం చాలా తక్కువని తెలిపారు.ఒక్కసారి ఈ తోటను నాటితే నాలుగు సంవత్సరాల నుంచి మొదలై ఏకంగా 30 సంవత్సరాల వరకు రైతులకు స్థిరమైన, అధిక ఆదాయం లభిస్తుందని వివరించారు.పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు 70 శాతం నుండి 90 శాతం వరకు భారీ సబ్సిడీని అందిస్తున్నాయని తెలిపారు.ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈ అద్భుతమైన సదుపాయాలను, రాయితీలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తోట నాటిన మొదటి నాలుగు సంవత్సరాల వరకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.పామాయిల్ తోటల్లో మొదటి మూడు సంవత్సరాల వరకు మొక్కలు పెరిగే లోపు రైతులు వివిధ అంతర పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు.ఇందులో వక్క మిరియాలు,తమలపాకు వంటి వివిధ రకాల అంతర పంటలను, బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు.మూడున్నర ఏళ్ల తర్వాత పామాయిల్ ద్వారా ప్రధాన ఆదాయం రావడం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య ,జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్ , వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య,సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి కట్ట స్వాతి,ఉద్యాన విస్తరణ అధికారులు యారాల సుధాకర్ రెడ్డి, రంగు ముత్యంరాజు, వంగూరి అనిల్,ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ నిమ్మ గోపికృష్ణ , ఫీల్డ్ ఆఫీసర్ భవిష్య ,రైతులు వెదిరే లక్ష్మీ నరసింహారెడ్డి,కిషన్ రెడ్డి, ఆశబోయిన మల్లేష్ ,బొమ్మగాని సైదులు ,రామకృష్ణ ,తన్నీరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హాజీపూర్ తండాలో నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండా గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం సందర్శించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని, కంపోస్ట్ షెడ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడి, నర్సరీ నిర్వహణ, కంపోస్ట్ తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, మొక్కల పెంపకం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ,గ్రామ పంచాయతీ నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేసి, హరితహారాన్ని విజయవంతం చేయాలి. కంపోస్ట్ షెడ్లను సద్వినియోగం చేసుకుని సేంద్రీయ ఎరువుల తయారీని పెంచాలి. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ సాగును రైతులు విస్తృతంగా చేపట్టాలి. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సబ్సిడీలపై పూర్తి అవగాహన కల్పించాలి. గ్రామ స్థాయిలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీవో, వ్యవసాయ అధికారి, సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పామాయిల్ పంటతో అధిక లాభం

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 2 (జనం సాక్షి) :** వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, ఆయిల్‌పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా లాభదాయకమైన పంటగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.గురువారం ఏన్కూర్ మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ గార్లఒడ్డు గ్రామానికి చెందిన రైతు కాటా హరినాథ్‌బాబు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో తిరుగుతూ ఆయిల్‌పామ్ మొక్కల పెరుగుదల, బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్), అంతర పంటల సాగు, మొక్కల సంరక్షణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుతో మాట్లాడిన కలెక్టర్ పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, ప్రభుత్వ సబ్సిడీలు, దిగుబడి, మార్కెటింగ్, రైతులకు లభిస్తున్న ధరలు, అంతర పంటల ద్వారా వస్తున్న అదనపు ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల అనుభవాలు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రశంసించారు. మొక్కలు నాటడం, డ్రిప్ ఏర్పాటు, సాంకేతిక సూచనలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అన్ని అంశాల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి



**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 2 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తట్టి అన్నారం ఆర్కే నగర్ గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న జనగణన ఫారాల పంపిణీ, నమోదు పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, బీఎల్ఓలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వేగం పెంచాలని ఆదేశించారు. ప్రతి అర్హుడి వివరాలు నమోదు అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. బీఎల్ఓలకు ప్రజలంతా సహకరించి అవసరమైన వివరాలు, పత్రాలు సకాలంలో అందించాలని కోరారు.అనంతరం తట్టి అన్నారం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాది అని పేర్కొన్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదయ్యేలా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఓటు విలువైనదని, ఓటరు జాబితా కచ్చితత్వం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. బీఎల్ఓలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని ఫారాలను సకాలంలో పూర్తిచేసి అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గోవర్ధన్, గణేష్, బీఎల్ఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన కలెక్టర్



**పెద్దకొడపగల్, జూలై 2 (జనంసాక్షి) :** పెద్ద కొడప్గల్ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో గురువారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని ప్రారంభించి, మంజూరు పత్రాన్ని అందజేశారు. సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరగా నాణ్యతతో ఇందిరమ్మ ఇల్లు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇల్లును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి గోడ గడియారాన్ని అందజేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి స్థితిని తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణను 100 శాతం పారదర్శకంగా, తప్పులు లేకుండా త్వరగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామస్తులు నీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్థానిక అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. భూగర్భ జలాల పెరుగుదలకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి బలరాం, తహసిల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శామప్ప, మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ ఉద్యోగ మేళాకు విశేష స్పందన



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** జిల్లా శిక్షణ ఉపాది కల్పన శాఖ ఆధ్వర్యంలో టామ్ కామ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగ మేళా, జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. గురువారం స్థానిక వర్ని చౌరస్తా సమీపంలోని జనార్దన్ గార్డెన్ లో నిర్వహించిన జాబ్ మేళాకు ఐదు వేల పైచిలుకు మంది యువత తరలివచ్చారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు జాబ్ మేళాను సందర్శించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను చేపడుతోందని, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విదేశాల్లో ఉద్యోగాలు చేయడానికి ఎలాంటి భయాందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రవాస భారతీయుల సంక్షేమానికి పెద్దపేట వేస్తుందన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొత్త పాలసీ రూపొందించనుందని తెలిపారు.నిజామాబాద్ లో ఇంత పెద్ద స్థాయిలో విదేశీ జాబ్ మేళా నిర్వహించడం ప్రశంసనీయమని నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాది కల్పన శాఖ అధికారి వేల్పుల విజేత, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నిరుద్యోగ యువతీ, యువకులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలి



**భువనగిరి, జూలై 2 (జనం సాక్షి) :** సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాల లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నివాసం ఉండేలా అన్ని మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భువనగిరి క్యాంపు కార్యాలయంలో డబుల్ బెడ్‌రూమ్ గృహాల మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను ఇప్పటికే కేటాయించిన నేపథ్యంలో, తాగునీరు, విద్యుత్, అంతర్గత సీసీ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు మిగిలిన అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అదనపు నిధులను సమకూర్చి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీరేఖ-బాబురావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, పంచాయతీరాజ్, మున్సిపల్, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు పాములు, విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉన్న గుంతలలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి, విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను అందించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శ్రవణ్, ఎంపీడీఓ కమలాకర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్యామల తదితరులు ఉన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామి వారి హుండీ ఆదాయం 2 కోట్ల 78 లక్షలు



**యాదగిరిగుట్ట టెంపుల్ జూలై 2 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం ఆలయ అధికారులు లెక్కించారు . 28 రోజుల హుండీ ఆదాయం లెక్కించగా 2 కోట్ల 78 లక్షల13 వేల 79 రూపాయల నగదు ఆలయానికి చేకూరినట్టు ఆలయ ఈఓ భవాని శంకర్ వెల్లడించారు. అలాగే 708 గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల 150 గ్రాముల వెండి సైతం లభించినట్టు తెలియజేశారు. అలాగే పలు దేశాల నగదు సైతం హుండీ లెక్కింపులో ఆలయానికి వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపు లో ఆలయ ఈఓ భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర నరసింహ మూర్తి,ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కొండక్రింద సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు.

# విద్యాసంస్థలపై దాడి చేయరాదు

- చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు
- పోలీస్ కమిషనర్ హెచ్చరిక
- విద్యాసంస్థల బంద్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు
- విద్యాసంస్థల అనుమతి లేకుండా విద్యార్థి సంఘాలు ప్రవేశించరాదు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్,ఆర్మూర్,బోధన్ డివిజన్ పరిధిలోని గల అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో చట్టాన్ని కొన్ని విద్యార్థి సంఘాలు తమ చేతిలోనికి తీసుకోని, స్కూల్స్ , కాలేజీలలో ప్రవేశించి అలజడి సృష్టించడం జరుగుతుందని,ఏవో కొన్ని వసతులు లేవని పుస్తకాలు అమ్ముతున్నారనే కారణాలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని,విద్యాసంస్థలను ఇబ్బందులకు బెదిరింపులకు పాల్పడుతున్నారని వివిధ సమస్యలపై విద్యాసంస్థల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి వారిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామని నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ హెచ్చరించడం జరిగింది. డిచ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశపూర్, బర్దిపూర్ శివారులోని నారాయణ విద్యాసంస్థ పై అక్రమంగా ప్రవేశించి అక్కడ కుర్చీలు , ఫ్లెక్సీలు మొదలగునవి ధ్వంసం చేయగా వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగింది.వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని చందూరు మండలంలో శ్రీ సాయి విద్యాలయం స్కూల్లో యాజమాన్యం అనుమతి లేకుండా ప్రవేశించి సిబ్బందిని బెదిరిస్తూ పిల్లలను భయాందోళనకు గురి చేస్తూ కొన్ని వస్తువులను ధ్వంసం చేసినందుకు క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగింది.ఈ రెండు కేసులలో వున్నవారు గతంలో కూడా కేసులు ఉన్నట్లయితే వారిపై అదనపు కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుంది.విద్యాసంస్థలకు సంబంధించినటువంటి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు లేదా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సమస్యలపై అధికారులకు నిబంధన ప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అంతేకానీ విద్యార్థి సంఘాల పేరు చెప్పుకొని పాఠశాలలో ఇబ్బందికర వాతావరణ సృష్టించవద్దని , విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ వారికి అసౌకర్యం కలిగించకూడదని సూచించారు చట్టాన్ని తమ చేతుల్లోనికి తీసుకొని విద్యాసంస్థల నిర్వాహకుల నిర్వహణకు ఆటంకం కలిగిస్తే బాధ్యులపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామని అలాంటి వ్యక్తులపైన క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.సుప్రీం కోర్టు గైడ్లైన్స్ ప్రకారం స్కూల్స్ , కాలేజీలు ఎవరు కూడా బంద్ చేయించరాదు, అలా విద్యాసంస్థలను బంద్ చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సీజన్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి అసిస్టెంట్ కలెక్టర్



**భీంగల్, జూలై 2 (జనం సాక్షి) :** భీంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పామురి, ఐఏఎస్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా భీంగల్ మున్సిపాలిటీని ఈ రోజు పర్యటించారని కమిషనర్ డి. గజానంద్ తెలిపారు. శిక్షణలో భాగంగా మున్సిపల్ ర్యాలయము నందు సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆ శాఖకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరియు పట్టణంలో జరుగుచున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే రాబోయే వర్షాకాలము దృష్ట్యా ప్రజలకు వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రజలకు తడిచెత్త మరియు పొడి చెత్త పై అవగాహనా కల్పించాలని ఆదేశించినారు. ఇట్టి కార్యక్రములో చైర్ పర్సన్ బోదిరే నాగమణి.స్వామి.మరియు వైస్ చైర్ పర్సన్ సంటి లత.నర్సయ్య.మరియు కౌన్సిలర్లు ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ సురేష్ పాముని, ఐఏఎస్ ని సన్మానించడం జరిగిందని కమీషనర్ గజానంద తెలిపారు.




# ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల జోష్..

## సెన్సెక్స్ +579, నిఫ్టీ +169

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. అంతర్జాతీయ పరిస్థితులు సానుకూలంగా మారడం, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. అదేవిధంగా ఐటీ షేర్ల కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 579 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 169 పాయింట్లు పైకి ఎగబాకింది. సెన్సెక్స్ ఉదయం 77,083.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,922.64) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. 77,578.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 579.48 పాయింట్ల లాభంతో 77,502.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 169.85 పాయింట్ల లాభంతో 24,175.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌సీఎల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎల్‌అండ్‌టీ, మారుతీ, యాక్సిస్‌బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, కోటక్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.40గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.54 డాలర్ల వద్ద ఉండగా, బంగారం ఔన్సు ధర 4,063 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**జూన్‌లోనూ విక్రయాలవైపే విదేశీ మదుపర్లు..**

దేశీయ ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, అభివృద్ధి చెందిన మార్కెట్‌లలో పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు ఉండడం, అమెరికాలో బాండ్ రాబడుల్లో పెరుగుదల వంటి తదితర కారణాలతో జూన్‌లోనూ విదేశీ మదుపర్లు అమ్మకాలకు దిగారు.




గత నెల ఏకంగా రూ.49,340 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. 2026 క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.2.7 లక్షల కోట్ల పెట్టుబడులను విదేశీ మదుపర్లు విక్రయించినట్లు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ డేటా ద్వారా తెలుస్తోంది. 2025లో విక్రయించిన మొత్తం (రూ.1.66 లక్షల కోట్లు) కంటే ఈ మొత్తం చాలా అధికం. ఒక్క ఫిబ్రవరి (రూ.22,615 కోట్లు) మినహా ప్రతి నెలలోనూ విదేశీ మదుపర్లు నెట్ సెల్లర్లుగా నిలిచారు. జనవరిలో రూ.35,962 కోట్లు ఉపసంహరించుకోగా.. మార్చిలో గరిష్ఠంగా రూ.1.17 లక్షల కోట్లు పెట్టుబడులను తరలించారు. ఏప్రిల్‌లో రూ.60,847 కోట్లు, మేలో రూ.32,963 కోట్లు, జూన్‌లో రూ.49,340 కోట్లు చొప్పున ఉపసంహరించుకున్నారు. జూన్ తొలి అర్ధ భాగం వరకు భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా పెద్ద మొత్తంలో విదేశీ మదుపర్లు తమ నిధులను తరలించారని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా ప్రిన్సిపల్ హిమాన్షు శ్రీవాస్తవ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్లు ఆకర్షణీయంగా ఉండడం, అమెరికాలో బాండ్ల రాబడులు పెరగడం, దేశీయ ఈక్విటీ విలువపై ఆందోళనలు వంటివి ప్రభావం చూపాయని పేర్కొన్నారు. జూన్ రెండో అర్ధభాగంలో అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం, క్రూడాయిల్ ధరల తగ్గుముఖం పట్టడం సానుకూల ప్రభావం చూపిందన్నారు. ఈ కారణంతో నెలాఖరులో విక్రయాలు నెమ్మదించాయని తెలిపారు. విదేశీ మదుపర్లను ఆకర్షించడంలో భాగంగా ఎఫ్‌సీఎన్‌ఆర్ డిపాజిట్లపై హెడ్జింగ్ ఖర్చులను ఆర్‌బీఐ భరించడం, ఫారెక్స్ స్వాప్, ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులకు యాక్సెస్ పెంచడం వంటి చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఈక్విటీల నుంచి జూన్ నెలలో విదేశీ మదుపర్ల పెట్టుబడులు తరలినప్పటికీ.. డెట్ సెక్యూరిటీల్లో ఎఫ్‌ఏఆర్ మార్గంలో రూ.21,652 కోట్లు, వాలంటరీ రిటెన్షన్ మార్గంలో రూ.3,246 కోట్లు పెట్టుబడి పెట్టడం గమనార్హం.

## ఓటీపీ, పాస్‌వర్డ్‌ల స్థానంలో పాస్‌కీ..

### వీసా వినియోగదారులకు కొత్త సదుపాయం

**న్యూఢిల్లీ:**భారత డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు తప్పనిసరి. ఇవి సురక్షితమైనప్పటికీ కొన్నిసార్లు ఆర్థిక మోసాలు జరుగుతున్నాయి. అయితే, డిజిటల్ వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు, మోసాలకు చెక్‌పెట్టేలా వీసా సంస్థ పేమెంట్ పాస్‌కీ విధానాన్ని తీసుకొచ్చింది. ఇకపై డివైజ్ పాస్‌వర్డ్, ఫేషియల్ రికగ్నైజేషన్ , ఫింగర్ ప్రింట్‌తోనే సులువుగా ఆన్‌లైన్ లావాదేవీలు జరపొచ్చు.ఏఐ యుగానికి తగ్గట్టుగా పేమెంట్ పాస్‌కీని తీసుకొచ్చినట్టు భారత అండ్ దక్షిణాసియా వీసా గ్రూప్ మెనేజర్ సురేశ్ సేథీ తెలిపారు. ఆర్‌బీఐ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని రూపొందించామన్నారు. సంప్రదాయ ఓటీపీ, పాస్‌వర్డ్‌ల కంటే బయోమెట్రిక్ విధానమే సురక్షితమన్నారు. ఫోన్ ఫింగర్ ప్రింట్, ఫేస్ లాక్ లేదా డివైజ్ పిన్‌ల ద్వారానే డిజిటల్ లావాదేవీలు చేయొచ్చని తెలిపారు. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని.. పాస్‌కీ మరో సురక్షిత దశలోకి చేరుతుందన్నారు. ఇందుకోసం బ్యాంకులు, ఫినెటెక్ సంస్థలు, టెక్నాలజీ ప్రొవైడర్‌లతో వీసా భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో కలిసి ఎంపిక చేసిన యూజర్లకు ఈ సదుపాయాన్ని భారత్‌లో గురువారం అందుబాటులోకి తెచ్చింది.

**ఎలా పనిచేస్తుంది?**

వినియోగదారులు తమ వీసా కార్డును తమ స్మార్ట్‌ఫోన్‌కు లింక్ చేయడానికి తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆపై ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు ఫోన్ అన్‌లాక్ చేసినట్లుగా మీ ఫింగర్ ప్రింట్ లేదా ఫేస్‌ఐడీ లేదా డివైజ్ పిన్ ఎంటర్ చేసి లావాదేవీని పూర్తి చేయొచ్చు. ఓటీపీలు కాకుండా అదనపు అథంటికేషన్ సదుపాయం ఉండాలని ఆర్‌బీఐ సూచించిన నేపథ్యంలో వీసా పాస్‌కీ సదుపాయాన్ని తీసుకొచ్చింది. మొబైల్ నెట్‌వర్క్ సమస్యల వల్ల ఓటీపీలు రాక పడే ఇబ్బందులూ పాస్ కీ ద్వారా తప్పనున్నాయి.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

## ఒప్పో నుంచి రెనో 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు..

న్యూఢిల్లీ:ఒప్పో తన రెనో సిరీస్‌లో కొత్త ఫోన్లను దేశీయ మార్కెట్‌లో లాంచ్ చేసింది. రెనో 16 సిరీస్‌ను తీసుకొచ్చింది. ఈ సిరీస్‌లో ఒప్పో రెనో 16, ఒప్పో రెనో 16సీ పేరిట ఫోన్లను లాంచ్ చేసింది. వీటితో పాటు ఒప్పో బబుల్ యాక్సెసరీని తీసుకొచ్చింది. ఈ రెండు స్మార్ట్‌ఫోన్లు ఆండ్రాయిడ్ 16తో పనిచేస్తాయి. ఈ ఫోన్‌కు 6.32 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ +ఆమోలెడ్ డిస్‌ప్లే, 120హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు, 3,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. క్వాల్‌కామ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 7 జెన్4 ప్రాసెసర్‌తో ఉంది. ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్ ఆప్షన్‌తో పాటు ఇందులో ట్రిపుల్ కెమెరా అమర్చారు. వెనక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా+ 50 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా+ 50 ఎంపీ టెలిఫొటో కెమెరా ఇచ్చారు. ముందు వైపు 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది.

# ఏడాదికి రెండుసార్లే పీఎఫ్ ఉపసంహరణ

### 20 రోజుల్లో క్లెయిమ్ సెటిల్ చేయకుంటే 12% పెనాల్టీ

**న్యూఢిల్లీ:**ఈపీఎఫ్ క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పీఎఫ్ విత్‌డ్రా, పెన్షన్ ఫిక్సేషన్‌కు కాలపరిమితిని నిర్దేశించింది. ఈపీఎఫ్–1952, ఈపీఎస్–1995, ఈడీఎల్ఐ–1976 స్థానాల్లో సామాజిక భద్రత కోడ్ కింద ఉద్యోగుల భవిష్యనిధి పథకం–2026, ఉద్యోగుల పింఛను పథకం–2026, ఉద్యోగుల డిపాజిట్ బీమా పథకం–2026 తీసుకొస్తున్నట్లు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో ఈ నిబంధనలను పొందుపరిచింది.పీఎఫ్ విత్‌డ్రా, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ నిర్ణయం, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను వేగంగా పూర్తి చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇకపై అర్హత కలిగిన క్లెయిమ్‌లను ఎలాంటి సహేతుక కారణం లేకుండా 20 రోజుల్లోగా పరిష్కరించకపోతే సంబంధిత ఈపీఎఫ్ఓ కమిషనర్‌పై 12 శాతం పెనాల్టీ విధిస్తారు. క్లెయిమ్ మొత్తంపై విధించే వడ్డీ మొత్తాన్ని సదరు అధికారి జీతం నుంచి మినహాయించి.. క్లెయిమ్ చేసిన వ్యక్తికి ఆలస్యానికి పరిహారంగా చెల్లిస్తారు.చెల్లింపుల ఆలస్యానికి పరిహారం చెల్లించే నిబంధన గత పథకాల్లోనూ ఉందని అధికార వర్గాలు తెలిపాయి. గతంలో నిర్ణయించిన వడ్డీ మొత్తాన్ని చెల్లించే నిబంధన ఉండగా.. ఇప్పుడు 12 శాతంగా నిర్ణయించినట్లు తెలిపారు. కోడ్‌ను అనుసరించి కొత్త పథకాలను నోటిఫై చేయడం మినహా ఈపీఎఫ్ఓ, ఈపీఎస్ పథకాలకు సంబంధించిన చెల్లింపుల్లో ఎలాంటి మార్పులూ చేయలేదని పేర్కొన్నారు.అలాగే, ఈపీఎఫ్ఓ సేవలు ఆన్‌లైన్‌లో నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా నిబంధనలను కేంద్రం పొందుపరిచింది. ఎంప్లాయర్లు, ఈపీఎఫ్ఓ కార్యాలయాలు, ఈపీఎఫ్ఓ నుంచి మినహాయింపు పొందిన పీఎఫ్ ట్రస్ట్‌లన్నీ.. క్లెయిమ్‌ల దాఖలు కోసం మెంబర్లకు ఆన్‌లైన్ సదుపాయాలను తప్పనిసరిగా కల్పించాల్సి ఉంటుందని కేంద్రం పేర్కొంది. ఈపీఎఫ్ నుంచి ఏడాదికి రెండుకన్నా ఎక్కువ పాక్షిక ఉపసంహరణలు చేయకుండా నిబంధనలు కఠినతరం చేసింది.

## రూ.9,500 కోట్ల ఐపీఓకు కోకాకోలా ఇండియన్ యూనిట్!

**వాషింగ్టన్:**ప్రముఖ శీతలపానీయాల సంస్థ కోకాకోలా.. భారత్‌కు చెందిన తన బాటిలింగ్ యూనిట్ హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పబ్లిక్ ఇష్యూకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. మార్కెట్ నుంచి 1 బిలియన్ డాలర్లు, అంటే మన కరెన్సీలో దాదాపు రూ.9,500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందుకోసం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులను ఆహ్వానించినట్లు తెలుస్తోంది.వచ్చే వారం లండన్ వేదికగా ప్రజంటేషన్ ఉండొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కోకాకోలాకు ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఉన్న రోత్స్‌చైల్డ్ అండ్ కో సంస్థ ప్రతిపాదిత ఐపీఓపై బ్యాంకర్లతో సమావేశం కానుంది. ఐపీఓ సైజ్, ఇతర వివరాలపై త్వరలో స్పష్టత రానుంది. దీనిపై కోకాకోలా అధికారికంగా స్పందించలేదు.ఇటీవల కాలంలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ భారత అనుబంధ సంస్థలను ఐపీఓకు తీసుకొస్తున్నాయి. ఎల్‌జీ, హ్యుందాయ్ ఇప్పటికే పబ్లిక్ ఇష్యూకు రాగా.. కోకాకోలా కూడా ఈ జాబితాలో చేరనుంది. కోకాకోలాకు భారత్ అతిపెద్ద మార్కెట్. ప్రస్తుతం హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ లిమిటెడ్ విలువ 10 బిలియన్ డాలర్లుగా ఉంది. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థకు 12 రాష్ట్రాల్లో 14 తయారీ ప్లాంట్లు ఉన్నాయి. దాదాపు 5,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 17 లక్షల రిటైల్ ఔట్‌లెట్లు ఉన్నాయి.




# సంపాదనలోనూ ట్రంప్ జంప్

### ఏడాదిలో ట్రంప్ ఆదాయం 2.2 బిలియన్ డాలర్లు

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన నాటి నుంచీ డొనాల్డ్ ట్రంప్ వ్యాపారంలో అంతులేని లాభాలు గడిస్తున్నారు. ఏడాది కాలంలో ఆయన వ్యాపార సామ్రాజ్యం 2.2 బిలియన్ డాలర్ల (సుమారు 20 వేల కోట్ల రూపాయలు) ఆదాయం ఆర్జించింది. 2025 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ నైతిక విభాగానికి ఆయన సమర్పించిన ఆర్థిక నివేదిక ఈ విషయం వెల్లడించింది. "ద ట్రంప్ ఆర్గనైజేషన్" అనే బడా వ్యాపార సంస్థకు డొనాల్డ్ ట్రంప్ యజమానిగా ఉన్నారు. ఆయన కుమారులు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్‌లు ఈ సంస్థకు ట్రస్టీలుగా,



కార్యనిర్వాహక ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ద ట్రంప్ ఆర్గనైజేషన్ క్రిప్టో కరెన్సీ నుంచి విలాసవంతమైన గోల్ఫ్ క్లబ్బుల వరకూ అనేక రకాల వ్యాపారాలు నిర్వహిస్తోంది. ఆయన అధ్యక్షునిగా ఎన్నిక కావడానికి పూర్వం 2024 సంవత్సరంలో కేవలం 622 మిలియన్ డాలర్ల ఆదాయం పొందిన ట్రంప్ సంస్థ 2025లో అందుకు దాదాపు నాలుగింతల ఆదాయం ఆర్జించింది.

ఒక్క 'క్రిప్టో' ద్వారానే బిలియన్ డాలర్లు

డొనాల్డ్ ట్రంప్ గత సంవత్సరం ఒక్క క్రిప్టో కరెన్సీకి సంబంధించిన వ్యాపారంలో బిలియన్ డాలర్లకు పైగా సంపాదించారు! సెలబ్రేషన్స్ కాయిన్స్ అనే సంస్థ నుంచి 635 మిలియన్ డాలర్లు రాయల్టీ రూపంలో లభించింది. ట్రంప్ కుమారులు, ఆయన ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌లు స్థాపించిన వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ నుంచి అమెరికా అధ్యక్షునికి మరో 500 మిలియన్ డాలర్ల ఆదాయం కలిసివచ్చింది. రియల్ ఎస్టేట్ తదితర వ్యాపార కార్యకలాపాల ద్వారా ఆయన మిలియన్ల కొద్దీ డాలర్లు గడించారు. అయితే ఇవన్నీ ఆయన తన అధ్యక్ష పీఠాన్ని అడ్డం పెట్టుకొని గడించినవి కాదని శ్వేతసౌధం స్పష్టం చేసింది. 1978 నాటి చట్టం ప్రకారం అమెరికా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు తమ ఆస్తులతో పాటు ఆదాయాన్ని క్రమం తప్పకుండా వెల్లడించాల్సి ఉంటుంది.

## ఎంపైర్ స్టేట్ టవర్ ఎక్కి ఎంగేజ్‌మెంట్

### అమెరికాలో ఓ ప్రేమ జంట ప్రమాదకర స్టంట్
### అరెస్టు చేసిన పోలీసులు

*వాషింగ్టన్:ఒక జంట తమ ప్రేమకు గుర్తుగా ప్రమాదకర స్టంట్ చేసింది. న్యూయార్క్ నగరంలోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ టవర్ పై భాగానికి ఎక్కి.. ఎంగేజ్‌మెంట్ చేసుకుందా జంట ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట్లో వైరల్ అవడంతో వారిద్దరు కటకటాలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. రష్యన్ జంట ఇవాన్, ఏంజెలా నికోలవ్ తమ ప్రేమను మరోమెట్టుకు ఎక్కించేందుకు ఎంపైర్‌స్టేట్ భవనం టవర్ ఎక్కారు. 443 మీటర్ల ఎత్తులో ఏంజెలాకు ఇవాన్ ప్రపోజ్ చేశాడు. 10 నిమిషాల పాటు అక్కడే ఉన్నారు. నల్లని దుస్తులు ధరించిన వారిద్దరూ.. అదే రంగులో ఒక బ్యానర్‌ను ప్రదర్శించారు. 'అధికార దాహాన్ని ప్రేమకున్న శక్తి అధిగమించినప్పుడు ప్రపంచంలో శాంతి విలసిల్లుతుంది' అని దానిపై రాశారు. ఆ వీడియో దృశ్యాలు అత్యంత ప్రమాదకరంగా కనిపించాయి. ఈ నిర్లక్ష్యానికి వారు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. భవనంపై నుంచి కిందికి రాగానే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. రష్యాకు చెందిన వీరు న్యూజెర్సీలో నివసిస్తున్నారు. 2024లో వచ్చిన 'స్కైవాకర్స్: ఎ లవ్ స్టోరీ' స్ఫూర్తితో ఈ స్టంట్ చేసినట్లు తెలుస్తోంది.*



## ఐఆర్‌సీటీసీ కొత్త ప్యాకేజీ..

### విమానంలో దక్షిణాది ఆలయాల సందర్శన

**న్యూఢిల్లీ:**దక్షిణ భారతంలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను తక్కువ సమయంలో సందర్శించేలా ఐఆర్‌సీటీసీ విమాన ప్యాకేజీని తీసుకొచ్చింది. 'సౌత్ ఇండియా టెంపుల్ రన్' పేరిట దీన్ని లాంచ్ చేసింది. ఈ యాత్రలో మదురై, రామేశ్వరం, కన్యాకుమారి, తిరుచ్చి, త్రివేండ్రంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించొచ్చు. మొత్తం 6 రాత్రులు, 7 పగళ్లు ఈ యాత్ర కొనసాగుతుంది. టికెట్ ధరలు రూ.37,700 నుంచి మొదలవుతాయి. ఆగస్టు 16న ఉదయం 6:10 గంటలకు హైదరాబాద్ నుంచి విమానం బయల్దేరడంతో యాత్ర ప్రారంభమవుతుంది.

**ప్రయాణం ఇలా..**


తొలిరోజు– ఉదయం 6:10 గంటలకు విమానం హైదరాబాద్ నుంచి బయలుదేరుతుంది. త్రివేండ్రం చేరుకున్న తర్వాత ముందుగా కేటాయించిన హోటల్‌లో బస చేస్తారు. అనంతరం అల్పాహారం ముగించుకొని పువార్ ఐలాండ్, అజిమల శివాలయాన్ని సందర్శిస్తారు. అదే హోటల్‌లో రాత్రి భోజనం, బస ఉంటుంది.రెండో రోజు– మరుసటి రోజు తెల్లవారుజామున పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. అనంతరం బ్రేక్‌ఫాస్ట్ ముగించుకొని హోటల్ చెక్ అవుట్ చేస్తారు. మధ్యాహ్నం కన్యాకుమారి చేరుకుంటారు. అక్కడ సూర్యాస్తమయం పాయింట్ సందర్శిస్తారు. కన్యాకుమారిలో ముందుగా కేటాయించిన హోటల్‌లో రాత్రి భోజనం, బస ఉంటుంది. మూడో రోజు– కన్యాకుమారి హోటల్‌లో అల్పాహారం ముగించుకొని హోటల్ చెక్ అవుట్ చేస్తారు. సమీపంలోని రాక్ మెమోరియల్, తిరువళ్లువర్ విగ్రహాన్ని సందర్శిస్తారు. అనంతరం రామేశ్వరం చేరుకుంటారు. ఆ రాత్రికి హోటల్‌లో భోజనం, బస ఉంటుంది.నాలుగో రోజు– హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేసి రామేశ్వరం, ధనుష్‌కోటి ఆలయాలను సందర్శిస్తారు. స్థానిక ఆలయాలు సందర్శించడానికి యాత్రికులే ప్రైవేటు వాహనాలకు సొంత ఖర్చులు భరించాల్సి ఉంటుంది. రామేశ్వరంలోనే రాత్రి భోజనం, బస ఉంటుంది.ఐదో రోజు– అల్పాహారం చేసి రామేశ్వరంలోని హోటల్ చెక్‌అవుట్ అవుతారు. అబ్దుల్‌కలాం మెమోరియల్‌ను సందర్శిస్తారు. అనంతరం తంజావూరుకు పయనమవుతారు. అక్కడ బృహదీశ్వర ఆలయాన్ని సందర్శిస్తారు. అది ముగించుకుని తిరుచ్చికి బయలుదేరుతారు. అక్కడ కేటాయించిన హోటల్‌లో దిగుతారు. రాత్రి భోజనం, బస ఉంటుంది.ఆరో రోజు– మరుసటి రోజు తెల్లవారుజామున శ్రీరంగం ఆలయాన్ని సందర్శిస్తారు. అనంతరం బ్రేక్‌ఫాస్ట్ చేసి హోటల్ చెక్‌అవుట్ అవుతారు. ఆ తర్వాత మదురై పయనమవుతారు. అక్కడ కేటాయించిన హోటల్లోకి వెళ్తారు. సాయంత్రం షాపింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మదురైలోనే రాత్రి భోజనం, బస ఉంటుంది. ఏడో రోజు– మరుసటి రోజు అల్పాహారం అనంతరం హోటల్ చెక్ అవుట్ చేస్తారు. మీనాక్షి ఆలయాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మదురై ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్ పయనమవుతారు. సాయంత్రం హైదరాబాద్ చేరుకోవడంతో యాత్ర పూర్తవుతుంది.

ప్యాకేజీ వివరాలిలా..

హోటల్లో సింగిల్ ఆక్యుపెన్సీకి (ఒక్కరికే గది) రూ.52,550, డబుల్ ఆక్యుపెన్సీకి రూ.39,850, ట్రిపుల్ ఆక్యుపెన్సీకి రూ.37,700 చెల్లించాలి. 5–11 ఏళ్ల మధ్య పిల్లలకు (విత్ బెడ్) రూ.33,000, 5–11 ఏళ్ల పిల్లలకు (విత్‌అవుట్ బెడ్) రూ.28,700, 2–4 ఏళ్ల పిల్లలకు రూ.21,400 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకేజీలో ఇవి భాగమే.. హైదరాబాద్ నుంచి త్రివేండ్రం; మదురై నుంచి హైదరాబాద్‌కు విమాన టికెట్లు, 7 అల్పాహారాలు, 5 రాత్రి భోజనాలు అందిస్తారు. పర్యటన కోసం ఏసీ బస్సు సౌకర్యం ఉంటుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ సదుపాయం ఉంటుంది. మరిన్ని వివరాలు, ప్యాకేజీ బుకింగ్ కోసం ఈ ఐఆర్‌సీటీసీ టూరిజం.కామ్ వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# ఉక్రెయిన్ ఉక్కిరిబిక్కిరి

క్రూజ్ క్షిపణులు ఉపయోగించింది. దీంతో నిప్రో నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. ఆ దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించడంతో.. పలువురు మెట్రో స్టేషన్లలో ఆశ్రయం పొందారు. ఇది భయంకరమైన శత్రుదాడి అని ఉక్రెయిన్ ప్రభుత్వం అభివర్ణించింది. ఇప్పటి వరకు ఒకరు మరణించారని, 11మంది గాయపడ్డారని వెల్లడించింది. ఇదిలా ఉంటే.. కొన్నిరోజులుగా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకుపడటంతో రష్యా ఉక్కిరిబిక్కిరి అయింది. డ్రోన్లు, క్షిపణుల విడిభాగాలు తయారు చేసే కార్మాగారాలు సహ సైనిక, ఇంధన స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మాస్కోలో బ్లాక్ రెయిన్ కురిసినట్లు వార్తలు కూడా వచ్చాయి. ఈ దాడులతో ఇంధన కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా స్వయంగా అంగీకరించారు. ప్రస్తుతం బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. పెట్రోల్ ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో అందిస్తోంది. ఈ కొరతను అధిగమించేందుకు భారత్ నుంచి రష్యా పెట్రోల్ దిగుమతి చేసుకుంటోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.



# యూజర్‌నేమ్ ఫీచర్.. అనుమానాలకు స్పష్టతనిచ్చిన వాట్సప్

**వాషింగ్టన్:**మెటా మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ప్రకటించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కేంద్రం కూడా నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఈ ఫీచర్‌పై వస్తోన్న అనుమానాలకు వాట్సప్ వివరణ ఇచ్చింది. ఆ ఫీచర్‌ను ఇటీవలే ప్రకటించామని, విస్తృతస్థాయిలో అది అందరికీ అందుబాటులోకి రాలేదని మరోసారి వెల్లడించింది. ఈ ఏడాది చివరి నాటికి దశలవారీగా ఇది అందరికీ అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా యూజర్ల నుంచి వస్తోన్న ప్రశ్నలకు సమాధానాలిచ్చింది.

**ప్రశ్న: యూజర్‌నేమ్ తప్పనిసరా..?**

**సమాధానం:** కాదు.. ఆప్షనలే. మీకు కావాలనుకుంటేనే మీరు పేరును రిజర్వ్ చేసుకోవచ్చు. లేదంటే నంబరుతోనే కొనసాగించొచ్చు.

**ప్రశ్న: నాకు కావాల్సిన యూజర్‌నేమ్ అందుబాటులో లేకపోతే..?**

**సమాధానం:** కోరుకున్న యూజర్‌నేమ్ అందుబాటులో లేకపోవడానికి కొన్ని కారణాలున్నాయి. ఆ పేరుమీద ఇప్పటికే ఇన్‌స్టా, ఫేస్‌బుక్ యూజర్లు ఉంటే.. వారికే దాన్ని కేటాయిస్తాం. అలాగే సెలబ్రిటీలు, ప్రభుత్వ సంస్థలు, మెటా ధ్రువీకరించిన ఖాతాదారుల పేర్లు కొన్నింటిని ఇప్పటికే రిజర్వ్ చేశాం. వాటిని చట్టబద్ధమైన యజమానులు మాత్రమే క్లెయిమ్ చేసుకోవడానికి వీలుంది. ఆ పేర్లను మీరు ఉపయోగించడానికి ప్రయత్నిస్తే.. అందుబాటులో లేదనే సమాధానం వస్తుంది. కొత్త పేరుకోసం యూజర్‌నేమ్ జనరేటర్ ఆప్షన్‌ను వాడుకునే వీలు కల్పిస్తున్నాం.

**ప్రశ్న: నా పేరిట ఇతరులను మోసం చేయడానికి నా యూజర్‌నేమ్ లాంటిదే క్రియేట్ చేసి మెసేజ్‌లు చేస్తే.. మోసపూరిత వ్యక్తులను ఎలా ఆపాలి?**



**సమాధానం:** మెసేజింగ్ కోసం యూజర్‌నేమ్‌లు ఇంకా అందుబాటులోకి రాలేదు. అవి అందుబాటులోకి వచ్చిన తర్వాత కొత్త వారి నుంచి సందేశం వస్తే.. ఏ దేశం నుంచి అది వచ్చిందో వెల్లడిస్తాం. మొదటిసారి వచ్చినప్పుడు ఒక హెచ్చరిక చేస్తాం. బ్లాక్, రిపోర్ట్ వంటి ఆప్షన్లనూ కొనసాగిస్తాం.

**ప్రశ్న: నా యూజర్‌నేమ్‌ను ఎవరైనా గెస్ చేసి, అపరిచితులు మెసేజ్ చేయడానికి వీలు ఉందా..?**

**సమాధానం:** వాట్సప్‌లో కొత్తవారి నంబర్ కోసం వెతకడానికి అవకాశం లేనట్లే.. యూజర్‌నేమ్‌ను సెర్చ్ చేయడానికీ వీలుండదు. అయినప్పటికీ మీరు మరింత భద్రత కోసం యూజర్‌నేమ్ కీ ఆప్షన్, వాట్సప్‌కే ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌ను ఎంచుకోవడం వంటి మార్గాలున్నాయి.

**ప్రశ్న: యూజర్‌నేమ్ కీ అంటే..?**

**సమాధానం:** యూజర్‌నేమ్‌తో పాటు అదనపు భద్రత కోసం ఈ కీని ఉపయోగించుకోవచ్చు. ఇది ఎనేబుల్ అయి ఉంటే.. కొత్త వ్యక్తులు మిమ్మల్ని సంప్రదించడానికి యూజర్‌నేమ్‌తో పాటు ఈ కీ కూడా తెలిసి ఉండాలి. ఈ కీని రీసెట్ చేసుకునే వీలు ఉంటుంది.

**ప్రశ్న: మెటాలో ఉన్న ఇతర ఖాతాలను (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) లింక్ చేయాలా..?**

**సమాధానం:** ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఖాతాలకు ఉన్న యూజర్‌నేమ్‌నే కోరుకుంటే.. వాటిని లింక్ చేయాల్సి ఉంటుంది. ఆ ఖాతాకు చట్టబద్ధమైన యజమాని అని నిర్ధరించుకునేందుకు ఇది ఒక మార్గం. కావాలనుకున్నప్పుడు అన్‌లింగ్ చేయొచ్చు. వాట్సప్‌నకు ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌ను ఎంచుకోవచ్చు.

వాట్సప్ కొత్తగా తీసుకొచ్చిన ఈ యూజర్‌నేమ్ ఫీచర్‌తో.. నకిలీ గుర్తింపు ధ్రువీకరణలు పెరిగి, మోసాలు అధికమవుతాయనే ఆందోళనలు నెలకొన్నాయి. ప్రముఖ సంస్థలు, వ్యక్తులను పోలిన పేర్లతో యూజర్ నేమ్ తీసుకుని, అమాయకులకు మెసేజ్‌లు పంపి మోసగించే వీలుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం నోటీసులు జారీ చేసింది. సైబర్‌నేరాలు పెరిగే ప్రమాదం ఉన్నందున, ఐటీ చట్టం ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని మెటాను కేంద్రం ఆదేశించింది. మూడు రోజుల్లో సవివర నివేదిక అందించాలని, దీనిపై సమగ్ర పరిశీలన జరిపి, తాము సంతృప్తి చెందేవరకు భారత్‌లో అమలు చేయొద్దని ఆదేశించినట్లు కథనాలు వెలువడ్డాయి.




# బెల్ట్ జోరు గ్రామాలు బేజారు

## పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్న బెల్ట్ షాపులు

- యువతను బానిసల్ని చేస్తున్న మద్యం దందా
- మామూలు మత్తులో ఎక్సైజ్ అధికారులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి):** సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, నిబంధనలు ధిక్కరించి మద్యం విక్రయాలు జరుగుతున్నా యని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తోంది.


ప్రధాన రహదారులు, గ్రామ కూడళ్లు, కిరాణా దుకాణాల సమీపంలో కూడా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో యువత మద్యానికి బానిసలై కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దివాళా తీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. అనేక కుటుంబాల్లో కలహాలు పెరిగి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు.



బెల్ట్ షాపుల నిర్వహణపై ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమ విక్రయాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలి, అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలి, యువతను మద్యం నుంచి దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి, అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలపై అధికారులు తక్షణం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# యాభై వేల కోట్లతో పరిగి ప్రగతి పథంలో దూసుకెళ్తోంది

- కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలతో దూకుడు
- ఆర్‌ఆర్‌ఆర్, రైల్వే, ఆసుపత్రి, ఎకో అర్బన్ పార్క్ లాంటి భారీ ప్రాజెక్టులు
- ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, ఉచిత విద్యుత్
- పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలి



**దోమ, జూలై 2 (జనం సాక్షి):** పరిగి నియోజకవర్గం చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ.50 వేల కోట్లతో రహదారులు, రైల్వే, ఆరోగ్యం, విద్య, సాగునీరు, పారిశ్రామిక రంగాల్లో భారీ ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డా. టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు.దోమ మండలం దిర్సంపల్లి గ్రామంలోని పటేల్ ఫంక్షన్ హాల్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాంతకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో కార్యక్రమాలు విస్తృతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

బడేంపల్లి గ్రామంలో నూతన స్వయం సహాయక సంఘం భవనం, బుడ్లాపూర్‌లో పాఠశాల ప్రహరీ గోడ, కిష్టాపూర్‌లో సీసీ రోడ్లు, భవన నిర్మాణం లాంటి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పరిగి నియోజకవర్గం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని,ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్, నేషనల్ హైవే, రైల్వే లైన్, నేవీ రాడార్ స్టేషన్, ఎకో అర్బన్ పార్క్ వంటి భారీ ప్రాజెక్టులు రానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. జాఫర్‌పల్లి సమీపంలో 140 ఎకరాల్లో ఎకో అర్బన్ పార్క్, పూడూరు మండలంలో రూ.3,000 కోట్లతో నేవీ ప్రాజెక్టు, పరిగి–షాద్‌నగర్, పరిగి–వికారాబాద్ నాలుగు లైన్ల రహదారులు, గడిసింగాపూర్–రంగారెడ్డిపల్లి డబుల్ రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. వికారాబాద్–నస్కల్–పరిగి–కొడంగల్–నారాయణపేట్–మక్తల్ రైల్వే లైన్ కోసం రూ.450 కోట్ల భూ సేకరణ నిధులు మంజూరైనట్లు, కొందుర్గు–పరిగి–లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు భూ సేకరణ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. పరిగి పట్టణంలో రూ.27 కోట్లతో 100 పడకల అత్యాధునిక ప్రాంతీయ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారుల కోసం హ్యామ్ పథకం ద్వారా భారీ నిధులు విడుదల చేశారన్నారు.

ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ఇంటింటికీ చేర్చాలని, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను మూసివేయొద్దు

- ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి : ఎస్ఎఫ్ఐ
- డైరెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత, విద్యార్థి నాయకుల అరెస్టు





**ముషీరాబాద్, జులై 2 (జనం సాక్షి):** రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించింది. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులను అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులపై లాఠీచార్జీ జరిగిందని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాల్సిన సమయంలో వాటిని మూసివేస్తామని ప్రకటించడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యార్థులకు యూనిఫాంలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకం వంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని వారు పేర్కొన్నారు. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, రన్నింగ్ వాటర్, కంప్యూటర్ ల్యాబ్‌లు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని, వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపైనా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. ఈ ఆందోళన లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, కె. అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.వై. ప్రణయ్, కార్తీక్, లెనిన్ గువేరా, రమేష్, వెన్నెలతో పాటు పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సంఘం తెలిపింది.



# చివరి లబ్ధిదారుని వరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

**25వ డివిజన్ లో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి.**

**కరీంనగర్ అర్బన్, జులై 2 (జనంసాక్షి) :** ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని కరీంనగర్ నియోజకవర్గంలో ప్రభుత్వం రెండవసారి ఇచ్చిన మంజూరు కలుపుకొని ఇంకా 3 వేల మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు ఇచ్చే అవకాశం ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. 25వ డివిజన్ రోడ్ నెంబర్ 9 లోని లబ్ధిదారుడు గంగాధర కనుకయ్య – భాగ్యలక్ష్మి గృహ ప్రవేశానికి స్థానిక కార్పొరేటర్ గంట శ్రీనివాస్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలు డబుల్ బెడ్రూం ఇండ్లిస్తామని మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని నరేందర్ రెడ్డి తెలిపారు. అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు ఇల్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంట కల్యాణి, దండి రవీందర్, జె.లక్ష్మణ్, రాజారాం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### నిషేధిత గుట్కా స్వాధీనం.. ఇద్దరిపై కేసు

**శంషాబాద్: పోలీసులు, ఈగల్ బృందం సంయుక్తంగా ఆటోనగర్, తొండుపల్లి, పెద్ద షాపూర్ గ్రామాల పరిధిలోని పాన్ షాపుల్లో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్‌పై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోనగర్, గండిగూడలోని రెండు పాన్ షాపుల్లో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, వాటిని విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.**

## రంగారెడ్డి జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శిగా బొల్లం విజయభాస్కర్ రెడ్డి



**శేరిలింగంపల్లి, జూలై 2 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బొల్లం విజయభాస్కర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం శేరిలింగంపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటే నిరుపేదల సంక్షేమ పార్టీ అని, సామాన్య కార్యకర్త నుంచి జాతీయ స్థాయి నేత వరకు మంచి ఆదరణ లభించడంతో పాటు రాజకీయ భవిష్యత్తు కూడా లభించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అభివర్ణించారు. ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజల కోసం పాటుపడే ప్రతి వ్యక్తికి కాంగ్రెస్ పార్టీలో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, ఇందుకు తనకు లభించిన పదవే నిదర్శనమన్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీలో సముచిత స్థానం కల్పించిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పార్టీ భవిష్యత్తు కోసం సామాన్య కార్యకర్తగా కృషి చేస్తానని బొల్లం విజయభాస్కర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# భూపోరాటం భగ్గుమంది..కవిత అరెస్ట్

- సభకు అనుమతి నిరాకరణ.. టెంట్ల తొలగింపు
- ఉద్యమకారుల ధర్నా.. పోలీసులతో తోపులాట
- బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలింపు





**బోడుప్పల్–జనంసాక్షి :** తెలంగాణ రక్షణ సేన చేపట్టిన భూపోరాటం బోడుప్పల్ సర్కిల్ పరిధిలో గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సభకు అనుమతి నిరాకరించిన పోలీసులు టెంట్లను తొలగించి కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో ఉద్యమకారులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కవిత అరెస్టును నిరసిస్తూ కార్యకర్తలు పెద్దఎత్తున ధర్నాకు దిగగా, పోలీసులతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుని ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉప్పల్ బాగాయత్‌లో నిర్వహించాలనుకున్న భూపోరాట సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో నిర్వాహకులు వేదికను బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడకు మార్చారు. అయితే అక్కడ కూడా సభ నిర్వహణకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేస్తూ సభ ఏర్పాట్లను అడ్డుకున్నారు. టెంట్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో భారీ పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని వాటిని తొలగించాయి.

దీనికి నిరసనగా తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు పోలీసుల తీరును ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలను మోహరించి ప్రాంతంలో బందోబస్తును కట్టుదిట్టం చేశారు. భూపోరాటంలో పాల్గొనేందుకు అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కవిత అరెస్టుకు నిరసనగా ఉద్యమకారులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మరోవైపు, ల్యాండ్ పూలింగ్ విధానానికి మద్దతుగా ఉన్న స్థానిక దళిత సంఘాల ప్రతినిధులు తెలంగాణ రక్షణ సేనకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు పలువురు ఉద్యమకారులను అదుపులోకి తీసుకుని ఘట్‌కేసర్‌తో పాటు పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టు చేసిన కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా పోలీస్ స్టేషన్ల ఎదుట కూడా ధర్నాలు కొనసాగాయి.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు జులై 2(జనంసాక్షి) :** అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ మరియు రూరల్ వాటర్ సప్లై అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. బీటీ రోడ్లు, బ్రిడ్జిలు, సీసీ రోడ్లు, డ్రైన్లు, గ్రామపంచాయతీ భవనాలు, ఎస హెచ్.జీ భవనాలు, స్కూల్ ప్రహరీ గోడలు తదితర పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలే మా ప్రభుత్వానికి ప్రాధాన్యం. అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ మరియు రూరల్ వాటర్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

# భూహక్కు సభకు పోలీసుల భారీ అడ్డుకట్ట

- ఉప్పల్ బాగాయత్‌లో ఉద్రిక్త వాతావరణం
- చెంగిచెర్లకు వేదిక మార్చినా అక్కడా మోహరింపు
- పలువురికి నిరోధక అరెస్టులు
- టెంట్లు తొలగించి భద్రత కట్టుదిట్టం

**ఉప్పల్, జూలై 2 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించాలని ప్రతిపాదించిన భూహక్కు సభ ఉద్రిక్తతలకు దారితీసింది. సభ నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం కలగవచ్చని భావించిన పోలీసులు ఉప్పల్ బాగాయత్ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రవేశ మార్గాల్లో పికెటింగ్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు, ఉద్యమకారులు హాజరయ్యే అవకాశం ఉండటంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

సభ నిర్వహించవద్దని నిర్వాహకులకు పోలీసులు స్పష్టం చేసినా, సభ నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగడంతో పలువురిని నిరోధక అరెస్టులు చేశారు. సభా స్థలం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు, స్టేజ్ సామగ్రిని తొలగించారు. సభ ఉప్పల్ బాగాయత్‌లో సాధ్యం కాకపోవడంతో నిర్వాహకులు చెంగిచెర్ల బొల్లిగూడెం పారిశ్రామిక ప్రాంతానికి వేదిక మార్చారు. అయితే అక్కడ కూడా పోలీసులు భారీగా మోహరించి ఏర్పాట్లను తొలగించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. నిర్వాహకులు భూహక్కుల అంశం ప్రజలకు సంబంధించిన కీలక సమస్య అని, ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయాలు తెలియజేసేందుకు సభ నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తదుపరి కార్యాచరణపై నిర్వాహకులు సమావేశమై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉప్పల్ బాగాయత్, చెంగిచెర్ల బొల్లిగూడెం పారిశ్రామిక ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది.

# ప్రేమ పేరుతో మోసం.. మైనర్‌పై లైంగిక దాడి

**ఆటో డ్రైవర్ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**




**కరీంనగర్ టౌన్, జూలై 2, ( జనం సాక్షి) :** ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మానకొండూర్ మండలం జగ్గాయపల్లి గ్రామానికి చెందిన గనుకుండ్ల మురళీకృష్ణ గత రెండేళ్లుగా బాలికను పాఠశాల, కళాశాలకు ఆటోలో తీసుకెళ్తూ పరిచయం పెంచుకున్నాడు. తనకు వివాహం కాలేదని నమ్మించి పలుమార్లు తన ఇంటికి తీసుకెళ్లి లైంగికంగా దోపిడీ చేసినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడికి ఇప్పటికే వివాహమై ఒక కుమార్తె ఉన్న విషయం తెలుసుకున్న తర్వాత బాలిక అతనికి దూరంగా ఉండసాగింది. దీంతో జూన్ 29న ఆమె గ్రామానికి వెళ్లిన మురళీకృష్ణ బలవంతంగా మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని జనసంచారం లేని ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో, సీఐ నిరంజన్ రెడ్డి నేతృత్వంలో గాలింపు చేపట్టి మమ్మకల్ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి ఘటనలో ఉపయోగించిన మోటార్‌సైకిల్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. రిమాండ్ నివేదికలో నిందితుడిపై గతంలో నమోదైన వరకట్న వేధింపుల కేసుతో పాటు కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో పోక్సో కేసు వివరాలను కూడా జతచేసినట్లు వెల్లడించారు.

### యాచారం పీఎస్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారం




**యాచారం :** పోలీస్ స్టేషన్ పరిధిలోని నంది వనపర్తి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘోరానికి పాల్పడిన నిందితుడు రెడ్డమోని మహేష్ ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై యాచారం పోలీసులు ప్రస్తుతం పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చౌదర్పల్లిలో 'కోళ్ల' కుంపటి

## నరకప్రాయంగా మారిన పల్లె జీవనం!

- దుర్వాసనతో ఊపిరాడని వైనం
- ఈగలు, దోమల బెడదతో రోగాల బారిన పడుతున్న పాలిచ్చే ఆవులు, గేదెలు
- నాశనమవుతున్న కూరగాయల పంటలు
- మొండికేసిన కోళ్ల ఫారాల యజమానులు.. పట్టించుకోని అధికారులు!



**యాచారం, జులై 2(జనం సాక్షి) :**
యాచారం, జూలై 2 (జనం సాక్షి): యాచారం మండలం చౌదర్పల్లి గ్రామంలో వెలిసిన కోళ్ల ఫారాలు స్థానిక ప్రజలు, రైతులు, పాడి పశువుల జీవనాన్ని నరకప్రాయం చేస్తున్నాయి. ఫారాల నిర్వహణలో కనీస నిబంధనలు పాటించకపోవడంతో గ్రామం మొత్తం తీవ్ర కాలుష్య కోరల్లో చిక్కుకుంది. సాయంత్రం సమయం కాగానే వచ్చే విపరీత దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. ఫారాల వ్యర్థాల వల్ల ఈగలు, దోమల సంతతి విపరీతంగా పెరిగిపోయి పొలాల్లో వేసిన కూరగాయల పంటలు పూర్తిగా నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలిచ్చే ఆవులు, గేదెలు రకరకాల రోగాల బారిన పడి పాల దిగుబడి తగ్గిపోతోంది. ఈ సమస్యపై బీజేపీ మండల నాయకుడు నడికుడి కృష్ణ, వార్డు సభ్యులు కావలి కిరణ్ కుమార్, కొమ్ము యాదయ్య, రైతులు గొరిగే మల్లేష్, గౌర పర్వతాలు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోళ్ల ఫారాల యజమానులు దోమల నివారణ మందులు కూడా చల్లకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆరోపించారు.

పలుమార్లు లిఖితపూర్వక ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామ ప్రజలను, రైతులను, పశువులను ఈ నరకయాతన నుంచి కాపాడాలని స్థానికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్నికల వాతావరణాన్ని తలపించిన
# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ హౌస్ ఎలక్షన్స్

- ఎన్నికల ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, జులై 02 (జనంసాక్షి) :** విద్యార్థులకు బాల్యదశ నుండే నాయకత్వపు లక్షణాలను అలవర్చాలని, వివిధ రకాల ఎన్నికల గురించి తెలియపరచాలని, ప్రధానంగా పోటీలో ఉండడానికి చాలా ప్రోత్సాహం అందించాలని వాటి ప్రభావాలను విద్యార్థులకు తెలుపడం ద్వారా పాఠశాల వ్యవస్థ చాలా చక్కగా కొనసాగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ప్రజాస్వామ్యబద్ధంగా, ఎన్నికల వాతావరణ తలపించే విధంగా నిర్వహించినటువంటి హౌస్ ఎలక్షన్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో పోటీదారులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపి సమయాన్ని వృధా చేయకుండా గుర్తులను విస్తృతంగా ప్రచారం చేసి గెలువు పొందాలని వారు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓట్లనే అభ్యర్థించడం చాలా కీలకమైనదని, అత్యుత్తమ ఓట్లు రావడానికి చాలా కృషి చేయాలని వారు చెప్పారు. పాఠశాల ప్రాంగణంలో హౌజ్ ఎలక్షన్స్ పురస్కరించుకొని వివిధ విభాగాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు. పాఠశాలలోని విద్యార్థులను సరస్, తేజస్ లక్ష్య, ధ్రువ హౌస్ విద్యార్థులుగా విభజించబడ్డారని చెప్పారు.
ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకంగా వ్యవరించడమే కాకుండా ప్రజల అభివృద్ధి సైతం ఓట్ల మీద ఆధారపడి ఉన్నదని గుర్తు చేశారు.
ఓటు హక్కు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని బాధ్యతయుతమైన ప్రతినిధులను ఎన్నుకోవాలని వారు చెప్పారు. అది పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఓటు హక్కుకు చాలా ప్రాధాన్యత ఉన్నదని, ఓటు హక్కు ద్వారా ఎంపిక చేసుకొని వారికి కావాల్సిన వనరులను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. పాఠశాలలోని వివిధ విభాగాలకు ఎన్నికలు నిర్వహించడం ఒక గొప్ప సాంప్రదాయమని తెలుపుతూ ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ విద్యార్థులకు నమ్మకాన్ని పెంపొందించాలని వారు చెప్పారు. ఎన్నికల ప్రక్రియను నరేందర్ రెడ్డి పర్యవేక్షించి పోటీదారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు అందరూ చాలా ఉత్సాహంగా వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫలితాలను త్వరలో ప్రకటించడం జరుగుతుందని ప్రమాణ స్వీకారం చాలా గొప్పగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పోటీదారులందరూ వారి గుర్తులను ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి

- సింగరేణికి రూ.56 వేల కోట్ల బకాయిలు తక్షణం విడుదల
- కార్పొరేట్ మెడికల్ బోర్డును యథావిధిగా కొనసాగించాలి
- నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగ భద్రతపై బీఎంఎస్ డిమాండ్
- కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



**గోదావరిఖని, జూలై 1 (జనం సాక్షి):** రామగుండం ఏరియా-1లోని ఏరియా వర్క్‌షాప్‌లో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో 12వ వేతన ఒప్పందం (జేబీసీసీఐ-12) కమిటీ ఏర్పాటులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. అనంతరం యాజమాన్యానికి డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పించారు. బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు ఎదురుచూస్తున్న 12వ వేతన కమిటీ ఏర్పాటులో జాప్యం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోందని అన్నారు. కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు ఎలాంటి ఆలస్యం లేకుండా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపి వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
సింగరేణికి ట్రాన్స్‌కో, జెన్‌కోలు చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను తక్షణం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని విమర్శించారు. కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్పొరేట్ మెడికల్ బోర్డు సమావేశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు కర్రావుల మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి తుమ్మ గట్టయ్య, నాయకులు దిశెట్టి అంజయ్య, కొప్పుల సత్యనారాయణ, కటకం సురేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరై 12వ వేతన కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు.

# తులేకలాన్ గ్రామ సమస్యల పరిష్కారానికి మరిన్ని నిధులు మంజూరు చేస్తా

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం, జూలై 2 (జనం సాక్షి ):** ప్రతి పల్లె మెరిసేలా, ప్రజలు మురిసేలా ప్రగతికి బాటలు వేయడమే తన ముఖ్య లక్ష్యమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామ సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులతో కలసి తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. గత రెండున్నేళ్లుగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంకా మిగిలి ఉన్న రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన వంటి పలు ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మంజూరు చేసిన నిధులు, పూర్తయిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, నూతన సమస్యల పరిష్కారానికి మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

నియోజకవర్గంలోని ప్రతి ఊరిని సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేందుకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. తులేకలాన్ గ్రామస్థుల అభ్యర్థన మేరకు ఈ ఊరిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారం అందిస్తానని మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు.





# వాగులు ఖాళీ...



## కోయిలకొండలో అక్రమ ఇసుక దందా బహిరంగం

- సూరారం గ్రామంలో పగలు-రాత్రి తేడా లేకుండా ఇసుక తరలింపు
- ఎమ్మార్వో, ఎస్ఐలకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని గ్రామస్థుల విజ్ఞప్తి

**కోయిలకొండ, జూలై 2 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలో ఇసుక అక్రమణా యతెచ్చాగా సాగుతుంది. సూరారం గ్రామ పరిధి ఉన్న వాగు నుంచి జెసిబిలు పెట్టి ఇసుకను అక్రమంగా తోడుతుండగా.. ట్రాక్టర్లు, బెంజు లారీలతో పగలు అనక రాత్రి అనక తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
పోలీసు, రెవెన్యూ శాఖ అధికారుల అండదండలతోనే గ్రామంలోని వాగులు, చెరువుల నుంచి రాత్రింబవళ్లు ట్రాక్టర్ల, బెంజ్ ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుననందునే రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. ఎంఆర్వో, ఎస్ఐ లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని వాపోయారు. ప్రభుత్వానికి ఆదాయ నష్టం, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలుగుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. అంతేకాకుండా వాగులు, చెరువుల సహజ స్వరూపం దెబ్బతిని పర్యావరణ సమతుల్యతకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారుల నిర్లక్ష్యం వెనుక కారణాలపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మాఫియా ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ మరింత రెచ్చిపోతోందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలనీ డిమాండ్ చేస్తున్నాయి ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సూరారం గ్రామంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు కోరారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాలో పాల్గొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని ఈ దందాను పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. "ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రజల తో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని గ్రామస్థులు హెచ్చరించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి



**మెట్ పల్లి, జులై 2(జనం సాక్షి) :** మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఈరోజు తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాప్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలా రం లింబాద్రి కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్ కలిసి కార్మికుల సమస్యల మీద మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని. 60 సంవత్సరాలు పైబడిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం ఇవ్వాలని అన్నారు. 2016 సంవత్సరంలో కార్మికులు పెద్ద ఎత్తున సమ్మె చేయడం జరిగింది. అప్పుడున్నటువంటి మున్సిపల్ అధికారులు కార్మికులకు క్యాజువ ల్ లీవులు, పండుగ సెలవులు, మహిళా కార్మికులకు 120 రోజుల ప్రసూతి సెలవులు అమలు చేస్తామని తేది:16/07/ 2016 నాడు సర్కులర్ నెంబర్: 741/2014 /2-2 కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్,అన్ని విభాగాల్లో పనులు నిర్వహిస్తున్న టువంటి కార్మి కులందరికీ అమలు చేస్తామని రాతపూర్వకంగా ఇవ్వడం జరిగింది. అదే విధంగా కార్మికులందరికీ సబ్బులు, నూనెలు, చెప్పులు, డ్రెస్సులు, అన్ని అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. నేటికీ మెట్ పల్లి మున్సిపల్ పరిధిలో అమలు కాకపోవడం విడ్డూరంగా ఉంది అన్నారు. చైర్మన్ మరియు మున్సిపల్ కమిషనర్‌లు మా పరిధిలో ఉన్నటు వంటి అన్ని అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ఎండి ఉస్మాన్, జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, మెట్పల్లి పట్టణ అధ్యక్షులు లంక శ్రీకాంత్, ఉల్లెందుల శ్రీను అంతడుపుల అనిల్, లంక సంజీవ్, వాల్గోట్ నరేష్, డి అశోక్ అలాగే 13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, మైలారపు రాము తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో సరికొత్త
# సంస్కరణలు

- సాంకేతికత వినియోగం.. సేవల్లో మార్పులు
- ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట
- అనుబంధ ఆలయాల అభివృద్ధి నుంచి గోశాల ఆధునికీకరణ వరకు సమగ్ర కార్యాచరణ
- సిబ్బంది సంక్షేమం,భక్తుల సౌకర్యాలే పరిపాలనలో ప్రధాన అజెండా

### ఈవో ఎల్ రమాదేవి ప్రత్యేక చొరవతో పారదర్శక పరిపాలన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 2 (జనంసాక్షి) :**
*తెలంగాణలోని ప్రముఖ శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఇటీవలి కాలంలో పరిపాలన,అభివృద్ధి,భక్తుల సేవల రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. రాజన్న ఆలయం ఈఓగా ఎల్. రమాదేవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆలయ పరిపాలనలో పారదర్శకత, ఆర్థిక క్రమ శిక్షణ, సాంకేతికత వినియోగం,భక్తులకు మెరుగైన సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి,ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం లభిస్తోంది.*

**పారదర్శక పరిపాలనకు సాంకేతికత అండ..**
ఆలయ పరిపాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఆలయ ప్రాంగణం,కానుకల కౌంటర్లు,క్యూలైన్ల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణను బలోపేతం చేశారు. ఉద్యోగుల విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు ఫేస్,ఐ-స్కానింగ్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేశారు.దర్శన టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తేదీ, సమయంతో కూడిన డిజిటల్ టికెటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు.టికెట్ల పునర్విక్రయానికి అవకాశం లేకుండా సాంకేతిక చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఆలయ సేవలు, వసతి, దర్శన సమయాలు,ఇతర వివరాలను సులభంగా అందించేందుకు వాట్సాప్ క్యూ ఆర్ కోడ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఆర్థిక క్రమశిక్షణ.. పారదర్శకతకు పెద్దపీట..**
రాజన్న ఆలయ ఆర్థిక వ్యవహారాల్లో క్రమశిక్షణ పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. హుండీ ఆదాయం నిర్వహణలో పారదర్శక విధానాలను అమలు చేయడంతో పాటు ఆలయ ఆదాయ వనరుల బలోపేతానికి చర్యలు చేపట్టారు. టెండర్ల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ పారదర్శక వ్యవస్థను కొనసాగిస్తున్నారు. అవకతవకలకు తావులేకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే విధానాన్ని అమలు చేస్తున్నారు.

**భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం.**
భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు క్యూలైన్ వ్యవస్థను మెరుగుపరిచారు. పండుగలు, ప్రత్యేక రోజుల్లో అదనపు ఏర్పాట్లు చేస్తూ భక్తులకు తాగునీరు, విశ్రాంతి కేంద్రాలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను విస్తరించారు. ప్రసాదాల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు.శ్రీరామనవమి, శివకళ్యాణ మహోత్సవాల వంటి భారీ ఉత్సవాల సమయంలో స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్లలో భక్తుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టడం ప్రత్యేకతగా నిలిచింది.





వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు, వీల్‌చైర్లను అందుబాటులో ఉంచి దర్శనం సులభతరం చేశారు.

**అనుబంధ ఆలయాలకు కొత్త ఊపు..**
ప్రధాన ఆలయంతో పాటు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం, శ్రీ బద్ది పోచమ్మ ఆలయం సహా అనుబంధ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మౌలిక వసతులు మెరుగుపరచడంతో భక్తుల రాక పెరుగుతోంది. భీమేశ్వరాలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. స్వామివారి ప్రచార రథాన్ని తూర్పు రాజగోపురం వద్ద ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు.

**ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల సేకరణ..**
ఆలయ పునర్నిర్మాణం,శాశ్వత అభివృద్ధి కార్యక్రమాల కోసం భక్తుల నుంచి పారదర్శక పద్ధతిలో విరాళాల స్వీకరణకు శ్రీకారం చుట్టారు. దేవస్థానం అభివృద్ధిలో భక్తులను భాగస్వాములను చేసే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.


**గోశాల ఆధునికీకరణ..**
రాజన్న గోశాలలో గోమాతల సంరక్షణకు ఆధునిక సదుపాయాలు కల్పించారు. వేసవి కాలంలో వేడి ప్రభావాన్ని తగ్గించేందుకు కూలర్లు,ఫాగర్లు ఏర్పాటు చేయడంతో పాటు నాణ్యమైన మేత అందించే చర్యలు చేపట్టారు. రైతుల సహకారంతో వరిగడ్డి సేకరణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గోశాలలో మేత కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు.

**సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం.**
ఉద్యోగుల సంక్షేమమే భక్తులకు మెరుగైన సేవలకు పునాది అనే భావనతో సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు నాలుగు రోజుల సెలవులను మంజూరు చేశారు. తక్కువ వేతనాలు పొందే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను ముందుగా విడుదల చేసి,అనంతరం శాశ్వత ఉద్యోగుల జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేయడం ఉద్యోగుల్లో విశేష ఆదరణ పొందింది.

**పారిశుధ్యానికి పెద్దపీట...**
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాజన్న ఆలయం, భీమేశ్వరాలయం, బద్ది పోచమ్మ ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాలన్నింటిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. డ్రైనేజీల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలను ముమ్మరం చేసి భక్తులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. పరిపాలనా పరంగా ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిళ్లు ఉన్నప్పటికీ నిబంధ నల అమలులో రాజీ పడకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ అభివృద్ధి, పారదర్శకత, భక్తుల సేవ అనే మూడు ప్రధా న లక్ష్యాలతో ఈవో ఎల్.రమాదేవి ముందుకు సాగుతున్నారు. సాంకేతికత, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ, భక్తుల సౌకర్యాలు, సిబ్బంది సంక్షేమం, అనుబంధ ఆలయాల అభివృద్ధి వంటి పలు సంస్కరణలతో వేములవాడ రాజన్నక్షేత్ర పరిపాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని దేవస్థాన వర్గాలు,భక్తులు అభిప్రాయపడుతున్నారు.

## శాతవాహన యూజీ 6, 4 సెమిస్టర్ ఫలితాలు విడుదల

- 6వ సెమిస్టర్‌లో 50 శాతం, 4వ సెమిస్టర్‌లో 45 శాతం ఉత్తీర్ణత
- బీబీఏ కోర్సు అత్యధిక ఉత్తీర్ణత
- రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు గడువు
- విద్యార్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు



**కరీంనగర్ బ్యూరో, జూలై 2 (జనం సాక్షి):** శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2026లో నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ (CBCS-19) 6వ సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్), 4వ సెమిస్టర్ (రెగ్యులర్ ం బ్యాక్‌లాగ్), 2వ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్, ఓఎస్డీ టు వీసీ డా. హరికాంత్, పరీక్షల నియంత్రణాధికారి డా. డి. సురేష్ కుమార్‌లు విడుదల చేశారు. 6వ సెమిస్టర్ ఫలితాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల నుంచి 9,361 మంది విద్యార్థులు హాజరు కాగా, 4,721 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒక్కటి సగటు ఉత్తీర్ణత 50 శాతంగా నమోదైంది. ఉత్తీర్ణుల్లో 2,135 మంది డిస్టింక్షన్, 2,580 మంది ఫస్ట్ క్లాస్ సాధించారు. బీబీఏ కోర్సు 65 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది.
4వ సెమిస్టర్ ఫలితాల్లో 7,902 మంది విద్యార్థులు హాజరు కాగా, 3,536 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత 45 శాతంగా ఉంది. ఇందులోనూ బీబీఏ కోర్సు 58 శాతంతో ముందంజలో ఉంది. రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు జూలై 12 వరకు, జవాబు పత్రాల జెరాక్స్ కాపీలకు జూలై 15 వరకు గడువు ఇచ్చారు. విద్యార్థులు ఫలితాలు, మార్కుల వివరాలను శాతవాహన విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.satavahana.ac.inలో చూసుకోవచ్చని పరీక్షల నియంత్రణాధికారి డా. డి. సురేష్ కుమార్ తెలిపారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం

## వ్యవసాయ శాఖ-పోలీసుల సంయుక్త టాస్క్ ఫోర్స్ తనిఖీలు





**సదాశివనగర్, జూలై2 (జనంసాక్షి) :** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందేలా సదాశివనగర్ మండలంలోని విత్తన, ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ-పోలీసుల సంయుక్త టాస్క్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె. ప్రజాపతి మాట్లాడుతూ.. రైతులకు విక్రయించే ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల విక్రయాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ప్రతి దుకాణంలో స్టాక్ రిజిస్టర్, ధరల పట్టిక తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులను మోసం చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎంఆర్పీ కంటే అధిక ధరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయాలు చేయరాదని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి కె. ప్రజాపతి, ఏఎస్ఐ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్‌లో భారీగా గంజాయి పట్టివేత

- రూ.17 లక్షల విలువైన మత్తు పదార్థం స్వాధీనం
- తనిఖీల్లో పట్టుపడ్డ 34.50 కిలోల ఎండిన గంజాయి
- మహేంద్రా బొలెరో వాహనం, రెండు మొబైల్ ఫోన్ల స్వాధీనం

**సంగారెడ్డి బ్యూరో, జూలై 2(జనంసాక్షి) :**

పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్‌వోటీ, కుత్బుల్లాపూర్ మరియు అమీన్‌పూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 34.50 కిలోల ఎండిన గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.17 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కంగిరి నుంచి మహేంద్రా బొలెరో పికప్ వాహనంలో గంజాయిని హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు పక్క సమాచారంతో ఓ ఆర్ ఆర్ సుల్తాన్‌పూర్ ఎగ్జిట్-4 వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, ప్రత్యేక అరలలో దాచిన 17 ప్యాకెట్లలో గంజాయి బయటపడింది. ఈ కేసులో సుమిత్ బిపారి, బబుల్ మండల్‌లను పోలీసులు అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిందితుడు సుఖ్‌దేవ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. నిందితులు ఒడిశా నుంచి హైదరాబాద్‌లోని స్మోకర్లకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో గంజాయితో పాటు మహేంద్రా బొలెరో వాహనం, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



ఈ ఆపరేషన్‌ను షేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్, ఎస్‌వోటీ డీసీపీ శోభన్ కుమార్ పర్యవేక్షణలో అమీన్‌పూర్ పోలీసులు, ఎస్‌వోటీ సిబ్బంది నిర్వహించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డీఎస్పీ భీమ్ రెడ్డి అక్రమాస్తుల కేసు

### మణికొండలో మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి నివాసంలో అవినీతి నిరోధక శాఖ తనిఖీలు

**రాజేంద్రనగర్,జూన్2(జనంసాక్షి) :** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో డీఎస్పీ భీమ్ రెడ్డిపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. భీమ్ రెడ్డి నివాసంతో పాటు ఆయనకు సన్నిహితుడిగా భావిస్తున్న బీజేపీ నాయకుడు, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి నివాసంలోనూ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. మణికొండ లక్ష్మీనగర్‌లోని నరేందర్ రెడ్డి ఇంట్లో పలువురు అధికారుల బృందం పలుగంటల పాటు రికార్డులు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, నగదు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ తనిఖీల సందర్భంగా కొంత నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే స్వాధీనం చేసుకున్న నగదు మొత్తం, ఇతర వస్తువుల వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. డీఎస్పీ భీమ్ రెడ్డికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, బినామీ ఆస్తులు, సన్నిహితుల పేర్లపై ఉన్న ఆస్తుల



కోణంలోనూ అధికారులు దర్యాప్తు సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో నరేందర్ రెడ్డి నివాసంలో సోదాలు జరగడం మణికొండలో చర్చనీయాంశంగా మారింది. అవినీతి నిరోధక శాఖ అధికారులు సేకరించిన పత్రాలు, స్వాధీనం చేసుకున్న ఆధారాల ఆధారంగా తదుపరి విచారణ కొనసాగించనున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

**రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.**





# సింగూర్ డ్యాం మరమ్మతుల్లో నాణ్యత లోపం

### ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



**పుల్కల్, జూలై 2( జనం సాక్షి):** సింగూర్ డ్యాం మరమ్మతు పనులను అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్యాం మరమ్మతు పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సాగడం లేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరమ్మతులు అవసరమైన ప్రాంతాల్లో కాకుండా ఇతర చోట్ల చేపట్టడం, నాణ్యత లేని ఇసుకను వినియోగించడం సరికాదన్నారు. గత ఏడాదే పనులు ప్రారంభమై ఉంటే రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండేవి కావని పేర్కొన్నారు. డ్యాం మరమ్మతు పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయకుమార్, మాజీ సర్పంచులు రాజా గౌడ్, విష్ణయ్య, శ్రవణ్ కుమార్, నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, రాజు, ఇందూరి మోహన్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ప్రాణాలతో చెలగాటం..!

**ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల దందా బట్టబయలు**

- కాలం చెల్లిన బస్సుతో విద్యార్థుల రవాణా
- ఒక స్కూల్ పేరుతో మరో స్కూల్ బస్సు రోడ్డుపైకి..
- నిద్రావస్థలో ఆర్టీవో అధికారులు.. పర్యవేక్షణ కరువు

**నల్లగొండ ప్రతినిధి, జులై 02 (జనంసాక్షి) :**

ఎక్కడో మారుమూల మండలంలో అనుమతుల్లేకుండా స్కూల్ పిల్లల బస్సులు తిరుగుతున్నాయి అనుకుంటే పొరపాటే. నల్లగొండ జిల్లా కేంద్రంలో దర్జాగా ఎలాంటి అనుమతుల్లేని బస్సులు రోడ్డెక్కుతున్నాయి. విద్యార్థుల భద్రతే ప్రాధాన్యమని చెప్పే ప్రైవేటు పాఠశాలల మాటలు ఒకవైపు... ఫిట్‌నెస్ లేని, భద్రతా ప్రమాణాలు లేని బస్సుల్లో చిన్నారులను తరలిస్తున్న వాస్తవం మరోవైపు. నల్లగొండ జిల్లా కేంద్రంలో వెలుగుచూసిన ఈ వ్యవహారం రవాణా, విద్యాశాఖల పర్యవేక్షణపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. జనంసాక్షి దర్యాప్తులో బయటపడిన ఈ అంశాలు పిల్లల ప్రాణాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.










నల్లగొండ పట్టణంలో దేవరకొండ రోడ్డులో గల కృష్ణవేణి హైస్కూల్ చేస్తున్న నిర్వాకం చూస్తే మాత్రం పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ముచ్చట వెలుగుజూస్తోంది. పిల్లల కోసం ఏర్పాటు చేసిన బస్సుకి కనీస ప్రమాణాల్లేవు. అసలు దాని వ్యాలీడిటి కూడా ముగిసింది. అలాంటి బస్సును పిల్లల రవాణా కోసం వాడుతున్నారు. ఆ బస్సుపై ఎంవీఆర్ గెలాక్సీ స్కూల్ అని ఉంటుంది. దానిని నడిపేది మాత్రం కృష్ణవేణి హైస్కూల్. ప్రమాదం జరిగితే తప్ప అధికారులు తమ కళ్లకు కట్టుకున్న గంతలు తీసేలా లేరనే దానికి ఈ సంఘటనే నిదర్శనం. ఆ బస్సు గత రెండు సంవత్సరాలుగా పిల్లల ప్రయాణం కోసం వాడుతున్నరని తెలుస్తుంది. రెండేండ్లుగా గుట్టుగా అధికారులు మౌనం వహించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఫిట్'లెస్'.. వీక్‌నెస్**

నడి పట్టణంలో కనీస ప్రమాణాలు పాటించని పాఠశాల బస్సులు తిరుగుతున్నా రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిట్‌నెస్, వాటి ఇన్సూరెన్స్, కనీస సౌకర్యాలు చూడల్సిన అధికారులు బాధ్యత మరిచారు. ఈ ఒక్క కృష్ణవేణి హైస్కూల్ మాత్రమే కాదు జిల్లా కేంద్రంలో చాలా ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఎలాంటి అనుమతుల్లేకుండానే రోడ్లెక్కుతున్నాయి. వేలు, లక్షల్లో ఫీజులు కడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాణాల పట్ల బిక్కుబిక్కుమంటున్న పరిస్థితి నెలకొంది. వరుస విమర్శలు ఎదురవుతున్నా ఈ ఫిట్‌లెస్ బస్సుల పట్ల ఆర్టీఓ అధికారులు దాడులకు దిగడం లేదనే వాదనలు ఊపందుకున్నాయి. ఒక్క నల్లగొండ పట్టణంలోనే వివిధ పాఠశాలల బస్సులు ఫిట్‌లెస్ లేకుండా ఉన్నట్టు తెలుస్తోంది.

**బట్టబయలు చేసిన జనంసాక్షి**

కృష్ణవేణి హైస్కూల్‌లో ఉన్నది ఒక్కటే బస్సు. దాని నెంబర్ ాూ29ాూ5200. గత రెండేండ్లుగా సుమారు 40 నుండి 50 మంది విద్యార్థుల ప్రాణలతో చెలగాటం ఆడుతున్నారనేది ముమ్మాటికి వాస్తవం. బస్సు బాగుందా అంటే దానికి వెనుక డోర్ లేదు. మొత్తం ఒక ఐరన్ షీట్‌తో మూసి వేసి ఉంది. దాని మెట్లు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. బస్సుకు ఎలాంటి ఫిట్‌నెస్ లేదు.. త్వరలోనే కొత్త బస్సు ఏర్పాటు చేస్తామని డ్రైవరే చెప్పడం గమనార్హం. అది కృష్ణవేణి హైస్కూల్ బస్సయితే వేరే పాఠశాల ఎంవీఆర్ గెలాక్సీ అని ఉందని ప్రశ్నించగా.. మేమే కొనుక్కున్నాం అని డ్రైవర్ తెలిపాడు. ఇదే విషయమై ఎంవీఆర్ గెలాక్సీ చైర్మన్‌ని అడగ్గా.. 'మా బస్సు అమ్మేసి చాలా ఏండ్లు అయ్యింది. మా స్టిక్కర్లు తొలగించాలని చెప్పినా ఇంకా తొలగించలేదు' అని సదరు చైర్మనే ఆశ్చర్యంగా తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా..!?

**మా దృష్టికి వస్తే కఠిన చర్యలు : డిటీఓ కిరణ్ కుమార్**

నల్లగొండ జిల్లాలో స్కూల్ బస్సుల మీద 15 రోజులు స్పెషల్ డ్రైవ్ చేసినం. ఒకటి రెండు కేసులు నమోదయ్యాయి. ఎవరైనా అనుమతులు లేకుండా స్కూల్ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇట్లాంటివి మా దృష్టికి తీసుకొని రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# పంట భూమిలో దొరికిన బంగారం స్వాధీనం

### పురవస్తు శాఖ అధికారులకు అప్పగిస్తాం
### చెన్నారావుపేట తహసీల్దార్ మహమ్మద్ అబిద్ అలీ

**చెన్నారావుపేట, జూలై 02 (జనంసాక్షి) :** కోపాకుల చెరువు వ్యవసాయ పంట భూమిలో దొరికిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెన్నారావుపేట తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ గురువారం తెలిపారు. గత రెండు రోజుల క్రితం జనం సాక్షి దినపత్రికలో కోపాకుల చెరువు వ్యవసాయ పంట భూమిలో బంగారం... అని వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం చెన్నారావుపేట గ్రామ శివారులోని ఈర్య తండా సమీపంలోని కోపాకుల చెరువు వద్ద వ్యవసాయ పంట భూమిలో కూలీలు గులోతు శ్రీదేవి, ధరంసోతు దేవి, బోడ సునీతలు పత్తి పంటలో గడ్డి కలుస్తుండగా బంగారం దొరికినట్లు తెలిపారు. దొరికిన బంగారాన్ని చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డితో కలిసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారం 3. 499 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని పురావస్తు శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బస్ భవన్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు

### జె.బి.ఎమ్ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు తాత్కాలిక నిలిపివేత
### 100% సేఫ్టీ సర్టిఫికేట్ వస్తేనే సర్వీసుల పునరుద్ధరణ

**ముషీరాబాద్, జూలై 02 (జనం సాక్షి):** నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో నడుస్తున్న జె.బి.ఎమ్ ఎలక్ట్రిక్ బస్సులలో వరుసగా హై వోల్టేజ్ బ్యాటరీ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణీకుల భద్రతను దృష్ట్యా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల పరిధిలో తిరిగే జె.బి.ఎమ్ సంస్థకు చెందిన ఎలక్ట్రిక్ బస్సుల కార్యకలాపాలను తాత్కాలిక నిలిపివేతకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. గత నెల జూన్ 21వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కరీంనగర్ సమీపంలో అలుగునూర్ వద్ద జరిగిన బస్సు అగ్ని ప్రమాదము పై పూర్తి నివేదిక రాకమునుపే మరొక సంఘటన జరగడం వలన ప్రయాణీకులు, సిబ్బంది, ప్రజల ప్రాణాల రక్షణే అత్యంత ప్రాధాన్యతగా భావించి, తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

తెలంగాణ ఆర్టీసీ జెబీఎం సంస్థను ప్రమాదాల విశ్లేషణ నివేదిక, శాశ్వత నివారణ చర్యలు, బ్యాటరీ ఫిట్నెస్ సర్టిఫికేషన్, హైదరాబాద్ బస్సు భవన్లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు భద్రతకు సంబంధించిన పలు అంశాలపై స్పందించి తగు నివేదిక సమర్పించవలసిందిగా కోరడం జరిగింది.

పునరుద్ధరణపై నిర్ణయం: ఆర్టీసీ విజ్ఞాపన పై స్పందించిన జె.బి.ఎమ్ సంస్థ పైన పేర్కొన్న పలు అంశాల పైన తక్షణమే నివేదికలు, సిద్ధం చేసేందుకై వారి టెక్నికల్ టీం మరియు చైనా నుంచి బ్యాటరీ నిపుణుల బృందం కూడా ప్రమాద పరిస్థితులు వాటికి దారి తీసిన సందర్భాలను పరిశీలించి పలు నివారణ చర్యలపై నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు, సంబంధిత నివేదికలను ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, సంస్థ నిర్దేశించిన అన్ని షరతులను జె.బి.ఎమ్. యాజమాన్యం పూర్తిగా పాటించినట్లు సంతృప్తి చెందిన పిదప, వారి టెక్నికల్ బృందం "వెహికిల్ ఫిట్ ఫర్ ఆపరేషన్" అని ధృవీకరించిన వాహనాల పునరుద్ధరణ పై తుది నిర్ణయం తీసుకోబడుతుంది. ప్రజారవాణాలో భద్రత విషయంలో టీజీఎస్ ఆర్టీసీ ఎటువంటి రాజీ పడదని, ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణించేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని యాజమాన్యం స్పష్టం చేసింది.

# నకిలీ వీసాలతో మస్కట్ వెళ్లే యత్నం

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 20 మంది మహిళలు అదుపులో..




**శంషాబాద్,జులై2(జనంసాక్షి)** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నకిలీ వీసాలతో మస్కట్ వెళ్లేందుకు ప్రయత్నించిన ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 20 మంది మహిళలను ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఒమన్ ఎయిర్‌వేస్ విమానంలో ప్రయాణించేందుకు వచ్చిన వారి పత్రాలను తనిఖీ చేయగా వీసాలు నకిలీవని గుర్తించారు. దీంతో వారిని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులకు అప్పగించారు. విచారణలో ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేందుకు ట్రావెల్ ఏజెంట్‌ను ఆశ్రయించగా, అతడు అసలు వీసాల పేరుతో డబ్బులు తీసుకుని నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేశాడని మహిళలు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మహిళలను మోసం చేసిన ఏజెంట్‌తో పాటు అతడి వెనుక ఉన్న ముఠా కోసం దర్యాప్తు చేపట్టారు.

# తోటపల్లి రిజర్వాయర్ నీటిని విడుదల చేయండి

**కోహెడ, జూలై 02 (జనంసాక్షి) :** మండుతున్న ఎండలకు వరి నారు మడులను కాపాడేందుకు తోటపల్లి రిజర్వాయర్ నుండి గౌరవెల్లి లింక్ కెనాల్‌కు వెంటనే నీరు విడుదల చేయాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాకు మండలంలోని రాంచంద్రపూర్ గ్రామ రైతులు గురువారం వినతిపత్రం సమర్పించారు. బెజ్జంకి, కోహెడ, చిగురుమామిడి మండలాల పరిధిలోని గాగిల్లాపూర్, వరికోలు, రాంచంద్రాపూర్, ఎర్రగుంటపల్లి, ఓగులాపూర్, ఇందుర్తి గ్రామాలకు చెందిన రైతులు గురువారం కలెక్టరేట్‌లో విజ్ఞప్తి పత్రం అందజేశారు. కెనాల్ పూర్తిగా ఎండిపోవడంతో వరి నారు మడులు దెబ్బతినే పరిస్థితి వచ్చిందని, కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించి కనీసం ఒక రోజు నీటిని విడుదల చేసి తమను ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బలమోహన్ రెడ్డి, భూపతి, లక్ష్మణ్ యాదవ్, సహా పలు గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370